తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 10
March - 2026, Price Rs.20/-

మార్చి 2026
వెల రూ. 20/-
పుటలు - 56



## ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి కల్యాణోత్సవం

(31-03-2026)




## ఒంటిమిట్ట
# శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం

**2026, మార్చి 25 నుండి ఏప్రిల్ 03 వరకు**

| తేదీలు | వారము | పగలు ఉత్సవములు | రాత్రి ఉత్సవములు |
|---|---|---|---|
| 25-03-2026 | బుధవారం | న్యాసాభిషేకము | అంకురార్పణం |
| 26-03-2026 | గురువారం | ధ్వజారోహణం | శేషవాహనం |
| 27-03-2026 | శుక్రవారం | వేణుగానాలంకారం | హంసవాహనం |
| 28-03-2026 | శనివారం | వటపత్రశాయి అలంకారం | సింహవాహనం |
| 29-03-2026 | ఆదివారం | నవనీతకృష్ణాలంకారం | హనుమత్సేవ |
| 30-03-2026 | సోమవారం | మోహినీసేవ | గరుడసేవ |
| 31-03-2026 | మంగళవారం | శివధనుర్బాణాలంకారం | ఎదుర్కోలు, కల్యాణోత్సవం, గజవాహనం |
| 01-04-2026 | బుధవారం | రథోత్సవం | ---- |
| 02-04-2026 | గురువారం | కాళీయమర్దనాలంకారం | అశ్వవాహనం |
| 03-04-2026 | శుక్రవారం | చక్రస్నానం | ధ్వజావరోహణం |





# గీతాశ్లోకార్థసారం

**శ్లో : సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।**
**తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-38వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** జయాజయౌ= జయాపజయములను; లాభాలాభౌ= లాభనష్టములను; సుఖ దుఃఖే= సుఖదుఃఖములను; సమే= సమానమైనవానినిగా; కృత్వా= భావించి; తతః= అనంతరము; యుద్ధాయ= యుద్ధము (చేయుట) కొఱకై; యుజ్యస్వ= సన్నద్ధుడవుకమ్ము; ఏవం= ఈ విధముగా (యుద్ధము చేయుటవలన); పాపం= పాపమును; న, అవాప్స్యసి= (నీవు) పొందనే పొందవు.

**భావం:** జయాపజయములను, లాభనష్టములను, సుఖదుఃఖములను సమానముగా భావించి, యుద్ధసన్నద్ధుడవు కమ్ము. అప్పుడు నీకు పాపములు అంటనే అంటవు.

---

## రామ రామ రామకృష్ణ రాజీవలోచన

రామ రామ రామకృష్ణ రాజీవలోచన నీకు
దీమువంటిబంట ననే తేజమే నాది


వారిధి దాఁటి మెప్పించ వాయుజుడ నేఁ గాను
సారెఁ జవుల మెప్పించ శబరిఁగాను
బీరాన సీత నిచ్చి మెప్పించ జనకుఁడఁగాను
యేరీతి మెప్పింతు నన్ను యెట్లఁ గాచేవో

ఘనమై మోచి మెప్పించ గరుడుఁడ నేఁ గాను
కొనఁ గామసుఖ మిచ్చు గోపికఁ గాను
వినుతించి మెప్పించ వేయినోళ్ల భోగిఁ గాను
నినునెట్లు మెప్పింతు ననుఁగాచేదెట్లా

నవ్వుచుఁ బాడి మెప్పించ నారదుఁడ నేఁగాను
అవ్వలఁ బ్రాణ మియ్య జటాయువు గాను
యివ్వల శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి
రవ్వల నా తెరు విదె రక్షించే దెట్లో

అధ్యాత్మిక సంకీర్తన-సంపుటం 15- 26





స్వామీ! విశాల సాగరమును లంఘించి నిన్ను మెప్పించుటకు నేను వాయుపుత్రుడను గాను. పలుతెఱగులైన ఫలరసములతో మెప్పించుటకు నేను శబరిని గాను. సీతను వధువుగా సమర్పించి మెప్పించుటకు నేను జనక మహారాజును గాను, కామసుఖములచే మెప్పించుటకు నేను గొల్ల భామను గాను. వాహనమై నిన్ను మోసి మెప్పించుటకు నేను గరుత్మంతుడను గాను. స్తుతించి మెప్పించుటకు నేను ఆదిశేషుడను గాను. గానముతో మెప్పించుటకు నేను నారదమహర్షిని గాను. ప్రాణముల నొడ్డి మెప్పించుటకు నేను జటాయువును గాను. నేను కేవలము నీ సేవకుడను. నీకు శరణాగతుడను. నిన్ను మెప్పించు పద్ధతి తెలియనివాడను.

శ్రీరామకృష్ణావతారా! శేషశైలనివాసా! సంసారవినాశకా! నీవు నన్నెట్లు కాపాడెదవో గదా!

*(వ్యాఖ్యాత- కీ.శే. విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు)*

ఋషిప్రోక్తం

# అతిథి దేవునిగా అగుగాక!


## ('అతిథిదేవో భవ' - యజుర్వేదం)

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

అతిథిని దేవునిగా భావించి గౌరవించడం మన సంప్రదాయం. లౌకికమైన ఒక మర్యాదగానో, సాటిమనిషిని మంచి చేసుకొనే ఒక ప్రక్రియగానో అతిథిసేవను మనం పరిగణించము. అతిథిని దైవంగా భావించి, అతిథి తృప్తి చెందితే దేవతలు ఆనందిస్తారనే భావనతో సేవించుకుంటాం.

తనంత తానుగా అనుకోకుండా వచ్చిన అతిథితో పాటు, ఆహ్వానించిన వ్యక్తి కూడా గౌరవనీయుడే. తాను, తన కుటుంబ సభ్యులే కాక అతిథి అభ్యాగతులతో కలిసి భోజనం చేసే ఇల్లే ఇల్లని మన ప్రాచీనుల భావన. అతిథులు రాని ఇల్లు ఇల్లే కాదు. 'వచ్చీపోయే అతిథులతో ఇల్లు కళకళలాడాలి' అని గృహిణీ గృహస్థులు కోరుకుంటారు. అతిథి రాని రోజున భోజనం చేయని వ్రతనిష్ఠులైన గృహస్థులు కూడా ఉండేవారు (ప్రస్తుత కాలంలో కూడా అక్కడక్కడా ఉండవచ్చు).

ఒకరికి వండిపెట్టడంలో విసుగు, శ్రమ చూపించకుండా గృహిణీ గృహస్థులు ఆనందంగా, ఉత్సాహంగా కృషిచేసేవారు. శ్రద్ధగా, భక్తిగా అతిథికి భోజనం పెట్టి సేవచేసే భాగ్య మిచ్చినందుకు అతిథికి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించి దీవెనలందుకొనే భవ్యసంస్కృతి మనది.



తమకు తాము కూడా విసుగ్గా వండుకొనే ఈ రోజుల్లో, అతిథి అభ్యాగతులు రాకుండా ఉంటేనే మేలు– అనుకొనే దుఃస్థితిలో చాలామంది ఉన్నారు. దేవతలకి నివేదించి, అతిథులకు ఆరగింపు చేసి, తరువాత భుజించడం అనే అందమైన ఆనవాయితీని ఇప్పుడు పోగొట్టుకున్నాం. రోజూ కాకున్నా, తరచు అతిథి అభ్యాగతులకు భోజనం ఏర్పాటుచేసే సంప్రదాయాన్ని అలవరచుకోవడం ఇంటికి శ్రేయస్సు.

అతిథికి నిలువ నీడ, భోజనం, వస్త్రం ఇచ్చి సత్కరించితే భగవంతుని ఆరాధించినట్లే. పూర్వపు రోజుల్లో శుచిని, ఆచారాన్ని పాటించే శోత్రియులు, అటువంటి ఆచార సంపన్నుడైన గృహస్థు ఇంటికే వెళ్ళేవారు. ఆ గృహస్థు సంతోషంగా ఆచార శుద్ధి కలిగిన ఆహారాన్ని ఏర్పాటు చేసేవాడు. అలాంటి మంచి సంస్కృతి నేడు కరువౌతోంది.

అతిథి అర్ధరాత్రి వచ్చినా విసుక్కోకుండా అన్నం పెట్టే అన్నపూర్ణమ్మలు భారతీయ గృహిణులు – అని నాటి సాహిత్యం అభివర్ణించింది. **'అభ్యాగతః స్వయం విష్ణుః'** అని సంభావించే ఉత్తమసంస్కారం మన ప్రాచీనులది.

దేవతారాధన, పితృతర్పణం, శాస్త్రాధ్యయనం– దేవ, పితృ, ఋషిఋణాలను తీర్చుకొనే సాధనాలు. అతిథిసేవ మనుష్యయజ్ఞం. దీనివలన దేవతలు, పితరులు, ఋషులు సంతోషిస్తారు. వసిష్ఠుడు మొదలైన మహాత్ములు అరణ్యవాసం చేస్తున్నా తమ తపోబలంతో చక్రవర్తులకు సైతం వారికుచితమైన మృష్టాన్న భోజనాలను ఏర్పాటు చేసి అతిథిసేవా ధర్మాన్ని చాటి చెప్పారు.

ఒక భిల్ల దంపతులు తమ ఇంటికి వచ్చిన అతిథికి భోజనం పెట్టి, రాత్రివేళ అతడికి ఆశ్రయమిచ్చేందుకై, తమ చిన్న ఇంటిని ఏర్పాటు చేసి తాము ఆ అడవిలో బైట నిద్రించారు. ఆ సమయంలో రాత్రి వేళ అటు వచ్చిన సింహం వారిని చంపి తినివేసింది. త్యాగపూర్వకంగా, అతిథిని దైవంగా భావించి చేసిన ఈ అపూర్వ సేవకు పరమేశ్వరుడు సంతోషించాడు. ఆ భిల్ల దంపతులే తరువాతి జన్మలో నలదమయంతులుగా పుట్టి అపూర్వ చక్రవర్తి దంపతులుగా భోగాలను, యశస్సును ఆర్జించారు. వారికి అనుసంధానకర్తగా ఆ శివుడే హంసగా అవతరించాడు. *(శివపురాణగాథ)*

ఒక కపోత దంపతులు తమ గూడు ఉన్న చెట్టును ఆశ్రయించిన బోయవాని కోసం తమను తాము సమర్పించుకుని సద్గతిని పొందిన కథను భారతం చెబుతోంది. ఇలా అతిథి సేవాధర్మములను పురాణేతిహాసాలు చాలా తెలియజేశాయి.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 మార్చి, 2026 సంచిక : 10



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు

**ప్రచురణకర్త-సంపాదకులు,**
**ప్రధాన సంపాదకులు** (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య, ఎం.ఏ.(తెలుగు& సంస్కృతం),
ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం &
ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
ప్రధానసంపాదకులు-0877-2264363
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా(12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన
సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
editorsapthagiri@gmail.com;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి
తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని
మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| అతిథి దేవునిగా అగుగాక! | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 04 |
| కమనీయం రమణీయం | డా॥కప్పగంతు రామకృష్ణ | 07 |
| కాలం అనంతమైనది | శ్రీమతి రామలక్ష్మి సదానందం | 10 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమ రావు | 11 |
| సందేహాలు-సమాధానాలు | డా॥రేవూరు అనంతపద్మనాభరావు | 12 |
| శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం | ఆచార్య వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు | 13 |
| భక్తసులభురాలు-శ్రీమహాలక్ష్మి | డా॥ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖరరావు | 15 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 18 |
| అనంత పుణ్యఫలదాయిని కుమారధారాతీర్థముక్కోటి | శ్రీమతి కె.విజయలక్ష్మి | 19 |
| ఆనందనిలయుడి అమృతాన్ని పంచిపెట్టిన అన్నమయ్య! | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 20 |
| సాధకుడికే విజయం | శ్రీ కె.వి.వి.సత్యప్రసాద్ | 24 |
| ఆళ్వార్‌తిరునగరి (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీ కోదండరామస్వామి వారి ఆలయం, తిరుపతి | శ్రీ టి.రామరమేశ్‌కుమార్ | 31 |
| కపిలమహర్షి | సద్గురు డా॥ కందుకూరు శివానందమూర్తి | 34 |
| వేదము - ఉపాంగములు | శ్రీ ముప్పల సుబ్బరామయ్య | 37 |
| భక్తుల కొంగుబంగారం | డా॥మన్నవ గంగాధర ప్రసాద్ | 39 |
| ధార్మికతకు యువహారతి | శ్రీ జె.రవీంద్రనాథ్ | 41 |
| సంతోషాల వసంతకేళి | శ్రీమతి మేడేపల్లి అన్నపూర్ణ | 43 |
| సమవర్తి! నమో నమః | శ్రీ జంధ్యాల శరత్‌బాబు | 45 |
| దానం - కర్తవ్యం (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 47 |
| బలసంపన్నులైన కుమారులుంటే.. (భాస్కరశతకం) | డా॥తిరుమల శ్రీనివాసాచార్య | 47 |
| రామ-సుగ్రీవమైత్రి (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాస దీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| దానమహిమ | శ్రీమతి ఎం.సత్యవతి | 50 |
| క్విజ్ | | 51 |
| బాలవినోదం | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |

ముఖచిత్రం : శ్రీ కోదండరామస్వామివారి కల్యాణోత్సవం, ఒంటిమిట్ట
వెనుకచిత్రం: పదకవితా పితామహుడు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులు



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# ధర్మానికి నిలువెత్తు నిదర్శనం "శ్రీరాముడు"

భారతీయ సంస్కృతిలో పర్వదినాలు కేవలం ఆచారాలకే పరిమితం కావు; అవి మన జీవన విధానాన్ని సరి చూసుకునే అవకాశాలుగా నిలుస్తాయి. అలాంటి పర్వదినాలలో విశిష్టమైనది **"శ్రీరామనవమి"**. అయోధ్యాధిపతి శ్రీరాముడు అవతరించిన ఈ పుణ్యదినం, ధర్మం అంటే ఏమిటి? ఆదర్శ జీవితం ఎలా ఉండాలి? అనే ప్రశ్నలకు సమాధానంగా నిలుస్తుంది. అందుకే *"రామో విగ్రహవాన్ ధర్మః"*– ధర్మానికి నిలువెత్తు ఉదాహరణ శ్రీరాముడు.

శ్రీరాముడు రాజుగా కన్నా ముందు ఒక ఆదర్శపుత్రుడు, భర్త, సోదరుడు, మిత్రుడు. తండ్రి వాక్కు కోసం రాజ్యాన్ని వదిలి వనవాసాన్ని స్వీకరించిన ఆయన త్యాగబుద్ధి, సత్యనిష్ఠ నేటి సమాజానికి అత్యంత అవసరమైన గుణాలు. అధికారము, సంపద, స్వార్థంకోసం విలువలను తాకట్టు పెట్టేకాలంలో, "ధర్మో రక్షతి రక్షితః" అనే సత్యాన్ని తన జీవితంతో చాటి చెప్పిన మహానుభావుడు శ్రీరాముడు. రామాయణం ఒక ఇతిహాసం మాత్రమే కాదు– అది జీవనశాస్త్రం. ప్రతి పాత్ర ఒక బోధ. సీతాదేవి సహనం, లక్ష్మణశత్రుఘ్నుల సేవాభావం, హనుమంతుడి భక్తి, భరతుడి త్యాగం– ఇవన్నీ మనకు మనుషులుగా ఎలా ఉండాలో నేర్పిస్తాయి. అందుకే శ్రీరాముడు దేవాలయాల్లో మాత్రమే కాదు, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాడు. ఈ శ్రీరామనవమి సందర్భంగా, పూజలు–వ్రతాలకే పరిమితం కాకుండా, శ్రీరాముని ఆదర్శాలను మన దైనందిన జీవితంలో ఆచరించేందుకు సంకల్పిద్దాం. సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠ అనే విలువలను పునరుద్ధరించుకుంటూ, సమాజంలో ధర్మప్రభ వెలిగిద్దాం. *'శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః'*– అదే శ్రీరామునికి మనమిచ్చే నిజమైన జోతలు.


ఇక ఈ మాసంలోనే తెలుగువారికి ముఖ్యమైన చైత్రమాసం ఆరంభం కావడం, ఆ పర్వదినాన్ని **"యుగాది"** లేదా **"ఉగాది"**గా సంప్రదాయబద్ధంగా ఆచరించడం పరిపాటి. ఇప్పుడు ప్రభవాది అరవై సంవత్సరాలలో నలభైవదైన **"పరాభవ"**నామ సంవత్సరంలో అడిగిడుతున్నాం. గడచిన 'విశ్వావసు' సంవత్సరంలో చవిచూసిన తీపి గుర్తులను నెమరు వేసుకొని నూతన సంవత్సరంలో జరిపే పనులు సవ్యంగా ఏ ఒడిదుడుకులు లేకుండా సాగాలని ఆ దేవదేవుని వేడుకొందాం.

32,000 వేలసంకీర్తనలు రచించిన పదకవితా పితామహుడు, ద్రవిడాగమ సార్వభౌముడు, వాగ్గేయకారుడైన **'శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 523వ వర్ధంతి'**ని కూడా ఈ నెల ఫాల్గుణ బహుళ (కృష్ణ) ద్వాదశినాడు తిరుమల తిరుపతి దేవస్థానములు అంగరంగ వైభవంగా తిరుపతిలో మరియు వారు జన్మించిన కడపజిల్లాలోని తాళ్లపాకలలో జరపడం ఆనవాయితీ. దశదిశలా వ్యాపించిన వారి సంకీర్తనలను మననం చేసుకొని వారికి ఘన నివాళులర్పిద్దాం.

తిరుమల సప్తగిరులలో ఎన్నో పవిత్రమైన తీర్థాలున్నాయి. వాటిలో అత్యంత మహిమాన్వితమైనది **'కుమారధారతీర్థం'**. ఆ తీర్థముక్కోటి కూడా ఈ నెలలోనే రావడం ముదావహం. ఏడాదికొకసారి ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ప్రకృతి సౌందర్యాల నడుమ తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించే కుమారధారాతీర్థముక్కోటిని దర్శించి, స్నానమాచరించడం భక్తులు ఒక ప్రత్యేక అనుభూతిగా భావిస్తారు.

ఇకపోతే లక్ష్మీజయంతి, మత్స్యజయంతి, హోలీ, ధర్మరాజదశమి పండుగలు; అలాగే తిరుపతి శ్రీకోదండరామస్వామి, వాల్మీకిపురం శ్రీపట్టాభిరామస్వామి, ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు; తిరుమలలో జరిగే శ్రీవారి వసంతోత్సవాలు ఈ నెలలోనే రావడం విశేషం. ఈ ఉత్సవాలలో భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆ యా స్వామివార్ల కృపకు పాత్రులౌదాం. రండి.. తరించండి..!

*'ఓం నమో వేంకటేశాయ'*



# కమనీయం రమణీయం

- డా।। కప్పగంతు రామకృష్ణ, 90329 44115

మార్చి 27 శ్రీరామనవమి సందర్భంగా...

బంధం కలిస్తే బంధుత్వం... పెన వేసుకున్న అనుబంధం అంతులేని సంతోషానికి కారణమవుతుంది.

మనుషుల మధ్య ఈ అనురాగ ముడులను వేసే ఓ ప్రక్రియ పెళ్లి.

వివాహం ఇద్దరు మనుషులనే కాదు, రెండు కుటుంబాలను కూడా కలుపుతుంది. అంతకు మునుపు పరిచయం లేని మనుషుల మధ్య ఆత్మీయతకు కారణమవుతుంది. ఎప్పుడో త్రేతాయుగంలో జరిగినట్లు భావించే సీతారామకల్యాణమూ అంతే... భార్యాభర్తల బాధ్యతలు, అత్త మామల దీవెనలు, వియ్యంకుల మర్యాదలు... అప్పగింతలు, పలక రింపులు... ఇలా ఎన్నో ఆత్మీయాను రాగాలు అందులో అందంగా ప్రతి బింబిస్తాయి.

అందుకే ఆ కల్యాణం లోకానికి ఓ సంప్రదాయమైంది... మార్గదర్శన మైంది.. వాల్మీకి రామాయణంలోని ఈ ఘట్టాలు ఎప్పటికీ అపురూపాలే!!

## ఆ శుభతరుణంలో... పెళ్లి తర్వాత ప్రేమ

నిజానికి శివధనుస్సును రామయ్య కావాలనో, సీతమ్మను వివాహం చేసుకోవాలనో ఎక్కుపెట్టలేదు. తన గురువైన విశ్వామిత్రుని ఆదేశం మేరకే శివధనుస్సుని ఎక్కు పెట్టాడు. ఆ తర్వాత కూడా నేరుగా సీతమ్మను స్వీకరించలేదు. తన తండ్రి దశరథుడు వచ్చి, జనక మహారాజుతో మాట్లాడి, ఇద్దరూ అంగీకరించిన తర్వాతనే సీతమ్మను వివాహం చేసుకోవ టానికి ఇష్టపడ్డాడు. అలాగని, బలవంతపు వివాహం కూడా కాదు. సీతారాములిద్దరికీ ఒకరంటే ఒకరికి వర్ణించలేనంత ప్రేమ.

ప్రియా తు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి।
గుణాద్రూప గుణాచ్చాపి ప్రీతిః భూయోభివర్ధత।। (వాల్మీకి రామాయణం)

పెద్దలు కుదిర్చిన పెళ్లి కదా అని రామయ్య సీతమ్మను మరింతగా ఇష్టపడ్డాడట. సీతమ్మ కూడా తన గుణగణాలతో రామయ్యకు తనపై ప్రేమ కలిగేలా చేసుకుందట. తన వెంట నడచివచ్చిన మహిళను ప్రేమగా చూసుకోవాల్సిన సందేశాన్ని రామయ్య, భర్తను అనురాగంతో, ప్రేమతో మాత్రమే తనవాడిని చేసుకోవాలనే సందేశాన్ని సీతమ్మ తమ వివాహం ద్వారా అందించారు. అందుకనే, సీతారాములు ఆదర్శదంపతులయ్యారు.

## మరి కల్యాణం ఆ రోజెందుకు?

నిజానికి సీతారామకల్యాణం ఉత్తరఫల్గుణి నక్షత్రయుక్త వైశాఖ శుద్ధ దశమినాడు జరిగింది. కానీ 'మహతాం జన్మనక్షత్రే వివాహం' అంటుంది ఆగమశాస్త్రం.

మహాత్ములు, అవతారమూర్తుల జన్మతిథినాడు ఆ నక్షత్రంలో భక్తులు కల్యాణం చేయాలని శాస్త్రనియమం. చైత్ర శుద్ధనవమినాడు పునర్వసునక్షత్రంలో జన్మించాడు శ్రీరాముడు. ఆ పర్వదినాన్ని శ్రీరామనవమిగా ఘనంగా చేసుకుంటారు.

ఈ సందర్భంగా ఊరూవాడా సీతారాముల కల్యాణం జరుపుతారు. ఇలాగే మహా శివరాత్రి సందర్భంగా కూడా శివపార్వతులకు కల్యాణోత్సవం నిర్వహిస్తుంటారు.

## కల్యాణశోభ

అది.. మిథిలానగరం. ఎప్పుడూ ధీరగంభీరంగా ఉండే జనకమహారాజు భవనం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. శివధనుస్సును శ్రీరాముడు విరిచేశాడట. మన జనక మహారాజు గారాల పట్టి సీతను ఆయనే చేపట్టబోతున్నాడు...

## 2026, ఏప్రిల్ నెల ఉత్సవాలు, పర్వదినాలు

**01** తుంబురుతీర్థముక్కోటి

**14** తమిళసంవత్సరాది

**20** పరశురామజయంతి, అక్షయతృతీయ

**21** శ్రీ శంకరజయంతి

**22** శ్రీ రామానుజజయంతి

**30** నృసింహజయంతి, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి

మా జానకేమో చందనపు తునక... మరి రాముడో.... ఆయనేమీ తక్కువ కాదు... నీలమేఘశ్యాముడట, దశరథ మహారాజు చాలా గారాబంగా పెంచాడట... అందంలో చంద్రుడితో పోటీ అట...

అందుకే ఆయనను రామచంద్రుడని పిలుస్తారట...

అంతఃపురమంతా ఇదే ముచ్చట... ఎప్పుడెప్పుడు కన్నులకు పండువ అవుతుందా అని ఎదురుచూపులు...

మహాత్మా! నేను దశరథనందనుడి యశస్సు, వీరత్వాన్ని కళ్ళారా తిలకించాను. నా కుమార్తె సీత, దశరథాత్మజుడైన శ్రీరాముణ్ణి వివాహమాడి మా జనకవంశానికి కీర్తి తెస్తుంది. మీరు అనుమతిస్తే నా మంత్రులు రథాలపై వాయువేగంతో అయోధ్యనగరానికి వెళతారు. ఇక్కడ జరిగింది దశరథ మహారాజుకు వివరించి, వారిని సకుటుంబ సపరివార సమేతంగా మిథిలకు తీసుకొస్తారని విశ్వామిత్రుడికి విన్నవించాడు జనకుడు. విశ్వామిత్రుడు అనుమతించాడు.

విషయం తెలుసుకున్న కౌసల్య, సుమిత్ర, కైకేయిల సంతోషానికి పట్టపగ్గాలు లేవు. నిన్నటి దాకా మన చేతుల్లో ఆడుతున్నట్లే ఉన్నాడు ముద్దుల రాముడు... మన మురిపాల కొండ... అప్పుడే పెళ్లికొడుకవుతున్నాడు. దశరథుడు తన పరివారంతో పాటు వశిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, కశ్యపుడు, మార్కండేయుడు, కాత్యాయనుడువంటి మహనీయులతో, చతురంగబలాలతో విదేహదేశం చేరుకున్నాడు.

వియ్యాలవారిని అల్లంతదూరంలోనే చూసిన జనకుడు వారికి ఎదుర్కోలు పలికి, ఇతర స్వాగత సత్కారాలు చేశాడు. జరిగిన విషయమంతా చెప్పి, తన కుమార్తెను కోడలిగా స్వీకరించమని దశరథుడిని కోరతాడు.

ప్రతిగృహో దాతృవశః శ్రుతం ఏతత్ మయా పురా ।
యథా వక్ష్యసి ధర్మజ్ఞ తత్ కరిష్యామహే వయం ॥

అందుకు దశరథుడు "అయ్యయ్యో! జనకా... అలా అంటావేంటి. అసలు ఇచ్చేవాడంటూ ఉంటే కదా పుచ్చుకునేవాడు ఉండేది. నీ కుమార్తెను నా కోడలిగా చేస్తానంటున్నావు. నువ్వు దాతవు. నేను పుచ్చుకునేవాడిని..." అంటూ ఎంతో ఆప్యాయంగా జనకుడి ఆహ్వానాన్ని స్వీకరిస్తాడు. తన బంధుత్వం మరింతగా దృఢపడాలంటూ వారు ఎంతో ఆప్యాయంగా పరస్పర సంభాషణ చేసుకుంటారు.

అదిగదిగో... ఆ రోజు రానేవచ్చింది. వైశాఖ శుద్ధ దశమి ఉత్తరఫల్గుణి నక్షత్ర శుభముహూర్తాన్ని సీతారాముల కల్యాణానికి వేదమూర్తులు నిర్ణయించారు.

కల్యాణవేదికను సర్వాంగసుందరంగా అలంకరించారు. నానావిధ పరిమళపత్ర పుష్పాలతో కల్యాణమంటపం ముస్తాబైంది. మిథిలా నగరమంతా మహాసందడిగా మారింది. శ్రీరాముడికి సీతతో పాటు లక్ష్మణుడికి సీత సోదరి ఊర్మిళను,

### శ్రీపదకేళి

### :: 122 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 వ | సం | త | ఋ | 2 తు | వు | | 3 పి | |
| నా | | | | క్కు | | 4 మౌ | క | లి |
| 5 యు | గం | 6 ధ | రు | డు | | | ము | |
| వు | | ర్మ | | | | 7 ద | | 8 పా |
| | 9 వ | రా | హ | 10 క | ల్ప | ము | | ప |
| 11 ప | | జు | | పి | | డు | | వి |
| 12 రా | ధ | | 13 వ | ల | 14 పు | | | మో |
| భ | | 15 పూ | | | 16 రు | మ | | చ |
| 17 వ | పు | వు | | | వు | | | నీ |

భరతుడికి జనకుడి సోదరుడైన కుశధ్వజుని పెద్దకూతురు మాండవిని శత్రుఘ్నుడికి కుశధ్వజుని మరోకుమార్తె శ్రుతకీర్తిని ఇచ్చి వివాహం జరిపించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

అటు జనకమహారాజు కన్యాదానం చెయ్యటానికి, ఇటు దశరథుడు కన్యాదానం తీసుకోవటానికి అవసరమైన అన్ని వైదిక కార్యక్రమాలు సశాస్త్రీయంగా నిర్వహించారు. దశరథ మహారాజు కన్యాదానం పుచ్చుకోవటానికి బయల్దేరి జనకుడి సభ బయట ఉండి, తన రాక గురించి మహారాజుకు కబురు చేస్తాడు.

అందుకు ప్రతిగా జనకుడు దశరథుడితో "మహారాజా! ఇకపై జనకుడి ఇంటికి, దశరథుడి ఇంటికి తేడా లేదు. మిమ్మల్ని అక్కడ ఎవరైనా ద్వారపాలకులు ఆపుతున్నారా? మీరు నేరుగా భవనంలోకి రండి. ఇది మీ ఇల్లే అంటూ ఆప్యాయంగా స్వాగతం పలుకుతాడు." ఎంతో ప్రేమ, ఆప్యాయత నిండిన మనస్సుతో జనకుడు చేసిన ఆహ్వానం, పలికిన పలుకులతో దశరథుడు మరింతగా పొంగిపోయాడు.



ఆకాశమంత పందిరి కింద, భూదేవి అంత వేదిక సిద్ధంచేశారు. మంగళవాద్యాలు మారుమోగుతున్నాయి. వేదమంత్రాలు శ్రావ్యంగా వినిపిస్తున్నాయి. సుగంధద్రవ్యాలు గుబాళిస్తున్నాయి. పన్నీటి చిలకరింపులు హాయిగొలుపుతున్నాయి.. మగపెళ్లివాళ్లంతా ఠీవిగా కూర్చున్నారు. వారికి జనకమహారాజు పరివారం నమ్రతగా, వినయవిధేయతలతో సపర్యలు చేస్తున్నారు.

సిరికల్యాణ తిలకంతో, మణిమయ బాసికాలతో, సీతారాములు శోభిల్లుతున్నారు. బంగారుమంటపంలో సీతారాములు వధూవరులుగా కూర్చున్నారు.

వశిష్ఠుడు, విశ్వామిత్రుడువంటి మహర్షుల ఆధ్వర్యంలో పురోహితులు పెళ్లిమంత్రాలు చదువుతున్నారు.

ముహూర్త ఘడియలు సమీపించగానే జనకమహారాజు వేదికపైకి వచ్చి, సీతమ్మ చేతిని తన చేతితో పట్టుకుని....


**ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ ।**
**ప్రతీచ్ఛ చ ఏనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా ।**
**పతివ్రతా మహాభాగా ఛాయా ఇవ అనుగతా సదా ॥**

రామయ్యా! ఇదిగో... నా కుమార్తె అయిన సీత. నీకు సహధర్మచారిణిగా స్వీకరించు. నీకు శుభాలు కలుగుతాయి. ఈమె పతివ్రతగా ఉండి, నిత్యం నిన్ను నీడలా అనుసరిస్తుంది అంటూ సీతమ్మ చేతిని రామయ్య చేతికి అందిస్తాడు. అత్త వారింట ఆడపిల్ల ఎలా నడుచుకోవాలో అన్ని బోధనలూ ఒక్క శ్లోకంలో చెప్పేశాడు జనకమహారాజు. పుట్టింటి నుంచి ఓ తండ్రి కుమార్తెగా అత్తింట అడుగుపెట్టే స్త్రీ, తన భర్తకు సహధర్మచారిణిగా ఉండాలి... అత్తింటివారికి అన్ని శుభాలు కలిగేలా ప్రవర్తించాలి... పతివ్రతగా ఉండాలి... భర్తను నీడలా అనుసరించాలి. ఇలాంటి మహోన్నతమైన జాగ్రత్తలు, సూచనలు చెబుతూ బిడ్డను అత్తవారింటికి సాగనంపాడు.

ఇదీ... కల్యాణమంటే ఇలా జరగాలి. దంపతులంటే సీతారాముల్లాగా ఉండాలి.

# కాలం అనంతమైనది

– శ్రీమతి రామలక్ష్మి సదానందం



కాలం అనేది అందరినీ శాసించే శక్తి. మనం కాలాన్ని ఆపలేము కానీ కాలంతో పాటు మన ధర్మాన్ని మనం నిర్వర్తించాలి. "సమయపాలన కర్తవ్యనిర్వహణ" ద్వారా మాత్రమే మనిషి ఈ కాలచక్రంనుండి విముక్తి పొంది మోక్షాన్ని సాధించగలడు.

ఆధ్యాత్మిక కోణంలో కాలమానం (క్యాలెండర్) అనేది కేవలం తేదీలు, వారాల పట్టిక మాత్రమే కాదు, అది మన జీవిత ప్రయాణానికి కాలచక్రానికి ఒక దిక్సూచి వంటిది. అనేక సంస్కృతులలో కాలాన్ని దైవంగా భావిస్తారు. ("కాలాయ తస్మై నమః"). కాలమానం మనకు కేటాయించబడిన పరిమిత సమయాన్ని గుర్తుచేస్తూ, ప్రతి క్షణాన్ని సార్థకం చేసుకోవాలని బోధిస్తుంది. కాలమానం సూర్యచంద్రుల గమనాన్ని బట్టి రూపొందించబడుతుంది. ఇవి మనం ప్రకృతితో, విశ్వంతో, ఎలా మమేకమై ఉన్నామో తెలియ జేస్తాయి. గ్రహాల గమనం మన మనస్సుపై, శరీరంపై చూపే ప్రభావాన్ని ఇవి సూచిస్తాయి. ధ్యానం, ప్రార్థన లేదా పండుగలకు కాలమానం ఒక క్రమబద్ధ మైన రూపాన్ని ఇస్తుంది. ఒక నిర్దిష్టమైన దినాన ఒక ఆధ్యాత్మిక కార్యాన్ని చేయడంవల్ల మనలో క్రమశిక్షణ, సంకల్పం బలం పెరుగుతాయి.

కాలమానంలోని ప్రతి పండుగ వెనుక ఒక ఆధ్యాత్మిక సందేశం ఉంటుంది. అవి చెడుపై మంచి సాధించిన విజయాన్ని లేదా మనలోని అంతర్గతమార్పును సూచిస్తాయి.

క్లుప్తంగా చెప్పాలంటే కాలమానం అనేది కాల గమనాన్ని గమనిస్తూ, ఆ కాలంలో మన ఆత్మ ఎదుగుదలకు మనం చేసే ప్రయత్నాలను నమోదు చేసే ఒక సాధనం. గడచిన ఏడాదిలో మనం చేసిన తప్పులు, నేర్చుకున్న పాఠాలను నెమరు వేసుకోవడానికి ఇది ఒక మంచి సమయం. మనలోని అరిష డ్వర్గాలను (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు) ఎంతవరకు నియంత్రించాలో ఆలోచించి, కొత్త నిర్ణయాలు తీసుకోవడమే నిజమైన ప్రారంభం.

గడచిన కాలంలో మనకు అండగా నిలిచిన వారికి, మనల్ని నడిపించిన ఆ దైవానికి లేదా ప్రకృతికి కృతజ్ఞతలు చెప్పుకోవడం ఆధ్యాత్మిక ఉన్నతికి మొదటి మెట్టు. కృతజ్ఞత కలిగిన మనస్సు ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది.

కాలం అనంతమైనది. గతం ముగిసిపోయింది, భవిష్యత్తు ఇంకా రాలేదు. ఈ కొత్త ఏడాదిలో ప్రతి క్షణాన్ని దైవ ప్రసాదంగా భావించి, పూర్తి అవగాహనతో జీవించడమే గొప్ప ఆధ్యాత్మికసాధన. మనకోసం మనం జీవించడం సహజం, కానీ ఇతరుల కోసం జీవించడం దైవత్వం. ఈ కొత్త సంవత్సరంలో సాటి మనుషులకు ప్రకృతికి మనవంతు సహాయం చేయడంవల్ల ఆత్మతృప్తి లభిస్తుంది..

"తమసో మా జ్యోతిర్గమయా" అన్నట్లుగా, మనలోని అజ్ఞానమనే చీకటిని తొలగించుకుని, జ్ఞానమనే వెలుగు వైపు అడుగులు వేయడమే కొత్త సంవత్సరం ఇచ్చే అసలైన సందేశం. మనకున్న దానిలో ఇతరులకు సహాయం చేయడం, మనం ఇతరుల జీవితాల్లో వెలుగు నింపినప్పుడు తెలియకుండానే మనలో ఒక లోతైన సంతృప్తి, దైవత్వం చోటు చేసుకుంటాయి. 'పరాభవ' సంవత్సరానికి స్వాగతం చెబుతూ, 'విశ్వావసు' సంవత్సరానికి వీడ్కోలు పలుకుదాం.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమ రావు, 97041 04000

**గతసంచిక తరువాయి..**

ఆ రోజే వేంకటాద్రిలోని శ్రీనివాసుడు తెల్లవారగానే భోజనం చేశాడు. ముత్యాలకుచ్చుగల దట్టిని నడుమునకు బిగించాడు. కురులు సవరించుకొన్నాడు. కురులకు కొండెం కట్టాడు. చందురుగావి రుమాల చుట్టినాడు. తెల్లటి వస్త్రాన్ని వల్లెవాటగా వేసుకొన్నాడు. తదనంతరం తిరుమణి తిరుచూర్ణం నొసటి తీర్చి, ఒంటినిండా చందనమలది యజ్ఞోపవీతం మెరుస్తుంటే-

శ్రీనివాసుడు వినోదార్థం వేటకు వెళ్లాలని సంకల్పించాడు. సరిగ్గా అదే వేళకు ఒక గుర్రం స్వామి దగ్గరకి వచ్చి నిలిచింది. స్వామి గుర్రమెక్కి అడవులకేసి దౌడు తీసాడు. భయంకరమైన జంతువులపై బాణాలు వేశాడు. ఎన్నో మృగాలు నేలకూలాయి. ఆ వేళ ఒక మదం పట్టిన ఏనుగు స్వామిని ఎదిరించింది. స్వామి ఆ ఏనుగు మదం అణచాలని కదిలాడు. కాని, ఆ ఏనుగు పర్వతప్రాంతాల నుండి ఒక్కసారిగా కిందికి ఉరికింది. పదియోజనాల దూరానికి పరుగెత్తి పద్మావతిదేవి తన చెలికత్తెలతో విహరించే వనాల దగ్గర ఆగింది. అక్కడ ఆగడమే గాకుండా భయంకరంగా ఘీంకరించింది. ఆ ఘీంకారానికి పద్మావతి మరి ఆవిడ చెలికత్తెలు జడుసుకొన్నారు. ప్రాణభయంతో చెట్లచాటున దాగారు.

చూడరే! మనం సంచరించే వనప్రాంగణంలో ఒక ఏనుగు హఠాత్తున వచ్చిందేమిటి అన్నది ఒకతె. కళ్ళెత్తి అదే ఏనుగును చూడకర్రా! తలలువంచి ఓరగా చూడరే అంది మరో చెలికత్తె.

మన చెలికత్తె చుట్టూ నిలబడి ఆవిడకు ఎలాంటి ప్రమాదం లేకుండా రక్షగా నిలబడరే అంది ఒక మదవతి.

మనకు ఏమైనా పరవాలేదు. మన పద్మావతికి ఎలాంటి ఆపదలు కలగకుండా రక్షించాలి అంది ఒక సఖి.

ఇలా పరస్పరం మాటలాడుకొంటూ ఉంటే ఒక గుర్రం కనబడింది. తేరిపార చూస్తుంటే ఆ గుర్రం మీద మగవాడు ఇవన్నీ చూస్తున్న చెలికత్తెలు బెదిరిపోయారు. ఏ అనర్థమో అని తమలో తాము అనుకొన్నారు.

గుర్రమెక్కిన వాణ్ణి ఏనుగు తేరిపార చూచింది. ఆ వ్యక్తి మీదికి ఉరకడానికి భయపడి వెనకడుగు వేసింది. అంతేగాదు తొండమెత్తి నమస్కారం చేసి అట్టే నిలిచింది. చివరకు హరి తన్నేమి చేయకపోవడాన్ని గుర్తించి దగ్గరి అడవుల్లో దూరింది. స్వామి కూడా ఎందుకైనా మంచిదని పొదలచాటున దాగాడు.

ఈ దృశ్యాలన్నీ చూస్తున్న చెలికత్తెలు ఏనుగు, గుర్రం కనబడకపోవడం, గుర్రమెక్కి వచ్చిన పురుషుడు అదృశ్యుడు కావడంతో తమలో తాము మాట్లాడుకోసాగారు.



అక్కలారా! ఇందాక మనం చూసిన ఏనుగు, గుర్రం మరి గుర్రమెక్కి వచ్చిన మగవాడు కనబడడం లేదే. అంతా మాయగా కనిపిస్తుంది. మరి మహిమనా? అన్నది ఒకతె.

పోవే! అంతా నీ భ్రమ అంది మరో చెలువ. ఔను. నిజం. అంతా అబద్ధం. అంతా మన భ్రాంతి అంటూ పకపకా నవ్వసాగారు. రాత్రి చాలినంత నిద్రలేని కారణాన కల ఏమో అని అనుకొన్నవారు కొందరు. అహహా! అయినా ఇదంతా చిత్రమే అన్నవారు మరికొందరు.

చివరకు ఒక చోట అందరు గుంపుగా కూడి నవ్వుకొంటూ ఉంటే పద్మావతి వారినందరిని కేకవేసి రమ్మని చెప్పి ఆ వనంలో 'చదరంగం' ఆడసాగింది.

(ఇంకా ఉంది)



# సందేహాలు సమాధానాలు

–డా॥ రేవూరు అనంతపద్మనాభరావు, 98665 86805

**ప్ర) పురాణేతిహాసాలలో ప్రస్తావించే ఆకాశవాణి, అశరీరవాణిల గురించి తెలియజేయండి?** *- సంపత్‌కుమార్, తిరుపతి.*

**జ)** ప్రస్తుతం ప్రసారసాధనాలలో ప్రధానంగా ఉన్న ఆకాశవాణిని 'ఆల్ఇండియా రేడియో' అంటారు. అది శూన్యంలో నుంచి శ్రవ్యమాధ్యమంగా కార్యక్రమాలు ప్రసారం చేస్తోంది. కనిపించని, వినిపించే వాణి ఆకాశవాణి. దానికి శరీరం లేదు కాబట్టి అశరీరవాణి. మహాభారతంలో శకుంతలోపాఖ్యానంలో దుష్యంత మహారాజు కొలువులో శకుంతల నిస్సహాయంగా ఉన్న సమయంలో "భరతుడు నీ బిడ్డయే నని" ఆకాశవాణి ఘోషించింది. పురాణాలలో అనేక సందర్భాలలో ఇలా ఆకాశంలో నుంచి ఒక అశరీరవాణి వినిపించడం గమనిస్తాము.

**ప్ర) విగ్రహారాధన, ఆత్మారాధనలలో ఏది ముఖ్యం?**

*- డా॥ కుటుంబరావు, హైదరాబాదు.*

**జ)** విగ్రహారాధన అంటే మూర్తిరూపంలో దేవతను దర్శిస్తూ పూజించడం. భక్తిమార్గంలో దీనిని "సగుణోపాసన" అంటారు. ఇది భగవంతుని రూపాన్ని, లక్షణాలను, గుణాలను మనస్సులో స్థిరపరచడానికుపయోగకరం. ఈ మార్గాన్ని ఎక్కువగా భక్తులు, గృహస్థులు, సాధారణ జీవులు అనుసరిస్తారు. మనస్సును శాంత పరచడానికీ, దైవభక్తి అలవాటు పడటానికుపయోగకారి.

"ఆత్మలోనే పరమాత్మ ఉన్నాడు", "నానా రూపాలు మాయ– తత్త్వమొక్కటే" అనే బోధనను ఆత్మారాధన అంటారు. దీనిని 'నిర్గుణోపాసన' అంటారు. ఇది ధ్యానం, ఆత్మవిచారణం, స్వజ్ఞానం మీద ఆధారపడ్డమార్గం. ఇది జ్ఞానమార్గానికి చెందినది. గీతలో బోధించబడింది. ఈ మార్గాన్ని తత్త్వవేత్తలు, సన్న్యాసులు, అంతర్యోగులు అనుసరిస్తారు. శంకరాచార్యుల వంటి మహనీయుల గౌరవ భావన ఇది. ఈ రెండు మార్గాలలో ప్రారంభదశలో విగ్రహారాధన అవసరం. భక్తిద్వారా శ్రద్ధ పెరుగుతుంది. ఆ తర్వాత అది ఆత్మారాధనవైపుకు దారితీస్తుంది. ఉదాహరణకు ఒక బాలుడు పాఠశాలలో ప్రారంభంలో బోర్డు మీది అక్షరాలను చూసి నేర్చుకొంటాడు. కాలక్రమంలో అక్షర జ్ఞానం పెరుగుతుంది. అలాగే విగ్రహారాధన తొలిమెట్టు. ఆ పై ఆత్మారాధన తుదిమెట్టు.

**ప్ర) భగవంతుడు గొప్పవాడా? భగవన్నామం గొప్పదా?**

*- శ్రీమతి ఎ.లక్ష్మి, వైజాగ్*

**జ)** "నామస్మరణా ధన్యోపాయం" అన్నారు పెద్దలు. భగవంతుని నామస్మరణ గూర్చి మహాభాగవతంలో అనేకగాథలున్నాయి. ప్రత్యేకించి అజామిళోపాఖ్యానంలో "నారాయణ" నామస్మరణ ప్రాధాన్యం వివరించబడింది. భగవన్నామం ఉచ్చరించబడే చోట యమకింకరులు లోనికి ప్రవేశించడానికి జంకుతారు. ఆ ప్రదేశంలో శాంతితరంగాలు ప్రకంపనం చేస్తాయి. విష్ణు పార్శ్వదులు అక్కడ సంచరిస్తారు. భజన సంప్రదాయం అలా ఏర్పడిందే! ఎల్లప్పుడు భగవంతుడు గొప్పవాడే! ఆయన నామస్మరణం అతి పవిత్రం. యోగులు, సత్పురుషులు సదా భగవన్నామస్మరణతో తరించి ముక్తిని పొందారు. త్యాగయ్య, రామదాసు, అన్నమయ్యవంటి వాగ్గేయకారులు సంకీర్తన సంప్రదాయాన్ని నెలకొల్పారు. 'రామ, రామ' నామస్మరణతో వాల్మీకిమహర్షి అయినాడు. ఆయన రచించిన 'మా నిషాద ప్రతిష్ఠాం త్వం' రామాయణకావ్యం గిరులు, ఝరులు ఉన్నంత కాలం నిలిచి ఉంది. భగవంతుని అంది పుచ్చుకోవడానికి నామస్మరణమే తరణోపాయం.

**ప్ర) మానవులు ఎప్పుడూ భయపడుతూ బ్రతుకుతుంటారు? భయంలేని జీవితం ఉందా? దాన్ని ఎలా జయించాలి?**

*- శ్రీనివాసరావు, ఒంగోలు.*

**జ)** నిజానికి మనిషి ప్రతిదానికీ భయపడుతూ బ్రతుకుతాడు. తనకు నచ్చింది చేయడానికి భయం. దానికి కారణం తాను ఆ పనిని శ్రద్ధగా చేయలేదనే విమర్శవస్తుందని. విజయం సాధించగానే భయం. తదుపరి విజేతగా కొనసాగగలనా? అని భయం.

రేపు– అంటే భయం. రేపు ఏమవుతుందోనని భయం. ఎప్పుడు చనిపోతానో అని భయం. అడుగడుగునా భయం. ప్రశ్నించుకొంటే వీటికి అనేక కారణాలు. తమను తాము న్యూనతాభావంతో తక్కువ చేసుకొనే ఆలోచనలతో బ్రతకడం. ఇవి తప్పును కప్పిపుచ్చుకొనే చక్కెరగుళికల వంటివి. మనిషి శరీరానికి చక్కెరశాతం ఎక్కువైతే ప్రమాదం.

గతాన్నీ, భవిష్యత్తునూ ఆలోచిస్తూ వర్తమానాన్ని వృథా చేయడమే ఈ భయానికి కారణం. దీనిని అధిగమించడానికి తమను తాము విశ్లేషించుకొని తదుపరి అడుగులను మరింత మెరుగ్గా చేసే ప్రయత్నం చేయాలి. ఇది శారీరకబాధ కాదు. మానసిక సంబంధమైనది. మన ఆలోచనల నుండి సృష్టించబడినది భయం. వర్తమానంలో జీవించడమే దీనికి సులభ మార్గం. మనం చేస్తున్న ఏ పనిలో అయినా పూర్తి స్పృహతో ఉంటూ దాన్ని పూర్తి చేయడమే భయాన్ని పారద్రోలే మార్గం.

# శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం

- ఆచార్య వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు, 98492 64607

## మార్చి 19న ఉగాది సందర్భంగా...

పరమాత్ముని సృష్టిలో కాలం ప్రధానమైంది. రాత్రి, పగలు, దినము, పక్షము, మాసము, అయనం, ఋతువు, సంవత్సరం, యుగములు, మన్వంతరములు మొదలైనవి కాలంలో ప్రధానమైనవి.

కాలాన్ని గణన చేయుటకు గాను ప్రభవాది 60 సంవత్సరములు ప్రధానంగా ఉంటాయి.

**చైత్రేమాసి జగద్బ్రహ్మ ససర్జ ప్రథమేఽహని।**
**శుక్లపక్షే సమగ్రం తు తథా సూర్యోదయే సతి॥**

చైత్రమాసంలో శుక్లపక్ష ప్రతిపత్ రోజున సూర్యోదయ సమయంలో పరమాత్మచే సృష్టి ఆరంభించబడినదని అందువలన ఆ రోజు **"యుగాది"** నామం ఏర్పడి అదే రాను రాను **"ఉగాది"**గా రూపాంతరం చెందినట్లు తెలుస్తుంది.

ఆ ఉగాది రోజున బంధుజనంతో ఉత్సాహంగా ఉల్లాసంగా ఆనందంగా గడిపితే ఆ సంవత్సరం మొత్తం ఆనందంగా గడుస్తుందని విశ్వాసం.

మంగళస్నానం ఆచరించి నూతన వస్త్రాభరణములను అలంకరించుకొని, శుచిగా ఆత్మశుద్ధిని కలిగి, శారదాదేవిని, గణేశుని, నవగ్రహాలను, పంచాంగాన్ని ఆరాధించి దైవజ్ఞుని ఆశ్రయించి వారి ద్వారా **తిథి-వార-నక్షత్ర-యోగ-కరణాత్మక** పంచాంగ ఫలితాల్ని శ్రవణం చేయాలి.

**అబ్దాదౌ నింబకుసుమం**
**శర్కరామ్లఘృతైర్యుతం।**
**తద్భక్షయేత్ పూర్వాయామే**
**తద్వర్షఫలమాప్నుయాత్॥**


అనునది ధర్మశాస్త్రవచనం.

సంవత్సరాదియందు మధుర-ఆమ్ల-లవణ-కటు-కషాయ-తిక్తములతో కూడిన షడ్రుచుల సంపర్కాన్ని అంటే వేపపూత, మామిడికాయ, చింతపండు, బెల్లం, పచ్చిమిరప కాయ, ఉప్పు ఇవి ఆయా ఆచారం ప్రకారం గ్రహించి షడ్రుచులుగా వీటిని తీసుకొని లేహ్యాన్ని తయారు చేసి, నివేదన చేసి, భక్షిస్తే నవగ్రహాల ఆనుకూల్యత సిద్ధిస్తుందనేది వచనం.

వివరాల్లోకి వెళితే ఉగాది శుభోదయం అది మహోదయం. వసంత కుసుమోజ్జ్వల భవ్య సుగంధ ద్రవ్య ఆరంభ దినం. పిక శుక శ్రావ్యసుగానం షట్పద షడ్జమ రాగం ప్రకృతి రమణీయసోయగం వసంతం శుభోదయం భవ్యమహోదయం.

ఆ పవిత్ర దినాన అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని దివ్యసన్నిధానంలో విశేషంగా విశిష్టంగా సంప్రదాయ పద్ధతిలో చాంద్రమాన సంవత్సరాది ఉగాది ఆస్థానం వైభవంగా జరుపబడుతుంది. అద్దానిని పరిశీలిద్దాం.

**శ్రీవైకుంఠవిరక్తాయ స్వామి పుష్కరిణీ తటే।**
**రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్॥**



అను స్తుతి వచనానుసారం అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, ఆదిమధ్యాన్తరహితుడు, అప్రమేయుడు అగు శ్రీశ్రీమన్నారాయణుడు వైకుంఠం వీడి తిరుమల క్షేత్రంలో ఆనందనిలయ దివ్యవిమానఛాయలో అర్చామూర్తిగా రారాజ మానుడగుచూ వైఖానస భగవచ్ఛాస్త్రరీతిలో అర్చనోత్సవ స్నపనాదులను అందుకుంటూ భక్తులకు కొంగు బంగారమై విలసిల్లుతున్నాడనుట నిత్యసత్యం.

ఈ స్వామికి జరిగే విశేష ఆరాధనాదులలో విశిష్ట మైంది ప్రప్రథమైంది చాంద్రవత్సరంలో ఆరంభమైంది ఉగాది ఆస్థానసేవ. దానిని పరికిద్దాం.

ఉగాది సందర్భంగా దివ్యఆలయాన్ని అనేక వితాన–ధ్వజ– దర్భమాలా–తరంగ– చేష్టనాదులతో పుష్పమాలలతో, పూర్ణకుంభాలతో, విద్యుద్దీపకాంతులతో, మాలాదీప యంత్రదీప హస్త దీపాదులతో చక్కని తోరణములతో అలంకరిస్తారు. దేదీప్యమానంగా అపరవైకుంఠంలా భాసిస్తుంది శ్రీశ్రీనివాసుని దివ్యధామం.

వైఖానసాగమోక్తంగా స్వామిసన్నిధానంలో స్వామికి ప్రాతఃకాలార్చన పూర్తి అయిన తరువాత ఉత్సవమూర్తులైన శ్రీభూసమేత శ్రీమలయప్పస్వామివార్లను బంగారువాకిలియందు సర్వభూపాలవాహనంలో వేంచేపుచేసి ప్రక్కనే సేనాధిపతివార్లను కించిత్ దక్షిణాభిముఖంగా ఉంచి దివ్యఆభరణములతో పుష్ప మాలలతో అలంకరించి మాధ్యాహ్నికారాధన గావిస్తారు. ఆరాధనలో భాగంగా విశేష అన్న ప్రసాదములతో పాటు లడ్డు వడ మొదలైన పణ్యారములను నివేదన గావించెదరు.

శ్రీవార్లకు సమర్పించేందుకుగాను రజతపాత్రలో పట్టువస్త్రములను ఉంచుకొని జియ్యంగార్లు శిరస్సుపై పెట్టుకొని ఏకాంగులు అధికార జనం ముందునడువగా శ్వేతఛత్రాది మంగళవాయిద్యాలతో ఆలయ విమాన ప్రదక్షిణంగా స్వామి



**శ్రీనివాసుని సన్నిధిలో**
**"గోవింద! గోవింద!!"**
**అని స్మరించండి.**

సన్నిధానమునకు రాగా వాటిని అందుకొని అర్చకులు స్వామి వారికి ఉత్సవమూర్తులను సమర్పిస్తారు. పిమ్మట శ్రీవారి హారతి జరుగుతుంది.

అట్లే, విష్వక్సేనులవారికి సమర్పించిన తదుపరి అర్చక స్వాములు స్వస్తిసూక్తాన్ని పఠిస్తూ అక్షతారోపణము గావించె దరు.

వెంటనే సిద్ధాన్తిగారు నూతన పంచాగ ఫలితములను వివరిస్తారు. సిద్ధాన్తిగారికి మర్యాద జరుగుతుంది.

శ్రీజియ్యంగారు వారికి, సర్కార్‌వారికి, మర్యాద పూర్వకంగా స్వామివారికి హారతి ఇతరములు జరుగుతాయి.

హారతిని ఇచ్చి, సర్కార్ వారి మర్యాదలు పూర్తి చేసి, స్థాన బహుమానపూర్వకంగా ప్రసాదవితరణ గోష్ఠికి విని యోగము జరుగుతాయి.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకునికి జరిగే ఈ ఉగాది ఆస్థానం, పంచాంగ పఠనం, శ్రవణం వీనుల విందుగ మంగళ వాయిద్యములతో, వేదనాదములతో, విశేష అలంకార సంయుక్త ఆభరణాదులతో, విశేషనివేదనాదులతో జరిగే ఈ సేవ భక్తజనులకు కొంగుబంగారమై సకల ఈప్సితములను అందించి ఆయురారోగ్య భోగభాగ్యములను అందించుగాక!

**సూర్యేందూ౽౽ర బుధార్యకావ్యశని రాహూత్వాత నామగ్రహాన్**
**జ్యోతిశ్చక్ర విభాసితానీ జనిమతాం కర్మప్రకాశే స్థితాన్।**
**శేషాద్రిప్రభు దేవ దేవ దయయా లబ్ధా౽ధికారాన్ సదా**
**తస్యానుగ్రహ కాంక్షిణస్సురవరాన్ నిత్యం నమస్కుర్మహే॥**

శ్రీశేషపర్వతమునకు ప్రభువగు శ్రీవేంకటేశ పర దైవము యొక్క దయచే పొందబడిన అధికారము కలవారై, జ్యోతిశ్చక్రమున ప్రకాశించుచు, జన్మబద్ధులగు వారల కర్మ బంధముల ప్రకాశింపజేయుచు, దేవదేవుడగు ఆ శ్రీ వేంకటేశ ప్రభువు యొక్క అనుగ్రహమును సదా కాంక్షించుచున్న, దేవతాశ్రేష్ఠులైన సూర్య, చంద్ర, కుజ, బుధ, గురు, శుక్ర, శని, రాహుకేతువులు అను నవగ్రహములకు నిత్యము నమస్కరిస్తు న్నాము.

*లోకాస్సమస్తాస్సుఖినో భవన్తు।*
*సమస్త సన్మంగళాని భవన్తు।*

**గంధద్వారం దురాధర్షాం నిత్యపుష్టాం కరీషిణీమ్**
**ఈశ్వరీగ్ం సర్వభూతానాం తామిహోపహ్వయే శ్రియమ్॥**

గంధంచేత పరిమళిస్తున్నదియు ఎట్టివారి చేతనూ తిరస్కరింపబడనిదియు, సర్వకాలములలో పైరులతో.. పంటలతో బలముకలదియూ, పశుసంపదను సమృద్ధిగా కలిగినదియూ సమస్తభూతాలకు ఆధారమైన భూమియే స్వరూపంగా గల శ్రీమహాలక్ష్మిని ఆహ్వానిస్తూ ఉన్నాను అని అందరూ పూజిస్తారు. నమస్కరిస్తారు. తమ ఇంటికి విచ్చేయమని ఆహ్వానిస్తారు.

లక్ష్మి అనే పదానికి ఋగ్వేదం అనేక అర్థాలను పేర్కొంది. లక్ష్మి అంటే సంపద, ప్రయోజనం, క్షేమం, యోగం, లాభం మొదలైన అర్థాలు ఉన్నాయి. లక్ష్మి అంటే చిహ్నం లేదా గుర్తు అని అర్థం. లక్ష్మిగా అంటే చిహ్నంగా భాసిల్లుతూ ఉంటుంది. కనుక లక్ష్మి అనే పేరుతో వర్ధిల్లుతూ ఉంటుంది.

## లక్ష్మి ఆవిర్భావం

పూర్వం ఒకసారి దుర్వాసమహాముని ఇంద్రునకు ఒక పుష్పమాలను ఇవ్వగా, ఇంద్రుడు దానిని ఐరావతానికి వేశాడు. ఐరావతం ఆ మాలను క్రిందవేసి కాళ్ళతో తొక్కి ముక్కలు చేసింది. దీనిని చూసి కోపోద్రిక్తుడైన దుర్వాసుడు–

"ఐశ్వర్య గర్వముతోనే నీవు ఈ విధంగా చేశావు. కనుక నీ ఐశ్వర్యమంతా నశించి... నీవు ఐశ్వర్యహీనుడవు అవుగాక..." అని శపించాడు.

దుర్వాసుడి శాపంవల్ల ఇంద్రుడి వైభవమంతా నశించింది. దండయాత్ర చేసి రాక్షసులు స్వర్గలోకాన్ని ఆక్రమించుకున్నారు. దీనితో దేవేంద్రుడు బ్రహ్మదేవుడి వద్దకు వెళ్ళి మొరపెట్టుకొనగా, బ్రహ్మదేవుడు ఇంద్రాది దేవతలతో శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్ళి విషయాన్ని వివరించి దేవతలు స్వర్గలోకాన్ని తిరిగిపొందే మార్గాన్ని చెప్పమని కోరాడు. ఆ సమయంలో అక్కడకు చేరిన కుబేరుడు– "నాకు సృష్టి ప్రారంభంలో నవనిధులు, రత్నములు, ధనమును ఇచ్చారు. ఇంద్రుడికి దేవాధిపత్యం ఇచ్చిన అనంతరం నా నిధులన్నీ వ్యయమైపోయాయి. కనుక నాకు తిరిగి నిధులను సమకూర్చవలసిందిగా ప్రార్థిస్తూ ఉన్నాను" అని పలికాడు.

ఇంద్రుడు, కుబేరుడు చెప్పిన విషయాలను విన్న శ్రీమహావిష్ణువు– "ప్రస్తుతం నిధులు సమాకూరవలెనన్న, స్వర్గలోకం తిరిగి వైభవోపేతం కావలెనన్న క్షీరసాగరాన్ని




**మార్చి 3న లక్ష్మీజయంతి సందర్భంగా..**

మథించాలి. క్షీరసాగరాన్ని మథించడంవల్ల సంపదలు, లక్ష్మీదేవి ఉద్భవిస్తారు. అందువల్ల ఇంద్రుడికి సంపదలు లభిస్తాయి. అంతేకాకుండా క్షీరసాగరాన్ని మథించడంవల్ల అందులో నుంచి అమృతం జనిస్తుంది. దానిని దేవతలు స్వీకరించడంవల్ల అమరత్వం సిద్ధిస్తుంది. బలం పొందిన దేవతలు రాక్షసులను సులభంగా ఓడించగలుగుతారు" అని సలహా యిచ్చాడు.

క్షీరసాగరాన్ని మథించేందుకు దేవతలు, రాక్షసులు క్షీరసాగరం వద్దకు చేరారు. దేవతలకు ఇంద్రుడు నాయకత్వం వహించగా.. రాక్షసులకు బలిచక్రవర్తి నాయకత్వం వహించాడు. పాలసముద్రమును చిలికేందుకు మందరపర్వతాన్ని కవ్వంగా, దానికి తాడుగా వాసుకి అనే సర్పమును చేసుకున్నారు. మందరపర్వతాన్ని పాలసముద్రంలోనికి దించగానే పర్వతము పట్టుతప్పి పడిపోయింది. దానిని పైకి లేపేందుకు శ్రీమహావిష్ణువు స్వయంగా శ్రీకూర్మరూపాన్ని ధరించి మూపుతో మందర పర్వతాన్ని ఎత్తిపట్టుకోగా, వాసుకి సర్పం తోకవైపు దేవతలు, తలవైపు రాక్షసులు పట్టుకుని మథించడం ప్రారంభించారు. కొంతసేపటికి అందులో నుంచి ముందుగా హాలాహలం జనించింది. దానిని శివుడు స్వీకరించి కంఠంలో ధరించి 'గరళకంఠుడు', 'నీలకంఠుడు' అయ్యాడు. తర్వాత జనించిన 'సురభి' అనే గోవును ఋషులు స్వీకరించారు. అనంతరం "ఉచ్చైశ్రవం" అనే తెల్లని అశ్వం జనించగా దానిని బలిచక్రవర్తి స్వీకరించాడు. ఆపై 'ఐరావతం' అనే ఏనుగు, కల్పవృక్షం,

కామధేనువు జనించగా ఇంద్రుడు స్వీకరించాడు. పిమ్మట చంద్రుడు, అనంతరం కొంతసేపటికి క్షీరాబ్ధినుంచి **శ్రీమహాలక్ష్మి** ఆవిర్భవించింది. లోకోత్తరమైన సౌందర్యంతో ఉన్న ఆమెను మణిమయపీఠం నందు ఆసీనురాలిని చేశారు. ఏనుగులు తొండములను ఎత్తి గళములోని నీటితో స్నానం చేయించాయి. సముద్రుడు పట్టువస్త్రాలను సమర్పించాడు. వరుణుడు వైజయంతీ మాలను, విశ్వకర్మ కేయూరాదులను, సరస్వతీదేవి తారకహారాన్ని అందించగా, సృష్టికర్త బ్రహ్మదేవుడు పద్మాన్ని అందించగా, ఆమె ఆ పద్మంపై ఆసీనురాలైంది. అప్పుడే అక్కడకు శ్రీమహావిష్ణువు విచ్చేసి లక్ష్మీదేవిని వివాహం చేసుకున్నాడు. ఆమె సంపదలకు అధిష్ఠాన దేవత అయి సంపదలను ప్రసాదించింది.

## భృగువు పుత్రిక

విష్ణుపురాణం ప్రకారం శ్రీమహాలక్ష్మి భృగుమహర్షి పుత్రిక. భృగుమహర్షి భార్య ఖ్యాతి, వీరికి పుత్రసంతానం కలిగింది. కానీ కుమార్తెలు కలుగలేదు. ఆమె తపస్సు చేసింది. తపస్సును మెచ్చి జగన్మాత ప్రత్యక్షమై వరం కోరుకోమనగా, కుమార్తెను ప్రసాదించమని వరం కోరింది. జగన్మాత వరం మేరకు భృగుమహర్షి దంపతులకు ఒక కుమార్తె కలుగగా ఆమెకు 'లక్ష్మి' అని పేరుపెట్టి. పెంచుకున్నారు. 'లక్ష్మి' విష్ణువు తన భర్త కావాలని కోరి తపస్సు చేసింది.

బ్రహ్మదేవుడి పుత్రుడు ప్రజాపతి దక్షుడు. దక్షప్రజాపతి పుత్రుడు ధర్ముడు. ధర్ముడు కూడా ప్రజాపతి, ధర్ముడి భార్య "సాధ్య", ధర్ముడికి నరుడు, నారాయణుడు, హరి, కృష్ణుడు అనే నలుగురు కుమారులు కలిగారు. వీరందరూ తపస్సు చేస్తూ ఉండగా, వారి తపస్సును భంగపరచడానికి అప్సరసలు వచ్చారు. నారాయణుడు విశ్వరూపాన్ని చూపించగానే వారు వెళ్ళి పోయారు. అటువంటి నారాయణుడే 'విష్ణువే'. విష్ణువు భర్త కావాలని తపస్సుచేస్తూ ఉన్న లక్ష్మీదేవి తపస్సును మెచ్చి నారాయణుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమనగా– విష్ణువు భర్త కావాలని కోరింది. అందుకు నారాయణుడు– "నేనే విష్ణువును" అని పలుకగా– "మీ విశ్వరూపం చూపిస్తే నేను మిమ్ములను నమ్ముతాను, వివాహం చేసుకుంటాను" అని సమాధానం ఇచ్చింది.

నారాయణుడు విశ్వరూపాన్ని చూపించాడు. లక్ష్మీదేవి వివాహానికి అంగీకరించింది. దేవేంద్రుడు మధ్యవర్తిగా.. ధర్ముడు పురోహితుడుగా వివాహం జరిపించారు. ఈ విధంగా లక్ష్మి మహావిష్ణువును వివాహం చేసుకుని సంపదలకు అధిపతి అయినట్లు విష్ణుపురాణం వెల్లడిస్తూ ఉంది.

## భక్తసులభురాలు

సంపద, ఐశ్వర్యానికి ప్రతీక అయిన లక్ష్మీదేవి నివసించే ఇల్లు అమృతపదము. ఆమె చూపు ప్రసరిస్తే చాలు సంపదలు కలుగుతాయి. ఆమె చిరునవ్వు సమస్తదుఃఖాలను హరింపచేసి.. ఆనందాన్ని వర్షింపచేస్తుంది. అందుకు తార్కాణాలు ఎన్నో...

## కనకధారాస్తవం

పూర్వం ఆదిశంకరాచార్యులవారు ఒక నిరుపేద ఇంటికి భిక్షాటనకు వెళ్ళారు. అతిథికి ఆతిథ్యం ఇవ్వలేని ఆ ముత్తైదువ తన దురదృష్టానికి, పేదరికానికి దుఃఖిస్తూ... ఇల్లంతా వెదకి దొరికిన ఒక ఎండిపోయిన ఉసిరికకాయను తీసుకుని వచ్చి భిక్షగా శ్రీఆదిశంకరాచార్యుల వారికి సమర్పించింది. ఆమె పేదరికాన్నీ, దుఃఖాన్ని చూసిన శంకర భగవత్పాదులవారు–

"అంగం హరేః పులకభూషణ మాశ్రయంతే...
మాంగల్యదాస్తు మమ మంగళదేవతాయాః॥ ..."

అని మొదలుపెట్టి **'కనకధారాస్తవం'** గానం చేశాడు.



అంతే.. ఆ ఇంట లక్ష్మీదేవి ప్రసన్నురాలై బంగారు ఉసిరికకాయల వర్షం కురిపించింది. ఈనాటికీ శ్రీకనకధారా స్తోత్రం పఠించడం, పారాయణం చేయడంవల్ల ఆ తల్లి కరుణాకటాక్షాలు వర్షిస్తూ ఉన్నాయి.

## లక్ష్మీస్తోత్రం

పూర్వం ఒకసారి దేవేంద్రుడు- **"నమస్తే సర్వలోకానాం జననీ..... విష్ణువక్షఃస్థలస్థితామ్"** అని ప్రారంభించి లక్ష్మీదేవిని స్తుతించగా, సంతోషించిన లక్ష్మీదేవి ప్రసన్నమై ఏదైనా వరం కోరుకోమనగా, ఈ స్తోత్రం పఠించినవారిని కటాక్షించమని కోరగా.. లక్ష్మీదేవి సమ్మతించింది. విష్ణుపురాణంలో చెప్పబడిన లక్ష్మీస్తోత్రాన్ని పఠించడంవల్ల లక్ష్మీదేవి సులభంగా ప్రసన్నురాలవుతుంది.

## లక్ష్మీదేవి నివాసస్థానాలు

శ్రీలక్ష్మీదేవి నివాసస్థానాలు ఐదుగా చెప్పబడ్డాయి. **ఏనుగు కుంభస్థలం, బిల్వదళము వెనుక ఈనెభాగం, గోమాత పృష్ఠభాగం, స్త్రీ పాపిటస్థానం, పద్మం** అనేవి ఐదు లక్ష్మీస్థానాలు, వీటిని పూజించండం, గౌరవించడంవల్ల లక్ష్మీకటాక్షం కలుగుతుంది.

## లక్ష్మీదేవి రూపాలు

దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం స్థితికారుడైన శ్రీమహావిష్ణువు దశావతారాలను ఎత్తాడు. ఈ విధంగా శ్రీమన్నారాయణుడు అవతారం ధరించినప్పుడంతా శ్రీమహాలక్ష్మీదేవి కూడా అవతారం ధరించి ఆయన వెంటవచ్చింది. ఆయనకు సహకరించింది. ఏ రూపంలో వచ్చినా ఆ తల్లిని సంపదల తల్లిగానే పూజించడం జరిగింది. ఈ లోకంలోని తన బిడ్డలకు అన్నీ ప్రసాదించేందుకే ఆ తల్లి అష్టరూపాలను ధరించింది. తన అష్ట విధమైన అంశాలతో తన బిడ్డలకు అష్టశక్తులను ప్రసాదించేందుకు **ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, ధనలక్ష్మి** అనే ఎనిమిది రూపాలను ధరించింది. ఈ రూపాలకే 'అష్టలక్ష్ములు' అని పేరు. ఈ లక్ష్మీదేవి అష్టరూపాలు మానవజాతి మనుగడకు ప్రధానమైన సంపదలు! **శ్రీఆదిలక్ష్మి**గా జీవనానికి అవసరమైన ప్రాణశక్తిని; **శ్రీధాన్యలక్ష్మి**గా సస్యసంపదలను, ధాన్యాలను; **శ్రీధైర్యలక్ష్మి**గా ధైర్యసాహసాలు, వీరత్వాన్ని, శౌర్యాన్నీ; **శ్రీగజలక్ష్మి**గా సకలవిధాలైన శుభాలను; **శ్రీవిజయలక్ష్మి**గా చేపట్టిన అన్ని పనులందూ విజయాలను; **శ్రీసంతానలక్ష్మి**గా సంతానసౌభాగ్యాన్ని; **శ్రీవిద్యాలక్ష్మి**గా సకల విద్యలను, జ్ఞానవిజ్ఞానాలను; **శ్రీధనలక్ష్మి**గా సకలఐశ్వర్యాన్ని ఆ తల్లి అనుగ్రహిస్తూ ఉంది. మనిషి జీవనంసాగడానికి ఈ ఎనిమిది అవసరమే! వాటిని తన ఎనిమిదిరూపాల ద్వారా ప్రసాదించడం ద్వారా సృష్టి కొనసాగేలా అమ్మవారు చేస్తోంది.

అటువంటి శ్రీమహాలక్ష్మి అమ్మవారిని స్మరించడం వల్ల.. ధ్యానించడంవల్ల.. పూజించడంవల్ల జీవితంలో ఏ లోటూ లేకుండా జీవితం సాఫీగా సాగుతుంది.

*"ఓం మహాలక్ష్మ్యైనమః"*


## STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT

**SAPTHAGIRI**

**(MONTHLY)**
**FORM IV**
**See Rule 8**


1. Place of Publication : TIRUPATI
2. Periodicity of its Publication : Monthly
3. Printer's Name : **Sri R.V.Vijaya Kumar,** B.A., B.Ed.
   Whether citizen of India : Yes
   Address : Deputy Executive Officer, TTD Press, K.T.Road, Tirupati-517 507.
4. Publisher's Name : **Dr. V.G.Chokkalingam,** M.A., Ph.D., P.G.Diploma in JMC
   Whether citizen of India : Yes
   Address : Chief Editor, (FAC), Chief Editor Office, TTD Press Building, 2nd floor, K.T.Road, Tirupati-517 507.
5. Editor's Name : **Dr. V.G.Chokkalingam,** M.A., Ph.D., P.G.Diploma in JMC
   Whether citizen of India : Yes
   Address : Chief Editor Office, TTD Press Building, 2nd floor, K.T.Road, Tirupati-517 507.
6. Name and address of individuals who own the Newspaper and partners or shareholders holding more than one percent of the Total Capital : Tirumala Tirupati Devasthanams

I, **V.G.Chokkalingam**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

TIRUPATI,
Date : 28-2-2026.

**(Sd.) Dr. V.G.Chokkalingam,**
Signature of the Publisher

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)


తెనుగు అనువాదకులు:

కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,

కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు


*(గత సంచిక తరువాయి భాగం...)*

వీరెల్లరకు వారు శిక్షకులయియు రక్షకులయియు శ్రీవేంకటేశ్వరుని సకలసంపదలకు వర్ధకులై దేశాధిపతికి భగవద్ధర్మోపదేశకులుగాను కల్పించి, శ్రీభగవద్రామానుజ శ్రీవిగ్రహముద్రగా ఒక ముద్రాంగులీయకమును చేయించి జియ్యరుకు దానిని ధరింపుడని చెప్పి ఇచ్చి విష్వక్సేన ముద్రా సూచకముగా భగవద్రామానుజుల యాజ్ఞాపిసిద్ధమై ఏకాంగి పరంపరాప్రాప్తమైన గంట, కటారి, హనుమద్ధ్వజములను వారి వశము చేసి, కైంకర్యయాత్రాసందర్భములందు ఘంటానాద హనుమద్ధ్వజపురస్సరముగా సంచారము చేయవలెనని నియమించినారు.

విష్ణోః పూజాదికర్మాణి ధర్మాంశ్చ పురుషాయుషా
నియమస్థః సదా భిక్షుః కారయేతోపదేశతః
యతిస్తు వైష్ణవం క్షేత్ర మధిష్ఠాయ శుచిస్తదా
వ్యాకుర్వ న్నిగమాంతార్థాన్ ఆశ్రితానాం హితం వదన్
కాలం క్షిపే త్ప్రయత్నేన కర్మణా బ్రహ్మచింతనాత్.

(భిక్షువు- అనగా సన్న్యాసి పురుషాయుషమంతయు నియమస్థుడై విష్ణుపూజాదికర్మలను ధర్మములను ఉపదేశించి యెల్లప్పుడును చేయింపవలయును. యతి సదా శుచియై వైష్ణవ క్షేత్రమధివసించి వేదాంతార్థములను వ్యాఖ్యానించుచు ఆశ్రితులకు హితము చెప్పుచు, సత్కర్మములతోడను బ్రహ్మచింతనతోడను ప్రయత్నముతోడ కాలము వెళ్లబుచ్చవలెను.) అనియున్న సన్న్యాసి ధర్మముల చొప్పుననే జియ్యరు సాంగోపాంగముగా వేదాంతప్రవచనము చేయుచు, పలువురు చేతనులను శ్రీరామానుజ దర్శనస్థలమగునట్లుగాజేసి, శ్రీవేంకటేశ్వరుని సంపదలనభివృద్ధిపరచుచు శ్రీవేంకటాచలపతి, శ్రీగోవిందరాజస్వామి మొదలగువారి దివ్య శరీరమునకును శ్రీముఖమునకు (నోటికిని) ఉచితములగు ఔపచారిక సాంస్పర్శిక ఆభ్యవహారిక రూపములైన ఉపచారములను (మణవాళ మహామునులు) చేయించుచు మునుపు భగవద్రామానుజుల యాజ్ఞచేత నేర్పడిన తిరువేంగడ జియ్యరుకు అనేకధర్మములను ఆజ్ఞాపించి జరిపించుచుండిరి.

యస్తు జీర్ణాని ధర్మాని విష్ణోర్నవ్యాని చాదరాత్,
ఉద్ధర త్యగ్రపూజాం సంప్రాప్నుయా ద్దేవసన్నిధౌ.

(ఎవ్వడు జీర్ణములైన ధర్మములను గాని, నవ్య ధర్మములను గాని భక్తితోడ నుద్ధరించునో, అట్టివాడు దైవ సన్నిధియందు అగ్రపూజను పొందును.) అనెడు వైష్ణవశాస్త్రాను సారముగ శ్రీభగవద్రామానుజులు నియమించిన తీరుగ సేనాపతి జియ్యరు. శ్రీశైల పూర్ణులు, ప్రబంధగాయకులు, అనంతార్యులు, తిరుప్పణిప్పిళ్లై- అని ఈ క్రమముగ వీరికి తీర్థము, మంగళాశాసనము జరుపుటకు ముందుగా ఉత్తమాశ్రమియై విష్వక్సేన ముద్రాంకితులై యున్నట్టి తిరువేంగడ జియ్యరుకు తీర్థము మంగళాశాసనము జరుపుటకు కట్టడచేసి, పిమ్మట తీర్థవాసులు, దేశాంతరీయులైన జియ్యరులు, శ్రీవైష్ణవులు, అటుతర్వాత సకలస్థలములందు అనేకకైంకర్యములు చేసినవారుగ కందాడై రామానుజయ్యంగారులకు తీర్థము, మంగళాశాసనము ఏర్పాటుచేసి, శ్రీవేంకటాచలపతి, భగవద్రామానుజుల నియమన క్రమమున అధ్యయనోత్సవ మాకర్ణించు ప్రకారము స్థలాంతర విలక్షణమై యుండుటచేత అట్టిరీతికై ఒకశాసన పత్రమును వ్రాసియిచ్చి, శ్రీరామానుజపురమందు జియ్యరుకు ఒక మఠమును సంకల్పించి యిచ్చి, తిరువేంగడ జియ్యరుగారి జ్ఞానసంతాన పరంపరాంతర్భూతులగు ఏకాంగి శ్రీవైష్ణవులలోననే (ఒక్కరిని) తిరుమల స్థానమునకు ఆ యా కాలములందు ఉత్తమాశ్రమియైనవారిని తిరువేంగడనాడుకు శ్రీవేంకటేశ్వరైశ్వర్యమునకు సంరక్షకులుగా నియమించి (శ్రీమణవాళ మహామునులు) కోవెలకు శ్రీరంగమునకు మరలిపోయిరి.

ఈ ఐతిహ్యమాలాప్రబంధము మలైకునియనిన్రార్ అరైయర్ శ్రీ భవనమందలి శ్రీకోశమును చూచి వ్రాసినది. *(ఇంకా ఉంది)*

# అనంత పుణ్యఫలదాయిని కుమారధారాతీర్థముక్కోటి

మార్చి 3న కుమారధారాతీర్థముక్కోటి సందర్భంగా..

- శ్రీమతి కె.విజయలక్ష్మి, 70131 85538

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ

అనే కీర్తనలో పదకవితా పితామహుడు అయిన అన్నమాచార్యులవారు- **'నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ'** అని వర్ణించారు. అంటే నీటిని ధరించిన మేఘాలు ఈ కొండ చివరలు తాకుతూ వెళ్తాయి అని అర్థం. తిరుమల కొండను మేఘాలు తాకడమే కాదు అనేక మహిమాన్వితమైన పుణ్యతీర్థాలు అక్కడ ఉన్నాయి.


ఆలయసమీపంలో ఉన్న స్వామివారి పుష్కరిణి తీర్థం, పాపవినాశం, ఆకాశగంగవంటి తీర్థాలతో పాటు తిరుమల పర్వత సానువులలో అనేకతీర్థాలు ఉన్నాయి. స్కాందపురాణం లోని వేంకటాచల మాహాత్మ్యంలో తిరుమలలోని పుణ్యతీర్థాలు గురించిన ప్రస్తావన ఉంది. ఈ తీర్థాలకు సంప్రదాయబద్ధంగా ఆ యా రోజులలో ముక్కోటి నిర్వహిస్తారు. ఈ విధంగా ముక్కోటి నిర్వహించే ప్రధానమైన తీర్థాలలో **కుమారధారాతీర్థం** ఒకటి. ఫాల్గుణ మాసంలో శుక్ల పక్ష పౌర్ణమి రోజు కుమారధారా తీర్థముక్కోటి నిర్వహిస్తారు.

శేషాచలం అడవుల్లో తిరుమల శ్రీవారి ఆలయానికి వాయువ్యదిశలో సుమారు 10 కిలోమీటర్ల దూరంలో కుమారధారాతీర్థం ఉంది. కుమారతీర్థ ప్రస్తావన పద్మ, మార్కండేయ, వరాహ, వామనపురాణాల్లో కూడా పేర్కొన బడింది.

పూర్వం తారకాసురుడు అనే రాక్షసుడిని సంహరించిన అనంతరం శ్రీకుమారస్వామి శేషాద్రి పర్వత ప్రాంతానికి చేరుకొని ప్రస్తుత తీర్థ ప్రాంతంలో అష్టాక్షరీమంత్రాన్ని జపిస్తూ తపస్సు చేసి, తర్వాత ఈ తీర్థంలో స్నానం ఆచరించి కుమారస్వామి తారకసంహారం నుంచి విముక్తి పొందినట్లు కథనం. శ్రీకుమార స్వామి స్నానం ఆచరించి పాపవిముక్తుడు అయిన తీర్థం కనుక ఈ తీర్థానికి **'కుమారధారాతీర్థం'** అనే పేరు ఏర్పడినట్లు చెప్పబడుతూ ఉంది. శ్రీకుమారస్వామి ఫాల్గుణమాసంలో శుక్లపక్ష పౌర్ణమి రోజున ఈ తీర్థంలో స్నానం ఆచరించడం వల్లనే ఆ రోజునే ప్రతి సంవత్సరం **'కుమారధారా తీర్థ ముక్కోటి'**ని నిర్వహిస్తారు.

కుమారధారాతీర్థముక్కోటిరోజు ఈ తీర్థంలో భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ తీర్థంలో స్నానం ఆచరించడంవల్ల అనంతమైన పుణ్యఫలాలు లభిస్తాయని కథనం. అందుకు సంబంధించిన ఓ పురాణగాథ ప్రచారంలో ఉంది.

పూర్వకాలంలో ఓ వృద్ధుడు శేషాచలకొండల్లో ఒంటరిగా తిరుగుతూ దారితప్పి సహాయంకోసం చూస్తూ ఉన్న సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆ వృద్ధుడికి దర్శన మిచ్చి కుమారధారాతీర్థానికి దారి చూపి అక్కడికి వెళ్లి అందులో స్నానం ఆచరించమని సలహా ఇచ్చాడు.




దీనితో వృద్ధుడు కుమారధారా తీర్థానికి చేరుకొని అందులో స్నానం ఆచరించాడు. స్నానం ఆచరిస్తూనే ఆ వృద్ధుడు పదహారు సంవత్సరాల నవ యువకుడుగా మారినట్లు కథనం.

కుమారధారాతీర్థంలో స్నానం ఆచరించడం వల్ల, శ్రీకుమారస్వామి అనుగ్రహంతో పాటు కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి అనుగ్రహం కూడా కలిగి వివిధ అనారోగ్య సమస్యలు తొలగిపోయి ఆరోగ్యం చేకూరుతుంది. ఇహంలో సౌఖ్యం, పరంలో మోక్షం సిద్ధిస్తుంది.



# ఆనందనిలయుడి అమృతాన్ని పంచిపెట్టిన అన్నమయ్య!

– శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం,
99856 70152

మార్చి 15న శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల వర్ధంతి సందర్భంగా...

అదివో తాళ్లపాక అన్నమాచార్యులు
యిదె వీడె శ్రీవేంకటేశు నెదుట
వెదవెట్టి లోకములో వేదములన్నియు, మంచి
పదములు సేసి, పాడి పావనము సేసెను

భాషను ప్రధానంగా స్వీకరించి, తమ తమ సాహిత్యాల్ని అట్టడుగు ప్రజలస్థాయికి తగ్గట్లుగా రచించి, ప్రచారం చేస్తూ సమాజంలో బాగా వేళ్లూను కున్న శైవవైష్ణవ భక్తిసంప్రదాయాలు. 11వ శతాబ్దం ఉత్తరార్ధంలో తమిళదేశంలో రామానుజులు వైష్ణవాన్నీ, 13వ శతాబ్దంలో కన్నడదేశాన బసవేశ్వరుడు వీర శైవాన్ని ముమ్మరంగా ప్రచారం చేశారు. వీరి ప్రచార కోలాహలం తెలుగు భాషా సంస్కృతులపైన కూడా ఎనలేని ప్రభావం చూపింది.

**వీరశైవ విజృంభణ**-ఆంధ్రదేశంలో పాల్కురికి సోమనాథాది కవులు వీరశైవ ప్రచారానికి ఎంతో కృషి చేశారు. ప్రధానంగా సోమన ప్రజానీకానికి సులువుగా అర్థమయ్యేవీ, ఆవేశాన్ని కలిగించేవీ, పాడుకునేదానికి అనువైనవీ అయిన ద్విపదలల్లాడు. సీసం, తేటగీతి, ఆటవెలది... ఇత్యాది కవితలు చెప్పాడు. రగడలు, మంజరులు రాశాడు. ఇలాగ వివిధ సాహిత్యప్రక్రియల ద్వారా సోమన్న చేస్తున్న వీరశైవప్రచారం ఆంధ్రదేశంలో అప్రతిహతంగా సాగింది.

వీరశైవప్రభంజనం ఉధృతంగా వీస్తున్న సమయంలోనే 13వ శతాబ్దంలో కవిబ్రహ్మ తిక్కన సోమయాజి, నాచన సోమనాథునివంటి మహాకవులు ఉద్భవించారు. హరిహరనాథతత్త్వాన్ని ప్రతిపాదించారు. తమ హరిహర అభేద భావనతో కొంతవరకు మాత్రమే వీరశైవ విశృంఖలతను అడ్డుకున్నారు. కాని పూర్తిగా ప్రతిఘటించలేకపోయారు. ఇలాగ వీరశైవ ఝంఝూమారుతం 14వ శతాబ్దం వరకు నిర్విఘ్నంగా నిరాఘాటంగా వీచింది.

కేవలం వీరశైవదురభిమానం చెలరేగుతూ విష్ణుభక్తులు హింసల పాలవుతున్న నేపథ్యంలో రాయలసీమ నడిబొడ్డున 1408 సంవత్సరంలో వైశాఖమాసం, పున్నమినాడు తాళ్లపాక గ్రామంలో అన్నమయ్య జన్మించాడు.

**వీరశైవానికి అడ్డుకట్ట అన్నమయ్య**- అన్నమయ్య పుట్టుకతో అద్వైతి. తన ముందు జరిగిన జరుగుతున్న వీరశైవభీభత్సకాండను విన్నాడు. కన్నాడు. వారిని తను ద్వేషించకపోయినా సహనంలేని వీరశైవులకు ప్రత్యర్థిగా ప్రతి ద్వంద్విగా నిలవడానికి వైష్ణవాన్ని స్వీకరించాడు. అప్పటినుంచి అన్నమయ్య అన్నమాచార్యులయ్యాడు. కేవలం వైష్ణవం స్వీకరించడంతో సరిపెట్టుకోలేదు. తన జన్మస్థలానికి దగ్గరలో ఉన్న ప్రసిద్ధ వైష్ణవక్షేత్రం తిరుపతిని ప్రధాన కేంద్రంగా చేసుకున్నాడు. అక్కడి నుంచి శ్రీవేంకటేశ్వరభక్తిప్రచార ఉద్యమం ద్వారా వైష్ణవాన్ని వ్యాపింపజేయడానికి పూనుకున్నాడు అన్నమయ్య. తను ఒక్కడే కాదు. కొడుకులూ,

మనుమలూ ఇత్యాదిగా వంశపారంపర్యంగా వైష్ణవవ్యాప్తికి కంకణం కట్టు కున్నాడు. అప్పటినుండే తెలుగునాట వీరశైవానికి తీవ్ర ప్రతిఘటన అన్నమయ్యతో ప్రారంభమయింది.

**సాహిత్య పోకడలు-** అన్నమయ్య కూడా వీరశైవకవుల మాదిరిగానే భక్తి ప్రచారానికి సాహిత్యాన్ని ప్రచారసాధనంగా ఎన్నుకున్నాడు. శైవకవులు శైవపరంగా ఎలాంటి స్తుతులు చేశారో, కావ్యాలు రాశారో అన్నమాచార్యులు కూడా శ్రీవేంకటేశ్వరస్వామిపరంగా అట్లాంటి స్తోత్రాలు చేశాడు. సోమనాథుడు బసవపురాణం, పండితారాధ్యచరిత్రవంటి ద్విపదలు రాయగా, అన్నమయ్య ద్విపదరామాయణం (అలభ్యం) రాశాడు. సోమన శతకాలు రచిస్తే అన్నమయ్య కూడా శతకాలు రాశాడు.

పాల్కురికి సోమన రచనలలో ఏ యే పోకడలు పోయినాడో అన్నమాచార్యులు వైష్ణవప్రచారంలో అన్ని పోకడలూ పోయినాడు. వీరశైవులు తమ ప్రచారానికి గాన ఛాయ కలిగిన ద్విపదలు స్వీకరిస్తే, అన్నమయ్య గానమే పెద్ద పీటగా వేసుకున్న 'పదకవితల' ద్వారా శ్రీవైష్ణవ ప్రచారాన్ని చేస్తూ కృతకృత్యుడైనాడు. "పదకవితా పితామహుడు"గా ప్రసిద్ధి పొందాడు.

అన్నమాచార్యుల పదకవితల్లో దూషణలను ప్రత్యక్షంగా చేయలేదు. విష్ణుభక్తులలో, విష్ణుసేవకులు విశిష్టతను వివరిస్తూ విష్ణువే సర్వోత్తముడని వేదాల్లోంచి, పురాణాల్లోంచి ప్రస్తావనలిస్తాడు. తన పదకవితల్లో శైవులను దూషణలు, తిరస్కారాలను చేయలేదు. అందుకే అన్నమాచార్యుల పదకవితలు మిక్కుటంగా ప్రజాదరణ పొందాయి.

పాల్కురికి సోమన దేశం నలుమూలలా తిరుగుతూ ఆ యా చోట్ల పల్లెటూరి ప్రజల సుద్దుల్లో నిలిచిన సాధారణ భక్తులను అసాధారణభక్తులుగా పేర్కొని తద్వారా శైవభక్తిని ప్రచారం చేశాడు. వాటిని వర్ణించడంలో ప్రధానంగా ద్విపదలనే స్వీకరించాడు. ఎంత ప్రచారం చేసినా అది శైవం పుచ్చుకున్నవారికి మాత్రమే పరిమితమై నిరంకుశంగా ఉన్నందున, ఇతరుల ప్రస్తావన మచ్చుకయినా లేనందున ఆంధ్రదేశంలో వీరశైవము అంతగా ప్రజాదరణ పొందలేదని నిశ్చయంగా చెప్పవచ్చు.

అన్నమాచార్యులు కూడా ఆంధ్రదేశంలో పల్లె పల్లెకు, వాడ వాడకు తిరిగాడు. తెలుగునాట, తెలుగునోట ముఖ్యంగా రాయలసీమ ప్రజల్లో నానుతున్న నుడులనూ, నానుళ్లనూ, జాతీయాలను, పలుకుబళ్లనూ, భావాలనూ నిశితంగా గమనించి వాటిని స్వీకరించాడు.

అన్నమయ్య ప్రజా జీవితంతో తానూ తాదాత్మ్యం చెందాడు. ఆ యా సన్నివేశాల్లో లోకులు మైమరచి సహజధోరణిలో వూసు లాడుకున్న సుందరమైన, సున్నితమైన, సునిశిత మైన తేటతెనుగు మాటలను విన్నాడు.



ఆ తెలుగు గొంతుల్లో మోగుతున్న "జాజరలు చందమామలు, కోవెల, చిలుక, తుమ్మెద. పదములు, లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాల, జోల, జోజో, జేజే, జయజయ, విజయీభవ, శోభన, మంగళ వైభోగములు, మేలుకొలుపులు, నలుగులు, దంపుళ్లు, కొట్నాలు, కూగూగులు, గుజ్జెన గూళ్లు, చందమామ గుటకలు, నివాళులు, ఆరతులు, మంగళారతులు, జయ మంగళాలు, అల్లోనేరేళ్లు, చాంగుభళాలు, బళాబళాలు, సాసముఖాలు, అవధానములు, తందనాలు, వెన్నెలలు, చిత్తమా! మనసా! బుద్ధి (సంబోధనలు)... మున్నగు కమనీయమైన గేయ ఫణితులలోనే అన్నమాచార్యులు మంజులమైన మధురమైన, మనోహరమైన పదకవితలను రచించాడు. యావత్ ప్రజను ఆకట్టుకొన్నాడు, ఆకర్షించాడు.

కేవలం వ్యాకరణబద్ధంగా వ్రాసినందుకే "పదకవితా పితామహుడు"గా పేరొంద లేదు. ఆయన వాసిలో, రాసిలో బాగా చక్కనైన పద కవితలల్లినందుకే పదకవియై వరలినాడు. పద కవితలో అగ్రతాంబూలాన్ని అందుకున్నాడు.

## భక్తిప్రచారోద్యమం

కేవలం పదరచన చెయ్యడమే అన్నమయ్య ఉద్దేశం కాదు. ఆ పదాల ద్వారా తిరుమల వేంకటేశుని భక్తినీ, తద్వారా వైష్ణవాన్ని వ్యాపింప జేయాలన్నదే అన్నమయ్య పరమలక్ష్యం. అందుకే ప్రతి పాటలో కూడా శ్రీవేంకటేశుని ఏదో విధంగా ముడిపెడతాడు. తిరుమలప్పను గూర్చి గొప్పగా వర్ణిస్తాడు.

"కలఁడా ఇంతటి దాత కమలనాభుఁడె కాక
కలఁడన్న వారి పాల కలియుగ దైవము"

అంటూ వర్ణించాడు. ఇంకా తిరుమల శ్రీనివాసుణ్ణి మనల్ని పాలించే కులదైవం! పెద్దల నుంచి వచ్చిన నిధి! దప్పి దీర్చే కాలమేఘం! కోరికలను తీర్చే కామధేనువు! పారిజాత వృక్షం! చెడనీక బ్రదికించే సిద్ధమంత్రం! రోగాలను పోగొట్టే దివ్యౌషధం! వెంట దిరిగే ప్రాణ బంధువుగా పేర్కొన్నాడు అన్నమయ్య.

అన్నమయ్య తిరువేంకటగిరి దేవుని గూర్చి "పట్టిన చేతి బంగారం, ముట్టి కొలిచినవారి ముందు జీవితం, సేవ చేసినవారి చేతిలో మాణిక్యం, భావించువారి పరబ్రహ్మం, బత్తి చేసినవారి భవరోగ వైద్యుడు, హత్తి నుతించినవారి ఆనంద రూపుడు. ఆపన్నులపాలిటి దైవం" అంటూ ప్రచారం చేశాడు.

## కొండలరాయడే గతీ, దిక్కు కూడా

తిరుమల హరిని కొలువని కొలువులు అడవి గాచిన వెన్నెల, ఈ అచ్యుతుని గూర్చి వినని కథలు భువిలో గజ స్నానాలు, వైకుంఠుని పొగడని ప్రార్థనలు బూడిదలో పోసిన పన్నీరులు, సర్వదాత అయిన కమలోదరుని కోరని కోరికలు అందని మానిపండ్లు, తిరుమలేశుని గూర్చి తెలియని 'తెలివి'



ఏదైతే ఉందో అది నట్టనడి ఏటిలోని పైరులు అని చెబుతూ, అన్నమయ్య కోనేటిరాయని పరమభక్తుడై వేంకటపతి మీద వింత వింతలుగ ముప్పది రెండువేల సంకీర్తనలను పాడినాడు, ప్రచారం చేసినాడు.

## క్షేత్రసందర్శనం

అన్నమయ్య తన భక్తిప్రచారోద్యమంలో "అహోబల నారసింహుని, కప్పురపు నవ్వుల కడపరాయడైన వేంకటేశుని, శ్రీరంగనాథుని, పాండురంగ విఠలుని, మాడు పూరు మాధవుని, మార్కాపురం చెన్నకేశవుని, మంగాపురం హను మంతుని, కదిరి నృసింహుని, ఒంటిమిట్ట రఘురాముని, వాయల్పాడు రఘురాముని, వెలుగోటి చెన్నుని... ఇలాగ మహా వైష్ణవపుణ్యక్షేత్రాల నుండి మారుమూల పల్లెల దాకా, ఆ యా ప్రజలు అక్కడ పూజించే దేవుళ్లను తానూ పూజించాడు.

ఆ వైష్ణవదేవుళ్లందరినీ తిరుమల వేంకటేశునిగా భావించి పదాలు రచించాడు.

అందుకే ఒక చోట అన్నమయ్య ఇలా అంటాడు.

"ఎవ్వరి గొలిచిననేమి గొరత, మరి
యెవ్వరి దలచిన నేమి?
అవ్వలివ్వల శ్రీహరిరూపు గాని వా
రెవ్వరు లేరని యెరుక దోచిన జాలు"

అని ప్రజలందరి పూజలు శ్రీవేంకటేశునికే చెందు తాయనీ చెప్పాడు. అంతేకాదు.

## సామాజిక వైతాళికుడు

శ్రీవేంకటేశ్వర భక్తిప్రచారంతో పాటు లోకకల్యాణానికి కూడా పాటుపడ్డాడు అన్నమాచార్యులు. తన లక్ష్యసాధనలో చెడును తెంచుకుంటూ, మంచిని పెంచు కుంటూ పురోగమించిన గొప్ప సామాజికుడు, ఆధ్యాత్మిక తత్త్వవేత్త అన్నమయ్య. అందువల్లే అన్నమాచార్యుల పదాలు **"హరి కరుణా సారంబులే గాక, దుర్గుణ గణ భంజనములు"**గా ప్రసిద్ధి కెక్కాయి.

తన బహుదేశ సంచారంలో అన్నమయ్య ఆడం బరంతో, అహంకారగర్వాలతో విర్రవీగుతున్న మానవులను

"నానాటి బదుకు నాటకము
నట్టనడిమి పని నాటకము"

అని ప్రబోధించాడు.

అలాగే సంసారజంజాటంలో మునిగివున్న పామరులను గూర్చి అన్నమయ్య.

"నీరు లోపలి మీను నిగిడి యామిషముకై
కోరి గాలము మ్రింగి కూలబడినట్లు"

నశిస్తారని హెచ్చరించాడు.

## మానవతావాది

అభ్యుదయ మానవతావాదియైన అన్నమయ్య తన పదకవితల్లో మానవత్వంతో కూడిన భక్తిని ప్రతిపాదించాడు. తన సంకీర్తనల ద్వారా అందరూ శ్రీవేంకటేశ్వరుని స్వరూపులే అని వివరించాడు.

"నా నాలికపై నుండి నానా సంకీర్తనలు
పూని నాచే నిన్ను పొగడించితివి
వేనామాల వెన్నుడా? వినుతించ నెంతవాడ!
కానిమ్మని నాకీ పుణ్యము గట్టితి వింతేయయ్యా!!"

అని భక్తితో స్మరిస్తూ సర్వజనామోదకంగా, సర్వజన ఆహ్లాదంగా శ్రీవేంకటేశ్వర పదకవితాయజ్ఞాన్ని సాగించి 32 వేల పదకవితలను వ్రాశాడు. ఆ సంకీర్తన పుష్పాలను

"దాచుకో నీ పాదాలకు తగనే చేసిన పూజలివి"

అని తిరుమల వేంకటనాథునికే అంకితం జేసి **1503 ఫాల్గుణ బహుళద్వాదశినాడు** తన "తొంబదియైదవ ఏట" నందకాంశ సంభూతుడైన అన్నమయ్య, శ్రీవేంకటేశ్వరుని నందక ఖడ్గంలో విలీనమయ్యాడు.

ఇలా ఆజన్మాంతం అన్నమాచార్యులు పంచిపెట్టిన ఆనందనిలయుడి అమృతరసప్లావితమైన పదకవితలను నోరారా పాడుకుందాం! మనసారా ఆస్వాదించుదాం! ఆనందించుదాం! తిరుమల క్షేత్ర ఆధ్యాత్మిక సోపానాలను అధిరోహిస్తూ తద్వారా ఆనందనిలయుని నిండైన అనుగ్రహంతో తరించుదాం!!

ఓం నమో వేంకటేశాయ

# సాధకుడికే విజయం

– శ్రీ కె.వి.వి.సత్యప్రసాద్

ఏ పనిలోనైనా మన నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి 'సాధన' అవసరం. పదే పదే సాధన చేస్తే ఆ పనిలో తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడగలం. గురువులు కూడా నిరంతరతపస్సులా సాధన చేస్తారు. ఒక్కరోజు సాధన చేయకపోయినా సాధకుడికి ఆ లోపం తెలుస్తుంది. రెండు రోజులు సాధన చేయకపోతే పోటీదారులకు తెలిసిపోతుంది. మూడురోజులు సాధన మానుకుంటే ప్రేక్షకులు కూడా గ్రహించగలరని పెద్దల మాట. అదీ సాధన గొప్పదనం.

కృషి ఉంటే మనుషులు నిజంగానే ఋషులవుతారు. నిరంతరసాధన చేసే యోధులకే విజయద్వారం స్వాగతం పలుకుతుంది. సామాన్యులను సైతం అసామాన్యులుగా తీర్చిదిద్దగల శక్తి సాధనకు ఉంది. దీనికి ప్రణాళిక, క్రమశిక్షణ, లక్ష్యంపై గురి ఇవన్నీ సహకరిస్తాయి. తప్పులను సరిచేసుకోగలగడమే కాదు, చేస్తున్న పని మీద ఏకాగ్రత సాధించడానికి సాధన తోడ్పడుతుంది. సాధనకు పూనుకున్నప్పుడు ఎన్నో అవరోధాలు ఎదురవుతాయి. దిగలాగే ప్రయత్నాలు, నొప్పిస్తూ నిరుత్సాహం కలిగించే మాటలు వినిపిస్తాయి. సాధకుడు వాటిని వినిపించుకోకూడదు. ప్రోత్సాహాన్నిచ్చే మంచి మాటలనే అతడు వినాలి. ఎవరికి వారే 'దర్పణ ధ్యానం' అంటే అద్దం ముందు నిలబడి తమను తాము అభినందించుకోవాలి. దానివల్ల శక్తి, ఉత్సాహం జనిస్తాయి. ఏ స్థాయి పోటీల్లో అయినా, ఏ రంగంలో పోటీల్లో అయినా అనునిత్య సాధనే విజయానికి బాట వేస్తుంది.

అర్జునుడు ఓ రాత్రిపూట భోజనం చేస్తుండగా దీపం కొండెక్కింది. అయినా అతడు యథావిధిగా భోజనం ముగించాడు. వెలుతురు లేని లోటు అతనికి తెలియ లేదు. ఆ సంఘటన అతడిలో రాత్రి వేళ మాత్రం తాను నేర్చుకునే విద్యల్లో సాధన ఎందుకు చేయకూడదన్న ఆలోచన కలిగించింది. దాన్ని ఆచరణలో పెట్టి ఎన్నో విద్యలలో రాటుదేలాడు అర్జునుడు. 'ఏ విద్యైనా నాకు దాసోహమే' అనే అహంతో ఉన్న కర్ణుడు శాపగ్రస్తుడయ్యాడు. యుద్ధనైపుణ్యం ఉన్నప్పటికీ తగిన కౌశలం లేకపోవడంవల్ల అభిమన్యుడు అకాలమరణానికి కారణమయ్యాడు. మనసా, వాచా, కర్మణా త్రికరణశుద్ధితో సాధన చేయాలి. శరీరాన్ని వ్యాయామం ద్వారా కష్టపెట్టాలి. అదే సాధకులను విజయానికి చేరువ చేస్తుంది. మనసును స్థిరంగా ఉంచి, చలనం లేకుండా చేసే సాధనే 'ధ్యానం', అదే అరిషడ్వర్గాలకు దూరంగా పయనించేలా చేసే సాధనం. ఇవన్నీ మనిషికి అత్యంత అవసరం. సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టే ప్రక్రియే 'సాధన'. సిద్ధాంతం తెలుసుకుని సాధన చేయకపోతే ఆ విద్య నిష్ప్రయోజనం. సాధన మాత్రమే చేస్తూ, ఆ రంగం లోని సమాచారం తెలుసుకోకపోవడం కూడా ఆ విద్యను వ్యర్థం చేయడమే.



108 దివ్యదేశాలు

# ఆళ్వార్ తిరునగరి

## తిరుక్కురుగూర్

(నవతిరుపతులు - 8)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

| | | |
|---|---|---|
| భగవంతుడు | : | ఆదినాథుడు |
| అమ్మవారు | : | ఆదినాయకి , కురుగూర్‌నాయకి |
| స్థలతీర్థం | : | బ్రహ్మతీర్థం |
| క్షేత్రం | : | తిరుక్కురుగూర్ |
| విమానం | : | గోవిందవిమానం |
| స్థలవృక్షం | : | చింతచెట్టు |
| ప్రత్యక్షం | : | దాంతుడు, భృగు, మార్కండేయ మహర్షులు |
| నది | : | తామ్రపర్ణి నది |
| ముఖము/స్థితి | : | తూర్పు ముఖం, నిలుచున్న భంగిమ |
| మంగళాశాసనం | : | నమ్మాళ్వార్ |
| ఆగమం | : | పాంచరాత్రం |

ఈ దివ్యదేశం తిరునల్వేలినుండి తిరుచ్చెందూర్ వెళ్ళే మార్గంలో 6 కి.మీ. దూరంలో తామ్రపర్ణీనది యొక్క ఉత్తర దిక్కులో 5 ఎకరాలలో 3 ప్రాకారాలు, 5 అంతస్తుల గోపురంతో, ప్రకృతి రామణీయకతతో ఈ 'ఆళ్వార్ తిరునగరి' దివ్యదేశం వెలసిల్లి ఉన్నది. ఈ ఆలయ మూలమూర్తి ఆది నాథుడు, ఆదిపిరాన్ అనే దివ్యనామంతో తూర్పు దిక్కును చూస్తూ నిలుచున్న భంగిమలో గంభీరంగా భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఈ మూలమూర్తి యొక్క పాదారవిందాలను మనం దర్శించుకోలేము. కారణం ఏమిటంటే ఆ పాదములు భూమిలోపల ఉన్నాయని ఐతిహ్యం. ఉత్సవమూర్తి పేరు పొలిన్దునిన్ఱపిరాన్ అని. అలాగే శ్రీదేవి, భూదేవి, నీలాదేవి సమేతుడిగా స్వామి వేంచేసి ఉన్నాడు. స్థలతీర్థం బ్రహ్మతీర్థం. అమ్మవార్లు ఆదినాయకి, కురుగూర్‌నాయకి అని ఇద్దరు ప్రత్యేక సన్నిధిలో వెలసిల్లి ఉన్నారు. అలాగే ఆలయప్రాకారంలో శ్రీరాముడు, వేణుగోపాలుడు, నరసింహుడు, వరాహపెరుమాళ్, తిరువేంగడ ముడయాన్, గరుత్మంతుడు, నమ్మాళ్వార్ మరియు నాథమునులు కూడా వేంచేసి ఉన్నారు.

### వైశిష్ట్యం

తమిళ వైఖానశి నెల, విశాఖానక్షత్రంలో 5 రోజుల పాటు స్వామి నమ్మాళ్వార్లకు విశేషమైన ధ్వజారోహణంతో ఉత్సవాదులు ప్రతి సంవత్సరం కూడా జరుగుతున్నవి. ఐదవ రోజు ఈ ఆళ్వార్లను చూడడానికి నవతిరుపతులలో వేంచేసి ఉన్నటువంటి భగవానులు గరుడవాహనంలో వేంచేసి అనుగ్రహిస్తారట. ఈ తిరుక్కురుగూర్‌లో ఎవరైతే నివసిస్తున్నారో వారు అందరూ కూడా ఈ నమ్మాళ్వార్‌నే తమ ఇంటిమనిషిగానే భావిస్తుంటారు. అర్చాస్వరూపంలో వేంచేసి ఉన్న నమ్మాళ్వార్ యొక్క దివ్యమంగళవిగ్రహం ఎటువంటి శిల్పిచేత చెక్కలేదట. స్వామివారి యొక్క అత్యంత ప్రియశిష్యులైన మధురకవి ఆళ్వారులు తామ్రపర్ణి నీరుని తీసుకొని ఆ నీటిని ఆచార్య భక్తితో చక్కగా కాచి, అలాగే ఆళ్వార్లయొక్క దివ్యమంగళవిగ్రహాన్ని తనయొక్క మనసులో పదిలపరుచుకుని కాచినటు వంటి నీరును అలా కింద పోయగా ఆ నీరు ఆళ్వార్ల యొక్క దివ్యమంగళ విగ్రహముగా మారినది. ఆనాటి నుండి ఈనాటి వరకు మధురకవిఆళ్వార్ల చేత సమర్పింపబడినటువంటి ఈ ఆళ్వార్లు ఉపదేశ ముద్రతో ప్రత్యేక సన్నిధిలో వేంచేసి ఉండి అందరినీ అనుగ్రహిస్తూ ఉన్నారు. నమ్మాళ్వార్ల అవతారానికి ముందే ఇచ్చట ఉన్నటువంటి చింతచెట్టు(స్థలవృక్షం) ఒక వైలక్షణ్యం పొందినది. ఏమిటంటే, చింతపువ్వు వస్తుంది, చింతకాయ వస్తుంది కాని చింతపండుగా కాకుండానే అది ఎండిపోతుందట. అది ఇక్కడ చింతచెట్టు విశేషం.





## స్థలపురాణం

బ్రహ్మదేవునికి ఈ దేవలోకం అలాగే భూలోకంలో తను సృష్టి చేస్తున్నాడనేటటువంటి గర్వం ఉండేది. అందువల్ల అతడు అందరికీ కూడా తన యొక్క మహిమను, వైభవాన్ని తెలియజేయాలి అనేటటువంటి ఒక ఆశతో బ్రహ్మదేవుడు స్వామిని అడుగుతాడు. అంటే బ్రహ్మదేవుడు సృష్టించినటువంటి చోటు అన్నీ కూడా ఆయనకు తెలియనటువంటి ప్రదేశం ఏమి లేదు అనే ఒక గర్వం ఉండేది. ఇది అందరూ తెలుసుకోవాలనేటువంటి ఉద్దేశ్యంతో భగవంతుని అడుగుతున్నాడు "స్వామి! నాకు తపస్సు చేసుకునేందుకు ఒక స్థలం కావాలి. ఆ స్థలం



నాకు అలవాటు లేనటువంటి, నాకు తెలియనటువంటి స్థలంగా ఉండాలి" అని స్వామిని అడిగాడట. భగవంతుడు కాస్త పరిహాసంతోనే "తామ్రపర్ణీనదీతీరంలో మీరు తపస్సు చేయవచ్చు" అని చెప్పగా, బ్రహ్మదేవుడు ఆ ప్రదేశం ఎక్కడ ఉన్నది నాకు తెలియలేదే. తను సృష్టించినటువంటి ప్రదేశాలలో ఈ ప్రదేశం లేదే, ఇది కొత్తగా ఉన్నదే అని కాస్త ఆశ్చర్యంతో సంభ్రమంతో కలవరపడ్డాడు. కలవరపడుతున్నటువంటి బ్రహ్మదేవుణ్ణి చూచి "బ్రహ్మదేవ! నీ సృష్టి కన్నా ముందు అనాదిగా ఎన్నో సృష్టులున్నాయి. నీ సృష్టికి ముందే నేను ఆ దివ్యదేశంలో వేంచేసి ఉన్నాను. అందువల్ల నీ తపస్సుకు ఆ స్థలం చాలా విశేషంగా ఉంటుంది" అని పరంధాముడు చెప్పిన వెంటనే బ్రహ్మదేవుడు సిగ్గుతో కుంచించుకుపోయి, ఆ దివ్య దేశానికి వెళ్లి తపస్సు చేసి తన అహంకారాన్ని అంతా కూడా అణచుకొని భగవంతుని యొక్క అనుగ్రహాన్ని పొందడం జరిగినది. అంచేత బ్రహ్మదేవుని సృష్టి కన్నా ముందే స్వామి అక్కడ వేంచేసి ఉన్నారు కనుక ఆ క్షేత్రానికి **'ఆదిక్షేత్రం'** అనే పేరు వచ్చింది.

ఇచ్చట ఉన్నటువంటి చింతచెట్టు లక్ష్మణుని యొక్క అంశగా చెప్పబడుతున్నది. ఒక సమయంలో రామభద్రుడు యమధర్మరాజుతో పాటు ఏకాంతంగా మాట్లాడాల్సినటువంటి అవసరం ఏర్పడినప్పుడు, ఆ రహస్య ఆలోచన సందర్భంలో ఎవరూ కూడా మధ్యలో రాకూడదు అనే ఉద్దేశ్యంతో లక్ష్మణుణ్ణి కాపలాగా పెట్టి వెళ్లారు. అదే సమయంలో రాముణ్ణి చూడటానికి దుర్వాసమహర్షి రావడం జరిగినది. లక్ష్మణునికి ఏమి చేయాలో తోచలేదు. దుర్వాస మహర్షిని ఆపితే ఆయన కోపానికి గురి కావలసివస్తుంది. శాపం ఇస్తాడు. అందువల్ల అలాగే ఉండిపోయాడు. దుర్వాసమహర్షి లోపలకు వెళ్లిపోయాడు. వాళ్ళు ఇద్దరు మాట్లాడుకునేటువంటి ఏకాంతాన్ని భంగం చేసాడు. తరువాత రాముడు దుర్వాసమహర్షితో యథోచితంగా మాట్లాడి పంపించి, లక్ష్మణుని పై కోపాన్ని చూపాడు. ఆ కోప ఫలితంగా లక్ష్మణుడు ఈ తిరుక్కురుగూర్ అనే దివ్య క్షేత్రంలో చింతచెట్టుగా ఉండాలని శాపం ఇవ్వడం జరిగినది. ఈ ప్రకారంగా ఈ క్షేత్రం చాలా విశేషమైనది. ఆళ్వార్లలో నమ్మాళ్వార్ల అవతారస్థలమిది. నమ్మాళ్వార్లు 16 సంవత్సరముల పాటు మాటల్లేక తల్లిపాలు తాగక ఈ చింతచెట్టు తొర్రలో నివాసం చేసి, సకల దేవతలందరిని కూడా ఆయన దర్శించుకోవడం జరిగినది. నమ్మాళ్వార్ల మంగళాశాసనం ఇది. ఎవరైతే ఈ స్వామిని దర్శించుకుంటారో వాళ్ళకు సమస్త అశుభాలన్నీ తొలగి, సమస్తశుభాలు కలుగుతాయని ఆర్యోక్తి కనుక ఆ స్వామిని దర్శించుకొని అందరూ తరించవలెను.

## ధ్యానశ్లోకం

యో రాత్రౌ దక్షిణస్యాం దిశి మధురకవేః భాసతే భాస్కరాభః
తస్యారాధ్యో నగర్యాం ప్రథితశఠరిపోః ఆదినాథః తథా శ్రీః।
గోవిందాఖ్యం విమానం విమలజలవహా–తామ్రపర్ణీ చ తీర్థం
ప్రాచీముద్వీక్ష్యమాణో వకులసుమరజస్సుప్రసన్నస్వరూపః॥



శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి పుష్పయాగం
(15-03-2026)

# శ్రీకూరేశప్రణీత "శ్రీస్తవము"

వ్యాఖ్యాత –
డా॥ ఈ. ఏ. శింగరాచార్యులు,
98850 03420



మార్చి 3న 'లక్ష్మీజయంతి' సందర్భంగా...

**అవతారిక:** కూరేశులు శ్రీమద్రామానుజాచార్యుల వారి అంతరంగశిష్యులు. విశిష్టాద్వైతాన్ని ప్రచారం చేసి ఆచార్యపరంపరలో చేరిన వారు.

వీరు 'పంచస్తవి' అనే పేరుతో ఐదు స్తోత్రాల సంపుటిని రచించారు. దీనిలో 'శ్రీస్తవం' ఒక ఆణి ముత్యం. లక్ష్మీ స్వరూపిణీ, శ్రీరంగంలో వెలసి ఉన్న 'శ్రీరంగనాయకి' వైభవాన్ని తెలుపుతుంది ఈ స్తవం. శ్రీస్తవంః-వేదోక్త 'శ్రీసూక్తం', విష్ణుపురాణం లోని ఇంద్రకృత 'శ్రీస్తుతి', యామునుల 'చతుః శ్లోకి'లోని విషయాలను అందంగా వివరిస్తుంది.

శ్రీలక్ష్మీజయంతి సందర్భంగా 'సప్తగిరి' భక్తపాఠకులకు ఈ స్తోత్రాన్ని కానుకగా అందిస్తోంది.

## కూరేశులను స్తుతించే శ్లోకం (తనియన్)

శ్రీవత్సచిహ్న మిశ్రేభ్యో నమ ఉక్తిమధీమహే।
యదుక్తయస్త్రయీ కంఠే యాంతి మంగళసూత్రతామ్॥

ఎవరి సూక్తులు వేదమాత కంఠంలో మంగళసూత్రం వలే అవుతున్నాయో, అటువంటి శ్రీవత్సచిహ్న మిశ్రులకు మనసా, వాచా, కర్మణా నమస్కరిస్తున్నాను.

\- - - - - - -

స్వస్తి శ్రీర్దిశతాదశేషజగతాం సర్గోపసర్గ స్థితీః
స్వర్గం దుర్గతిమాపవర్గికపదం సర్వం చ కుర్వన్ హరిః ।
యస్యా వీక్ష్య ముఖం తదింగిత పరాధీనో విధత్తేఽఖిలమ్
క్రీడేయం ఖలు నాన్యథాఽస్య రసదా స్యాదైకరస్యాత్తయా॥ 01

లోకాల సృష్టి, స్థితి, లయలను చేసీ, స్వర్గ నరకాలను, మోక్షానన్నింటినీ కూడా జీవులకు శ్రీహరి, లక్ష్మీదేవిని చూసి ఇస్తాడు. ఆమె మనోభావానుగుణంగానే అన్ని కార్యాలు చేస్తున్నాడు. అట్టి భగవానునితో ఆ లక్ష్మీదేవి ఒకే అభిప్రాయాన్ని కల్గి ఉండడం చేత, ఈ సృష్టి అంతా వారిద్దరికీ ఆనందాన్ని కలిగించే ఆట కూడా. అట్టి శ్రీదేవి మనకు శ్రేయస్సును కలిగించాలి.

హే శ్రీర్దేవి! సమస్త లోకజననీం! త్వాం స్తోతుమీహామహే
యుక్తాం భావయ భారతీం ప్రగుణయ ప్రేమప్రధానాం ధియమ్।
భక్తిం బంధయ నందయాశ్రిత మిమం దాసం జనం తావకం
లక్ష్యం లక్ష్మి! కటాక్షవీచివిసృతే స్తే స్యామ చామీ వయమ్॥ 02

ఓ లక్ష్మీదేవి! లోకాలన్నిటికీ తల్లివైన నిన్ను మేము స్తుతించడానికి తగిన వాక్కులనుగ్రహించు. భక్తి ప్రధానమైన జ్ఞానాన్ని మాకు వృద్ధి చేసి, మమ్ము నీ దాసునిగా పరిగణించి, ఆనందాన్ని కలిగించు. అమ్మా! నీ కరుణా కటాక్షాలనే కెరటాల వ్యాప్తికి నీ దాసులైన మేము లక్ష్యం కావాలి సుమా!

స్తోత్రం నామ కిమామనంతి కవయో యద్యన్యదీయాన్ గుణాన్
అన్యత్ర త్వసతోఽధిరోప్య ఫణితిః, సా తర్హి వంధ్యా త్వయి।
సమ్యక్సత్యగుణాభివర్ణనమథో బ్రూయుః, కథం తాదృశీ
వాగ్వాచస్పతినాఽపి శక్యరచనా త్వత్సద్గుణార్ణోనిధౌ!॥ 03

అమ్మా! కవులు "స్తోత్రమని దేనిని అంటున్నారు?" అంటే -- ఒక వ్యక్తిలోని గుణాలను ఇంకొకరిలో ఉన్నట్లుగా వర్ణించడాన్ని స్తోత్రమనుకుంటే, అట్లాంటి స్తోత్రాన్ని నీ విషయంలో మేము చేయలేము. ఎందుకంటే, గొప్ప వైభవాన్ని కలిగిన నీ గుణాలను బృహస్పతి కూడా ఎట్లు వర్ణించగలడు? అందుకే నీ కృపవల్లనే నిన్ను స్తుతించడం సాధ్యం.

యే వాచాం మనసాం చ దుర్గ్రహతయా ఖ్యాతా గుణాస్తావకాః
తానేవ ప్రతి సాంబుజిహ్వముదితా హై మామికా భారతీ।
హాస్యం తత్తు న మన్మహే న హి చకోర్యేకాఽఖిలాం చంద్రికాం
నాలం పాతు మితి ప్రగృహ్య రసనామాసీత సత్యాం తృషి॥ 04

ఓ లక్ష్మీదేవీ! నీలోని ఏ గుణాలు మనోవాక్కులకు అందలేనంతగా ప్రసిద్ధి పొందాయో, ఆ గుణాలను వర్ణించాలంటే ఎంత ఆనందం నాకు! అలా భావించడం హాస్యాస్పదమని అనుకోను నేను. ఎట్లంటే, ఆడ చకోరపక్షి వెన్నెలనంతటినీ నేను తాగలేనని నాలుకను లోపల ముడుచుకోక, ఎంత వీలైతే అంత గ్రహించినట్లు, నేనూ నా శక్తికొద్ది నీ గుణగానం చేసి ఆనందిస్తాను.

క్షోదీయానపి దుష్టబుద్ధిరపి నిస్స్నేహో౽ప్యనీహో౽పి తే
కీర్తిం దేవి! లిహన్నహం న చ బిభేమ్యజ్ఞో న జిహ్రేమి చ ।
దుష్యేత్సా తు న తావతా న హి శునా లీఢా౽పి భాగీరథీ
దుష్యేత్ శ్వా౽పి న లజ్జతే న చ బిభేత్యార్తి స్తు శామ్యేచ్ఛునః॥ 05

ఓ దేవీ! నీ గురించి ఏమి తెలియని నేను భయపడకుండా, బిడియం లేకుండా నీ కీర్తిని స్తోత్రం చేసి ఆనందించాలనుకుంటున్నా, అందువల్ల నీ కీర్తి ఏమాత్రం తగ్గదు. ఎట్లంటే, పవిత్రమైన గంగలో శునకం మునకలు వేసినా, దాహం తీర్చుకున్నా గంగ అపవిత్రురాలు కాదు కదా! దాని దాహం తీరకుండా ఉండదు కదా!

ఐశ్వర్యం మహదేవ వా౽ల్పమథవా దృశ్యేత పుంసాం హి యత్
తల్లక్ష్మ్యాః సముదీక్షణాత్తవ యత స్సార్వత్రికం వర్తతే।
తేనైతేన న విస్మయేమహి, జగన్నాథో౽పి నారాయణో
ధన్యం మన్యత ఈక్షణాత్తవ యతః స్వాత్మానమాత్మేశ్వరః॥ 06

అమ్మా! మానవులకు ఎంతో కొంత ఐశ్వర్యం నీ కటాక్షం వల్లనే కలుగుతుంది. ఇందులో ఏమి ఆశ్చర్యం లేదు. ఎందుకంటే సమస్త విశ్వాన్ని శాసించే ప్రభువైన శ్రీమన్నారాయణుడు నీ కటాక్షం వల్లనే కృతార్థుడైనానని భావిస్తున్నాడు కదా!

ఐశ్వర్యం యదశేషపుంసి యదిదం సౌందర్యలావణ్యయోః
రూపం యచ్చ హి మంగళం కిమపి యల్లోకే సదిత్యుచ్యతే।
తత్సర్వం త్వదధీనమేవ యదతః శ్రీరిత్యభేదేన వా,
యద్వా శ్రీమదితీదృశేన వచసా దేవి ! ప్రథామశ్నుతే॥ 07

ఓ లక్ష్మీదేవి! జీవులందరికీ ఏర్పడే సంపద, సౌందర్యం, లావణ్యం, పవిత్రత ఇవన్నీ కూడా నీ వల్లనే కలిగింది. అందువల్ల వాటిని పేర్కొనేటప్పుడు నీ పేరులోని 'శ్రీ' లేదా 'శ్రీమత్' పదమును చేర్చి లోకంలో వ్యవహరిస్తారు.

దేవి! త్వన్మహిమావధిర్న హరిణా నా౽పి త్వయా జ్ఞాయతే
యద్యప్యేవమథా౽పి నైవ యువయోస్సర్వజ్ఞతా హీయతే!
యన్నాస్త్యేవ తదజ్ఞతామనుగుణాం సర్వజ్ఞతాయా విదుః
వ్యోమాంభోజ మిదంతయా కిల విదన్ భ్రాంతో౽యమిత్యుచ్యతే! 08

ఓ దేవీ! నీ వైభవాన్ని ఉన్నది ఉన్నట్లుగా పొగడడం నీచేత గానీ, నీ భర్త వల్ల కానీ సాధ్యం కాదు. అయినప్పటికీ మీ సర్వజ్ఞత్వానికి ఏ లోటు లేదు. ఎట్లంటే, లోకంలోని పదార్థాలలో నీ వైభవం కూడా ఒకటి కదా! ఎవరికీ తెలియనిదైనా, అది తెలియకపోవడం అనేది మీ సర్వజ్ఞత్వానికి తార్కాణమే కదా!

లోకే వనస్పతి బృహస్పతి తారతమ్యం
యస్యాః ప్రసాదపరిణామముదాహరంతి ।
సా భారతీ భగవతీ తు యదీయదాసీ,
తాం దేవదేవమహిషీం శ్రియ మాశ్రయామః॥ 09

తల్లీ! లోకంలో ఒక జీవి జడుడిగా, విద్వాంసుడిగా పుట్టడంలోని తారతమ్యం ఏ సరస్వతీదేవి అనుగ్రహం చేత కలుగుతోందో ఆమె కూడా నీ దాసి. అటువంటి దేవదేవుని దేవేరివైన నిన్ను ఆశ్రయిస్తున్నాము.

యస్యాః కటాక్ష మృదువీక్షణ దీక్షణేన
సద్యః సముల్లసితపల్లవ ముల్లలాస।
విశ్వం విపర్యయ సముత్థవిపర్యయం ప్రాక్
తాం దేవదేవమహిషీం శ్రియ మాశ్రయామః॥ 10

పూర్వం, ప్రళయ సమయంలో, లక్ష్మీదేవి కటాక్షం పొందని కారణంగా వాడిపోయిన జగత్తు అంతా, దానిని కటాక్షించాలని ఆమె సంకల్పించిన వెంటనే మళ్ళీ చిగురించినది. అటువంటి దేవదేవుని దేవేరైన ఆ లక్ష్మీదేవిని ఆశ్రయిస్తున్నాను.

యస్యాః కటాక్ష వీక్షాక్షణలక్ష్యం లక్షితా మహేశాః స్యుః।
శ్రీరంగరాజమహిషీ సా మామపి వీక్షతాం లక్ష్మీః॥ 11

ఏ లక్ష్మీదేవి కటాక్ష వీక్షణాలకు లక్ష్యం అయినవారు, గొప్పదైన భగవత్ కైంకర్యం అనే సంపద కలిగినవారై, ధన్యులు అవుతున్నారో, అటువంటి వైభవాన్ని కలిగిన శ్రీరంగనాయికి రూపంలోని లక్ష్మీదేవి నన్ను కూడా కటాక్షించాలని ఈ శ్లోకం అన్ని సంపదలకూ మూలం లక్ష్మీదేవియే అని తెలుపుతోంది.

ఈ '**శ్రీస్తవం**' స్తోత్రాన్ని ప్రతిదినం చదవడం వల్ల సకల సంపదలు, శ్రేయస్సు, శాంతి సౌఖ్యాలు పొందుదురు గాక!

సర్వేజనాః సుఖినో భవంతు







తిరుమల తిరుపతి దేవస్థానముల నూతన కార్యనిర్వహణాధికారిగా శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్., గారు ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం. వారితో బాటు తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., డా॥ ఏ.శరత్, విశ్రాంత ఐ.ఏ.ఎస్., మరియు ముఖ్యనిఘాభద్రతాధికారి శ్రీ కె.వి.మురళీకృష్ణ, ఐ.పి.ఎస్., గారలు ఉన్నారు.


శ్రీ ముద్దాడ రవిచంద్ర గారు 1996 బ్యాచ్‌కు చెందిన భారతీయ పరిపాలనా సేవ (ఐ.ఏ.ఎస్.) సీనియర్ అధికారి. ఆయన ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందినవారు. 1972 ఆగస్టు 19న ఆంధ్రప్రదేశ్‌లో జన్మించిన ఆయన, కేవలం 24 ఏళ్ల వయస్సులోనే 1995లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. బి.టెక్. (మెకానికల్ ఇంజినీరింగ్) పట్టభద్రుడైన ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు ముఖ్య పరిపాలనా హోదాలలో పనిచేసి, ఆర్థిక, సామాజిక సంక్షేమ, ఆరోగ్య, ముఖ్యమంత్రి కార్యాలయంవంటి కీలక శాఖలను సమర్థవంతంగా నిర్వహించారు.

**వీరి పాలనా ప్రస్థానం :**

01) అసిస్టెంట్ కలెక్టర్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లా
02) ప్రాజెక్ట్ డైరెక్టర్, డీపీఏపీ, చిత్తూరు
03) జాయింట్ కలెక్టర్, రంగారెడ్డి, హైదరాబాద్.
04) కలెక్టర్, నెల్లూరు
05) కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, చిత్తూరు
06) వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, ఎ.పి.హెచ్.ఎం. & హెచ్.ఐ.డి.సి., హైదరాబాద్
07) కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, తూర్పు గోదావరి
08) మెంబర్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
09) మేనేజింగ్ డైరెక్టర్, ఎ.పి.హెచ్.ఎం. & హెచ్.ఐ.డి.సి.,
10) ప్రభుత్వ కార్యదర్శి, ఆర్థికశాఖ (వ్యయ విభాగం)
11) ప్రభుత్వ కార్యదర్శి, సామాజిక సంక్షేమ శాఖ
12) ప్రభుత్వ కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖ
13) ప్రభుత్వ కార్యదర్శి (కోవిడ్-19 నిర్వహణ & టీకాకరణ), ఆరోగ్య, వైద్య & కుటుంబ సంక్షేమ శాఖ
14) ప్రిన్సిపల్ సెక్రటరీ టు గవర్నమెంట్ (కోవిడ్-19 నిర్వహణ & టీకాకరణ), ఆరోగ్య, వైద్య & కుటుంబ సంక్షేమశాఖ
15) ప్రిన్సిపల్ సెక్రటరీ టు గవర్నమెంట్, మహిళా, శిశు, వికలాంగ & వృద్ధుల సంక్షేమ శాఖ
16) ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

**ప్రస్తుతం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి కొలువులో...**

తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా మరియు ధర్మకర్తలమండలి ఎక్స్-అఫిషియో సభ్యులుగా 06-02- 2026వ తేదిన తిరుమల స్వామివారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. వీరు వివిధ ప్రభుత్వశాఖలలో వటుడింతై ఇంతింతై అన్నట్లు వివిధహోదాలలో పనిచేసి అపారమైన అనుభవాన్ని తమ సొంతం చేసుకొని తమదైన శైలిలో పని చేసి, విభాగంలో అందరూ పనిచేసేటట్లు వారిలో అంకిత భావాన్ని పెంపొందించి, పై అధికారుల మన్నన పొందిన వారు వీరు. వీరు కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారి ప్రధాన సేవకులుగా శ్రీకార్యనిర్వహణాధికారి హోదాలో పనిచేయడానికి రావడం ముదావహం. వీరు 'సప్తగిరి' మాసపత్రికకు గౌరవసంపాదకులుగా వ్యవహరిస్తారు. 'సప్తగిరి' వీరికి హార్థిక స్వాగతం పలుకుతుంది.



25-01-2026న
తిరుమల శ్రీవారి ఆలయంలో తి.తి.దే. నూతన సంయుక్త కార్యనిర్వహణాధికారి (విద్య & వైద్యం)గా డా॥ఏ.శరత్, విశ్రాంత ఐ.ఏ.ఎస్., గారు పదవీబాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం. అనంతరం తమ కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకుని తీర్థపసాదాలు స్వీకరించారు.

# శ్రీ కోదండరామస్వామి వారి ఆలయం, తిరుపతి

– శ్రీ టి.రామరమేశ్‌కుమార్, 94904 23444

మన దేవాలయాలు

ఆంధ్రప్రదేశంలోని తిరుపతిజిల్లాలోని (ఒకప్పటి చిత్తూరుజిల్లా) "తిరుమల" విశ్వవిఖ్యాతమైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. 'ఆ తిరుమల పాల కొండ'లను ఆనుకొని దిగువ ఉన్న ప్రాంతమే "తిరుపతి" పుణ్యక్షేత్రం. ఎగువతిరుపతి తిరుమల అని, దిగువతిరుపతి తిరుపతి అని ప్రసిద్ధి. అట్టి తిరుపతిలో చాలా దేవాలయాలు "తిరుమల తిరుపతి దేవస్థానం" వారి ఏలుబడిలో ఉన్నాయి. ప్రముఖంగా **అలమేలుమంగాపురం, శ్రీనివాసమంగాపురం, శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం, శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయం** అందరికీ తెలిసినవే!

అయితే "తిరుపతి" నడిబొడ్డున గల పరమ ప్రశాంత వాతావరణంలో వెలసి ఉన్న **"శ్రీ కోదండరామస్వామి"**వారి ఆలయం గూర్చి ఎందరికో తెలియకపోయి ఉండవచ్చు. ఈ ఆలయం కూడా ఏనాటి నుంచో "తిరుమల తిరుపతి దేవస్థానం" వారి పాలనలో ఉండటం విశేషం! పైగా ఈ ఆలయం అలిపిరి ద్వారా తిరుమలకు నడచి వెళ్ళే మార్గం ముందు వెలసి ఉంది. అట్టి స్వామి ప్రాముఖ్యాన్ని గురించి భక్తులకు తెలిస్తే ఆలయ సందర్శన ఆసక్తి కలిగిస్తుంది.

మన భారతదేశంలో పుణ్యక్షేత్రాలు, తీర్థాలు, ఎంతో పురాతన చరిత్ర కలిగిన మహామహిమాన్వితమైన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. వేటి ఘనత వాటిదే. ఇవన్నీ భగవత్‌శక్తి కేంద్రీకృత ప్రదేశాలై ఎందరో యోగులు, జ్ఞానులు, తపశ్శక్తి సంపన్నులైన మహర్షులచే ప్రతిష్ఠించబడినవి. మరికొన్ని స్వయంభువుగా వెలసినవి. ముఖ్యంగా దేవాలయాల ప్రతిష్ఠ 5 విధాలుగా చెపుతారు.

అవి–1)స్వయంభువుగా వెలసినవి 2)మహర్షుల ప్రతిష్ఠ 3)పురాణపురుషుల ప్రతిష్ఠ 4)దేవతల ప్రతిష్ఠ 5)మహాఅవతార పురుషులైన మానవుల ప్రతిష్ఠ.

ఈ "శ్రీకోదండరామాలయం" జాంబవంతుల వారి ప్రతిష్ఠగా తెలుస్తోంది. ఒక్కో ఆలయ ప్రతిష్ఠకు ఒక్కో దూరపు (యోజనల) మేర వాటి శక్తి ప్రతిష్ఠితమై ఉంటుందని అంటారు. పెద్దలు. వెలుగునిచ్చే "దీపకాంతి"వలె ఏ దేవాలయమైన దరి చేరినంతనే ఆ "జ్ఞాన దీపకాంతి"ని భక్తులపై ఒకే విధంగా ప్రసరింపచేసి అనుగ్రహిస్తుందని అనటంలో సందేహం లేదు.

ఇక ఈ ఆలయాన్ని గురించి తిరుమల తిరుపతి దేవస్థానముల చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. ఈ విషయాలు ఆ వరాహపురాణము, భవిష్యోత్తర పురాణములలో వివరించబడి ఉన్నవని, అయితే అందులో చంద్రవంశపు రాజైన జనమేజయుల వారు పునఃప్రతిష్ఠించినట్లు తెలిపి ఉన్నారు. అంటే 'జాంబవంతుల' వారిచే ప్రతిష్ఠించబడి, యుగాంతం పిమ్మట 'జనమేజయుల' వారిచే పునరుద్ధరించబడినది అనుకొనినా కూడా ఈ ఆలయం 'పురాణపురుషుల' ప్రతిష్ఠ అనుకోవచ్చును.

ఇక నవీనశాసనాధారాల ప్రకారం శక సం॥1402లో (1480)లో "శఠగోప నరసింహ ఉడయ్యార్" కాలంనాటి





సంస్కృతి, సంప్రదాయాల చిహ్నంగా ఆయన ఆజ్ఞమేరకు శ్రీగోవింద రాజస్వామి ఆలయమునకు ఉత్తరంవైపున ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలియుచున్నది. కీ.శే. సాధుసుబ్రహ్మణ్యశాస్త్రిగారి ప్రకారం ఈ 'నరసింహ ఉడయ్యార్'గారే నాటి "సాళువనరసింహ రాయలు" అన్నమాట! అప్పట్లో ఈ స్వామివారిని "రఘునాథుని"గా కొలిచేవారు. తరువాత విజయనగరరాజులు, అంతకు ముందున్న చోళ, పాండ్యపల్లవ రాజులు, తరువాతి వారైన యాదవరాజులు, తర్వాతి వారైన మహంతులు ఇలా అనేకమంది మహనీయుల ఏలుబడిలో ఉన్న ఈ ఆలయం నేడు తి.తి.దే.పాలనలో ఉంది. సీతారామలక్ష్మణులు నెలకొని ఉన్న ఈ ఆలయంలో 'వైఖానస ఆగమశాస్త్ర' రీతిలో తిరుమలలో వలె పుజాదికాలు జరుగు చున్నాయి. స్వామివారు వెలసిన సన్నిధి వీధిలోని "దీపస్తంభం" ఎదురుగా "శ్రీభక్తాంజనేయస్వామి" వారి ఆలయం తిరుమలలోని "శ్రీబేడిఆంజనేయస్వామి" ఆలయం వలె వెలసి ఉన్నది.

శ్రీకోదండరామస్వామివారి ఆలయం ప్రాకారం, సన్నిధి, నాలుగు మాఢవీథులతో శోభాయమానంగా వెలసి, తిరుమల శ్రీవారిని తలపిస్తూంటుంది. ఈ ఆలయంలో విశేషంగా స్వామి వారిని దర్శించిన భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించిన అను భూతిని పొందుతారనటంలో అతిశయోక్తిలేదు. స్వామివారు స్థానక భంగిమలో తన దక్షిణ భాగంవైపు (కుడిప్రక్క) శ్రీ సీతాదేవిని, వామభాగం వైపు(ఎడమవైపు) శ్రీ లక్ష్మణస్వామిని కలిగి అందరిని తన ముగ్ధమనోహర రూపంతో తన్మయులను చేస్తున్నారు!!!

'వరప్రసాది'గా పేరున్న ఈ స్వామిని దర్శించుట నిజంగా పూర్వజన్మ సుకృతమే అని అనుకోవచ్చు. గర్భగుడిలో వైఖానస ఆగమరీత్యా పంచబేర మూర్తులు అనగా మూలవర్లు (ధృవమూర్తి), కౌతుకమూర్తి, ఉత్సవమూర్తి, స్నపనమూర్తి, బలిమూర్తులు ఆలయంలో నిత్యపూజలో ఉన్నవి. అంతేకాక "శ్రీ చక్రత్తాళ్వార్", పాన్పుసేవలో పరుండబెట్టే "శ్రీతాండవ కృష్ణస్వామి", "శ్రీ భక్తాంజనేయస్వామి", "ఉత్సవమూర్తులు" కూడా నిత్యపూజలందు కొంటున్నవి. అలాగే శ్రీవిష్వక్సేన, శ్రీభాష్యకారుల, శ్రీగరుడాళ్వార్ ఉపాలయాలు ప్రదక్షిణ మార్గం, మహామంటపాల్లో వెలసి ఉన్నవి.

ఇలా సీతాదేవి కుడిప్రక్క, శ్రీ లక్ష్మణులవారు ఎడమప్రక్క ఉన్న శ్రీరామున్ని అర్చించటం సాక్షాత్తు శ్రీ మహావిష్ణువుని (వైకుంఠ వాసుణ్ణి) పూజించిన పుణ్యఫలప్రదమని వైఖానస ఆగమరీత్యా ఈ క్రింది శ్లోకం ద్వారా తెలుపుతారు.

శ్లో॥ "సీతాయాం దక్షిణే పార్శ్వే లక్ష్మణస్య చ పార్శ్వతః।
తన్మధ్యే రాఘవం వందే ధనుర్బాణాధరం హరిం॥

*(విమానార్చన కల్పం-ప్రతిష్ఠానుక్రమణిక-వైఖానస ఆగమం)*

ఇలా స్వామివారికి దక్షిణవైపు సీతమ్మ ఉన్న శ్రీ రాముల వారిని కల్యాణరామునిగానూ, మోక్షం ప్రసాదించే స్వామిగానూ, ఎడమవైపు ఉన్నట్లు పూజిస్తే "ఐశ్వర్య" సిద్ధిగానూ కొందరి పెద్దల ఉవాచ! తిరుమలలో కూడా శ్రీ సీతారామలక్ష్మణులను ఇలానే పునర్వసురోజు దర్శించవచ్చు. (ఉత్సవమూర్తులను)

**ఇక ఈ ఆలయంలో జరిగే పూజాదికాలను, అనేక ఉత్సవ విషయాలను గురించి తెలుసుకొందాం!**

శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో శ్రీవారికి నిత్యోత్సవ, వారోత్సవ, నక్షత్రోత్సవ, అయనోత్సవ, సంవత్సరోత్సవ, ఇతర సేవలు ఇంచుమించు తిరుమలలో వలనే వైఖానస ఆగమ రీత్యా జరుగుచున్నవి.

ఈ స్వామివారి బ్రహ్మోత్సవములు "పంగుణి బ్రహ్మోత్సవము" లుగా పిలువబడుచున్నవి. మొట్టమొదటిరోజు "ధ్వజారోహణం" మొదలుకొని 9వ రోజు "ధ్వజావరోహణం" వరకు నవాహ్నికంగా ఫాల్గుణమాసం (తమిళ పంగుణిమాసం)లో జరుగును. మృగశిర అవరోహణంలో స్థానిక "కపిలతీర్థం"నందు "చక్రస్నానం' జరుగును. అన్ని బ్రహ్మోత్సవాలు తిరుమల శ్రీవారి ఆలయంలో వలెనే అదే క్రమంలో జరుగును. అనగా ధ్వజారోహణం- పెద్దశేష వాహనం-చిన్నశేషవాహనం- సింహవాహనం- కల్పవృక్షవాహనం- గరుడసేవ(5వ రోజు రాత్రి)- హనుమంతవాహనం- వసంతో త్సవం అనంతరం గజవాహనం- సూర్యప్రభ- చంద్రప్రభ- ఇలా ఎనిమిదవనాడు "రథోత్సవం"- అశ్వవాహనం అయిన పిమ్మట తొమ్మిదవరోజు "చక్రస్నానం" తరువాత ద్వాదశ ఆరాధన- ఆపై రెండవ వసంతోత్సవం జరుగును.

ఇంకా స్థానికంగా శ్రీ గోవిందరాజస్వామి ఆలయం వెనుక ఉన్న పాత పరిపాలనా కార్యాలయం బావి వద్ద "ఖనిజతోట ఉత్సవం", శ్రీసీతారామలక్ష్మణుల ఉత్సవవిగ్రహాలను తీసుకువచ్చే "రేపాకులసుబ్బమ్మగారి తోట ఉత్సవం" భక్తులకు బ్రహ్మోత్సవాల అనంతరం దర్శనభాగ్యం కలిగిస్తారు. ఇక ప్రతి ఏటా "కూపు చంద్రపేట" (తిరుపతికి సుమారు 6 కి.మీ. దూరం గల)కు మాఘబహుళపాడ్యమినాడు స్వామివారు ప్రొద్దున్నే వెళ్ళి అక్కడే సాయం కాలంవరకు ఉండి తిరిగి రాత్రి ఆలయానికి చేరుకునే ఉత్సవం (60ఏళ్ళ క్రితం జరిగిన ఈ ఉత్సవం 2006 నుంచి

పునరుద్ధరింపబడినది) జరుగుతుంది. ఈ ఊరిలోని పురాతన శ్రీరామాలయ మంటపం ముందు స్వామివారికి 'స్నపనం' జరిగి, "ఆస్థానం" అయిన పిమ్మట సాయంకాలం ఊరేగింపులో భక్తుల హారతులు అందుకొని తిరిగి వేంచేస్తారు. ఈ ఊరి వారంతా ఐక్యమత్యంగా "రామభక్తి" పరాయణులై ఈ వేడుకలో పాల్గొనటం ఎంతో ముదావహం.

బ్రహ్మోత్సవాలతో పాటుగా చైత్రమాస ఆరంభంలో జరిగే 'ఉగాది ఆస్థానం", శ్రీరామనవమి సందర్భంగా మూలవర్లకు ప్రత్యేక అభిషేకము- రాత్రి హనుమంతవాహనం, ఆ తర్వాతరోజు 'శ్రీ సీతారామకల్యాణం' పిమ్మట 'శ్రీరామపట్టాభిషేకం' కడు రమ్యంగా జరుపబడుతున్నవి. ముఖ్యంగా 'శ్రీరామనవమి' నాడు స్వామివారికి ఆస్థానం జరిపి, ఆయన ఎదుట 'బాలకాండ'- (దీనినే 'సంక్షిప్త రామాయణం' అందురు) పఠిస్తారు. సకల వేదములతో సమానమైన ఈ 'రామగాథ' చిత్తశుద్ధిని, కామితార్థములను ఆయు రారోగ్య ఐశ్వర్యములను కలుగజేస్తుంది. ఇక 'కల్యాణోత్సవము" మిక్కిలి శోభతో అత్యంత అద్భుతంగా "ఊంజలమంటపం"లో (వైఖానస ఆగమశాస్త్రపరంగా) జరుగుతుంది. ఆ మరుసటిరోజు జరిగే పట్టాభిషేకమును భక్తులు వీక్షించి తరించగలరు. ఈ ఉత్సవముల తర్వాత స్వామివారి తెప్పోత్సవములు స్థానిక రామచంద్ర పుష్కరిణిలో 3 రోజులు జరుగుతాయి. ఉత్సవాల అనంతరం స్వామివారికి "పుష్పయాగ మహోత్సవం" కనులవిందుగా జరుగుతుంది. అలాగే స్వామివారికి ప్రతిఏటా "పవిత్రోత్సవములు" జరుగుతాయి.

**01)** ప్రతి సంవత్సరం రథసప్తమినాడు శ్రీవారు శంఖ, చక్ర, గద, కోదండధారుడై, ఎరుపువస్త్రంతో ఉదయం సూర్యప్రభ వాహనంలో, రాత్రి తెల్లటి పట్టువస్త్రధారిగా చంద్రప్రభ వాహనంపై దర్శనమిస్తారు.

**02)** వైశాఖమాసంలో 'హనుమజ్జయంతి' ఉత్సవంలో భాగంగా ఆనాటి సాయంకాలం శ్రీవారు హనుమంతవాహనంపై వేంచేసి భక్తులను కటాక్షిస్తారు.

**03)** శ్రావణమాసంలో 'శ్రీకృష్ణాష్టమి' సందర్భంగా తాండవ కృష్ణస్వామికి స్నపనతిరుమంజనం జరిపి, బాలకృష్ణుని విశేషంగా అలంకరించి, దర్శనభాగ్యము కలిగిస్తారు. అలాగే మరుసటిరోజు నాలుగుమాడవీథులలో స్వామివారి తిరుచ్చి ఉత్సవం, ఆ పిమ్మట "ఉట్లఉత్సవము" జరుగుతుంది.

**04)** దక్షిణాయనం, కటక సంక్రమణ సందర్భముగా జరిగే "ఆణివర ఆస్థానము' ఆశ్వయుజమాసంలో దీపావళి ఆస్థాన ములలో గోవిందరాజస్వామివారి వద్ద నుంచి స్వామివారికి "కార్తికదీపం"తో వస్త్రబహుమానంగా జరిగే ఆస్థానం చూసి తరించాల్సిందే.

**05)** ధనుర్మాసం సందర్భముగా మార్గశిరమాసంలో 30రోజులు స్వామివారికి విశేష అలంకరణతో భక్తులకు దర్శనభాగ్యం కలిగిస్తున్నారు.

ఇక ప్రతి "పునర్వసు" నక్షత్రం రోజున 'శ్రీ సీతారామ కల్యాణోత్సవం' జరిగి, స్వామివారు రామచంద్రపుష్కరిణికి వేం చేస్తారు. అక్కడ ఆస్థానము జరుగుతుంది.

ప్రతి శనివారం సాయంకాలము ఊంజలసేవ తిరుచ్చి ఉత్సవం (నాలుగు మాఢవీథులలో) జరిగి ఆస్థానం జరుగుతుంది.

ప్రతి పౌర్ణమికి 'అష్టోత్తరశత కలశాభిషేకం" జరిగి, సాయంకాలం తిరుచ్చిఉత్సవంలో రామచంద్రపుష్కరిణికి ఊరే గింపుగా వెళ్ళి వస్తారు.

ప్రతి అమావాస్యకి స్వామివారికి "సహస్రకలశాభిషేకం" వైఖానస ఆగమోక్తంగా తిరుమలలో వలె జరుగుతుంది. ఆ నాటి సాయంకాలం, స్వామివారు 'హనుమద్వాహనం" పై వేంచేసి భక్తులను కటాక్షిస్తారు.

ప్రతి శనివారం, శ్రీ సీతారామలక్ష్మణుల మూలవర్లకు అభిషేకం (ఉదయం 6గం॥లకు) జరుగుతుంది. ప్రతి ఆదివారం శ్రీభక్తాంజనేయస్వామివారికి (ఉదయం 7గం॥లకు) మూలవర్లకు అభిషేకం జరుగుతుంది. విశేషమైన రోజులలో సమయం మారుస్తారు.

ఇంకా ఈ ఆలయంలో సుప్రభాతం, తోమాలసేవ, సహస్ర నామార్చన, సాధారణ అర్చన, రాత్రి ఏకాంతసేవ, వైఖానస ఆగమరీతిలో తిరుమలలో వలెనే జరుగుతున్నాయి.

"తాళ్లపాక అన్నమయ్య" స్వయంగా 'రసికుడ తిరుపతి రఘువీరా!' అనీ, 'శ్రీపతి పురనాయకా' అనీ, 'వేంకటాద్రిరామా' అనీ కీర్తించిన ఈ స్వామిని భక్తులు దర్శించి తరించగలరు.

"తిరుపతి శ్రీ కోదండరామస్వామిని" దర్శించి కరుణాకటాక్ష వీక్షణాలతో ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఐహికాముష్మికాలను పొందగలుగుదురుగాక!

॥ ఓం తత్సత్ ॥

మన మహర్షులు

# కపిలమహర్షి

**- సద్గురు డా॥ కందుకూరు శివానందమూర్తి**

పూర్వం ఒకప్పుడు బ్రహ్మ కర్దమ ప్రజాపతిని సృష్టించి, సృష్టిలో అనేక ప్రాణికోటిని సృష్టించమని ఆదేశించాడు. కర్దముడు సరస్వతీతీరానికి వెళ్ళి తపస్సు చేయటం ప్రారంభించాడు. అలా పది వేల సంవత్సరాలు ఆయన విష్ణువును గురించి తపస్సుచేసాడు. ఒకనాడు విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. "నీభార్య దేవహూతి వలన నీకు తొమ్మిది మంది కుమార్తెలు పుడతారు. ఆ తరువాత నా అంశలో ఒక కుమారుడు కలుగుతాడు" అని వరమిచ్చి అంతర్ధానమయ్యాడు, విష్ణువు.

ఆ తరువాత ఆమెకు విష్ణువుచెప్పిన ప్రకారమే తొమ్మిది మంది కుమార్తెలు కలిగారు. వాళ్ళపేర్లు- కళ, అనసూయ, శ్రద్ధ, హవిర్భువు, గతి, క్రియ, ఖ్యాతి, అరుంధతి, శాంతి. విజ్ఞానానికి సంబంధించినటువంటివి, ఉత్తమలక్షణాలకు చెందినవైన పేర్లు వాళ్ళకు పెట్టుకున్నారు. ఈ పేర్లు వింటుంటే ప్రతీకాత్మకం అనిపిస్తుంది. అరుంధతి కూడా ఆయనకు పుట్టిన పిల్లే! అలాగే శాంతికూడా! అలా తొమ్మిదిమంది కుమార్తెలు పుట్టిన తరువాత దేవహూతి పదవసారి గర్భవతి అయింది.

ఆమెతో కర్దముడు, "తొమ్మండుగురు కుమార్తెలు కలుగుతారని భగవంతుడు వరమిచ్చాడు. అలాగే కలిగారు. ఇప్పుడు నీ గర్భంలో సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడి అంశతో ఒక కుమారుడు కలుగబోతున్నాడు. ఆయనను పూజించు. ఆయనే మార్గాన్ని చూపిస్తాడు" అని చెప్పాడు.

ఆ విధంగా దేవహూతికి కపిలుడనే కుమారుడు జన్మించాడు. ఆయన జన్మించినందుకు దేవతలు సంతోషించారు. దేవదుందుభులు మోగాయి. ఆయన అంతటి పుణ్యపురుషుడు. బ్రహ్మదేవుడే స్వయంగా వచ్చి ఆ పిల్లవాడిని ఆశీర్వదించాడు. గంధర్వ కిన్నర కింపురుషులు గానం చేసారట. అప్సరసలు నాట్యమాడారు.

తరువాత కర్దముడు మహర్షులను ఆహ్వానించి తన కుమార్తెలను వివాహం చేసుకోమని కోరాడు. ఆవిధంగా ఆయన తన తొమ్మండుగురు కుమార్తెలకూ ఈ ప్రకారంగా వివాహం చేశాడు. అత్రిమహర్షికి అనసూయను, అంగిరసుడికి శ్రద్ధను, పులస్త్యుడికి హవిర్భువును, పులహుడికి గతిని, కృతాయువు (క్రతువు)కు క్రియను, భృగువుకు ఖ్యాతిని, వసిష్ఠునికి అరుంధతిని, ధర్ముడికి (అధర్వుడికి) శాంతిని, మరీచికి కళను ఇచ్చాడు. వాళ్ళను అత్త వారిండ్లకు పంపించివేశాడు.

తన కుమారుడు చిన్నపిల్లవాడు అయినప్పటికీ, అతడిని ఏకాంతంగా లోపలికి తీసుకునివచ్చి నమస్కరించి, "నాకు వరమిచ్చిన ప్రకారంగా నీవు నా ఇంట్లో అవతరించావు. ధన్యుడిని. నేను యోగ సమాధిని అనుష్ఠించి నిన్ను ధ్యానం చేసుకుంటూ ఏకాంతవాసానికి తరలిపోతాను. అనుజ్ఞనివ్వు" అని కుమారుడి రూపంలో ఉన్న నారాయణుడిని అడిగాడు కర్దముడు.

అందుకు కపిలుడు, "మునీంద్రా! నాజన్మకు కారణం ఏమిటంటే-మునులందరికీ యోగమార్గాన్ని చూపించటమే! అందుకే నేను ఈ లోకానికి వచ్చాను. నీ కోరిక మన్నించటం కోసం మాత్రమేకాదు, లోకానుగ్రహకాంక్షతో నేను ఇక్కడికి వచ్చాను. నా కార్యక్రమాన్ని తత్త్వబోధతో కొనసాగిస్తాను. అందరికీ తత్త్వబోధ చేస్తాను. సకలకర్మలలోనూ నీవు సన్న్యసించి, అంటే నీవు కర్మను వదిలిపెట్టి, నన్నే భక్తితో ఆరాధించు. ముక్తిని పొందుతావు" అన్నాడు.

'నేను' అంటే ఇక్కడ అర్థమేమిటి? కపిలుడిరూపంలో ఉన్న తన పుత్రుడైన నారాయణుడు. కర్దముడు నారాయణుడిని ఇదివరకే ఆశ్రయించాడు. పూజించాడు. ధ్యానంచేస్తున్నాడు. కపిలుడియొక్క ధ్యానమే- కపిలుడి యొక్క ఆరాధనే ముక్తి ప్రదమని ఆ నారాయణుడే చెప్పాడు. కపిలుడిని ఆరాధిస్తే ముక్తి లభిస్తుందని తనే స్వయంగా చెప్పాడు కపిలుడు.


వెంటనే కర్దమప్రజాపతి ఆ మార్గాన్ని అనుసరించి నిస్సంగుడై ఒక వనప్రవేశం చేసి పరబ్రహ్మమునే ధ్యానించాడు. "ఈ జగత్తంతా కూడా పరబ్రహ్మ వస్తువే! సగుణంగా వాసుదేవ మయమయి ఉంది. విష్ణుమయంగా ఉంది" అనే విషయాన్ని మనసులో దృఢంగా పెట్టుకొని ఆ కపిలుడినే ధ్యానించి ఆయన ముక్తిని పొందాడు.

కపిలుడి తల్లి అయిన దేవహూతి కుమారుడిని తనకు మార్గాన్ని చూపించమని వేడుకుంది. కపిలుడు తల్లికి ఆత్మబోధ చేసాడు. "జీవుని చిత్తమందు ఈ సంసారము త్రిగుణమయంగా ఉండటంచేత బంధనము కలుగుతోందని, ఈ చిత్తమందే- నిర్గుణమయిన బ్రహ్మపదార్థంపై ధ్యానం అవసరం లేకుండా

నారాయణాశ్రితంగా–అంటే, నారాయణుని ఆశ్రయించే చిత్త ముండేటట్లుగా అలవాటు చేసుకున్నట్లయితే, మోక్షం లభిస్తుంది" అని చెప్పి భాగవతమార్గాన్ని ఆమెకు బోధించాడు కపిలుడు.

తరువాత ఆయన 'సాంఖ్యయోగాన్ని' కూడా ఆమెకు చెప్పాడు. భక్తియోగం కూడా దేవహూతికి ఉపాసనామార్గంగా చెప్పాడు. కపిలుడు చెప్పిన మార్గంలో దేవహూతి భూమిని విడిచిపెట్టి ఆకాశంలో దూరంగా ఒకస్థితిని ఏర్పరచుకొని ఆయన చెప్పిన మార్గంలో తపస్సులో పరిణామం పొంది శ్రీహరిలో విలీనమయిపోయింది. ఆమె పేరుమీద భూమిపై 'సిద్ధిప్రద'మనే ఒక గొప్ప క్షేత్రం విలసిల్లింది. అనేకమంది సిద్ధులు, సాధ్యులు, దేవతలుకూడా కపిలుడిని పూజించారు. సముద్రుడు స్వయంగావచ్చి స్తోత్రం చేశాడు. ఆ తరువాత కపిలుడు సాంఖ్య మార్గమును బోధచేస్తూ శాంతచిత్తుడై, ఇల్లు వదిలిపెట్టి ఉత్తరదిశగా ప్రయాణమై వెళ్ళిపోయాడు.

కపిలమహర్షియొక్క ఆశ్రమంలో ఒకనాడు ఉత్తమ మైనటువంటి ఒకానొక గోవు దర్శనమిచ్చింది. గోవు వేద స్వరూపమని ఆయన అనేకమార్లు అనేకమందికి చెప్పాడు.



గోవు అక్కడ ప్రత్యక్షమవగానే, లేచివెళ్ళి దానికి నమస్కరించ కుండా, నిర్లక్ష్యంగా ఉన్నాడు. దూరంగా ఉన్న స్యూమరశ్మి అనే ముని ఇది గమనించాడు. "వేదములయొక్క స్వరూపమే గోవు అని ఈతడు చెప్పాడు కదా! గోవు ప్రత్యక్షంగావస్తే దాన్ని ఇతడు మన్నించలేదు. అసలు వేదములయందు ఈ కపిలుడికి ఎలాంటి భావన ఉన్నదో!" అది తెలుసుకుందామనుకొని ఆ స్యూమరశ్మి, తనయోగ బలంతో ఆ గోవు శరీరంలోకి ప్రవేశించి కపిలుడితో మాట్లాడాడు. "ఓ మహర్షీ! వేదములు దాంభికత్వా పాదకములు, దాంభికమైన కర్మకాండలకు హేతువులవుతాయి అని, ఆత్మ దర్శనమునకై సన్న్యసించి, దానికొరకు తపస్సుచేసిన యతీశ్వరులు అంటారు. నీ అభిప్రాయం ఏమిటి స్వామీ?" అని ఆ గోముఖం ద్వారా అడిగాడు గోవులో ప్రవేశించిన ఆ ముని.

అందుకు కపిలుడు, "వేదములయందు నాకు ఆదరణ కాని, అనాదరణ కాని రెండూ లేవు. సంసారంలో ఉండే ప్రతీవాడూ కూడా వేదవిహితమైన ఆచారములను అవలంబించి వాటివల్ల వేదమార్గంలో ఎలాంటి సుఖాలు వస్తాయో, ఎలాంటి క్షేమం కలుగుతుందో వాటిని పొందాలి. కాని యోగిస్థితి వేరు. వాక్పాణి పాయూపస్థలనేవి ఏవయితే శరీరంలో ఉన్నవో, వాటికి యోగిశరీరంలో స్థితిలేదు. అంటే అవి విషయములను విసర్జించవు, స్వీకరించవు. అంతర్ముఖుడైన యోగిని ఇంద్రియములు బాధించవు. కాబట్టి వేదకర్మలనుంచి అతనికి వచ్చే సుఖము గానీ, ఆచరించకపోతే వచ్చే దుఃఖము గాని ఉండవు. ఈ నవ ద్వారాలను మూసివేయగలిగినట్టివాడెవడైనా ఉంటే, అటువంటి– బుధునకు అటువంటి యోగికి– తపోదానవ్రతములుకాని, వేదప్రామాణ్యము కాని కావలసిన పనిలేదు" అన్నాడు.

అప్పుడు ఆ ఋషి గోగర్భంనుంచీ బయటికి వచ్చి, "మన్నించు మహర్షీ! నీ అభిప్రాయం తెలుసుకుందామని చెప్పి నేనిలా ప్రశ్నవేశాను. అసలు వేదం యొక్క ప్రామాణ్యత ఏమిటి? దానియొక్క ఆవశ్యకత ఏమిటి? లోకంలో ఉండేవారికి దాంట్లో ఉండే మహత్తు ఎట్లాగ పనికివస్తుంది– ఎందుకు పనికి వస్తుంది? నాకు చెప్పు" అని వేడుకున్నాడు.

దానికి జవాబుగా కపిలుడు, "వేదములే లోకములకు ప్రమాణములు. శబ్దబ్రహ్మ, పరబ్రహ్మలలో శబ్దబ్రహ్మవలన పరబ్రహ్మమును గ్రహించవచ్చును. 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అని పరబ్రహ్మవస్తువును గురించి శ్రుతి

చెపుతున్నది. బ్రహ్మవస్తువును మనసుతో పొందటానికి వీలులేదు. 'యతోవాచో నివర్తంతే'– అంటే అక్కడ పదములు, భాష, వాక్యములు దానిని నిర్దేశించలేవు. వాటికా శక్తిలేదు. కానీ మానవభాష, మానవజీవితానికి కావలసినటువంటి విషయాలను సుసంపన్నం చేస్తుంది. కానీ అగోచరమైన బ్రహ్మ వస్తువును భాష చెప్పగలుగుతుందా? చెప్పలేదు. వేదము దానిని గురించి ఎంతయినా మాట్లాడుతుంది. కానీ దానిని తను చూపించలేదు. వేదమును శబ్దబ్రహ్మము అని భావించాలి. అంటే నిర్గుణమైన బ్రహ్మవస్తువు (వాక్కు, మనస్సులకు అతీతంగా ఉన్నది) శబ్దరూపంలో వేదంగా పరిణమించి ఇలా వచ్చింది" అని చెప్పాడు.

వేదాధ్యయనం చెయ్యటంచేత, వేదాన్ని నమ్మటంచేత బ్రహ్మమునే నమ్ముతున్నానని భావిస్తే, అదేవిధంగా ఇదీ మార్గమవుతుంది సుమా! అని చెప్పాడు.

శబ్దబ్రహ్మ భావనయందు వేదాధ్యయనం చెయ్యమని చెప్పిన అర్థం దాంట్లో సిద్ధిస్తోంది. అది క్రతువులకు కారణం అవుతుంది. దానివల్ల వర్షం వస్తుంది. సంతానం కలుగుతుంది. పశువులు కలుగుతాయి. శత్రుక్షయము అవుతుంది. ఈ ప్రకారంగా చేసే వేదవిచారణ, వేదాధ్యయనం, వేదాచరణ ముక్తి హేతువు కాజాలదు. దానిని ఎట్లా వాడుకోవాలంటే, అది శబ్ద బ్రహ్మ అనే భావనలో ఉంటే– 'ఓం' అనే ప్రణవాన్ని శబ్ద బ్రహ్మంగా భావిస్తే కలిగే అనుభవం అది. 'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ' – అంటే, ఒకటే అక్షరం అది. బ్రహ్మవస్తువది. ఆ భావనతోటే ప్రణవాన్ని ఉచ్చరిస్తే మంచిది. అప్పుడు పొందబడే వస్తువు పొందబడుతుంది. అలాకాక, కేవలం నోటితో అంటే, లభించేది కాదది. ఎందుకంటే, అలా చేసినపుడు నోరు అరుస్తుందే తప్ప నోటికేమీ జ్ఞానం లభించదు. అనుభూతి జీవుడికి చిత్తముద్వారా లభిస్తుంది. చిత్తమనేటటువంటి ఒక ద్వారం ఉన్నది. ఆ ద్వారాన్ని దాటుకుని లోపలికి వెళితే ఆత్మవస్తువు అక్కడ ఉన్నది. అది జీవాత్మ అని అనబడుతున్నది.

చిత్తాన్ని ధరించటంచేత జీవాత్మ అనబడుతున్నది. చిత్తాన్ని భేదించి లోపలికి ఈ బ్రహ్మవస్తువును ప్రవేశపెట్ట గలిగితే, చిత్తభేదనం జరిగి ఆత్మవస్తువుకు బ్రహ్మవస్తువు యొక్క స్పర్శచేత బ్రహ్మజ్ఞానం సిద్ధిస్తుంది. ఇది ఒక పద్ధతి. అలా వేలకొద్దీ మార్గములు చెప్పారు. బ్రాహ్మణులు ఉత్తములై, వేదబోధిత కర్మలను అనుష్ఠిస్తూ శాశ్వతపదమును పొందవచ్చు. పురాణాల్లో 'బ్రాహ్మణ' శబ్దం ఎక్కడ వచ్చినా ఋషులనే అర్థం. ఋషులు అనేటటువంటి అర్థంలోనే ఆ మాట వాడతారు.

ఆ ఋషులకే అలాంటి ఉత్తమమైన అర్థం అన్వయిస్తుంది. వాళ్ళ పేరు పెట్టుకొని ఉన్నవాళ్ళు మామూలు మనుష్యులు. 'బ్రాహ్మణోఽ స్య ముఖమాసీత్'లో– 'అస్య ముఖమాసీత్' అంటే, 'బ్రాహ్మణులు అక్కడ ఉన్నారు' అని అర్థం. పరమేశ్వరుడియొక్క విరాట్పురుష ముఖమందు బ్రాహ్మణులు ఉన్నారు అని అర్థం. 'పుట్టిరి' అని లేదు, 'ఆసీత్' శబ్దం చేత, 'అజాయత' శబ్దం ఇతరుల విషయంలోనే వాడారు. బ్రహ్మజ్ఞులు, బ్రహ్మజ్ఞానులు, బ్రహ్మవేత్తలు ఆయన ముఖమందు ముందే ఉన్నారని అర్థం. కనుక ఇక్కడ 'బ్రాహ్మణు'లంటే సత్పురుషులనే అర్థం గ్రహించవచ్చు.

"కాబట్టి బ్రహ్మజ్ఞానం ఎవరికైతే ఉంటుందో"– వాళ్ళు బ్రాహ్మణులు అనబడతారు. వేదం చదువుకోవటంచేత అతడు ద్విజత్వాన్ని సార్థకం చేసుకుంటాడు. ఉపనయన సంస్కారాలచేత ఆ తరువాత వేదం ఎందుకు వాడుకోవలెనో అదిమాత్రమే తెలుసుకుని అందుకుమాత్రమే వేదాన్ని ఉపాసన చేసినవాడు విప్రుడనబడతాడు. విప్రత్వం అంటే వేదములను సక్రమంగా వాడుకుని విరాగియై, జ్ఞానమార్గంలో ఉండి సద్బ్రాహ్మణుడిగా సమస్తకర్మలనూ ఆచరిస్తూ, మోహబుద్ధి లేకుండా పరమాత్మను తన దృక్పథంలో పెట్టుకుని సంచరించటము.

"వేదంయొక్క తాత్పర్యం ఏమిటో గ్రహించి, తెలుసుకోదగినది ఏదో, దానిని వెతుక్కుంటూ ప్రయాణించేవాళ్ళు వేదజ్ఞులని అనబడతారు. అలా కానివాళ్ళు వేదపాఠకులు అనబడతారు" అని చెప్పాడు కపిలుడు.

"ఈ ప్రపంచమంతా వేదమందున్నది. వేదంలోనే అది ఉనికిని కలిగి ఉన్నది. కాబట్టి అట్లాంటి వేదమార్గమును అనుసరించేవారికి నమస్కరిస్తాను" అని కపిలుడు అన్నాడు. దానిని బట్టి ఆయన తాత్త్వికత కొంత మనకు తెలుస్తుంది. ఈ సంభాషణ భారతంలో అను శాసనికపర్వంలో చెప్పబడి ఉంది.

వేదవాఙ్మయం

# వేదము - ఉపాంగములు

- శ్రీ మువ్వల సుబ్బరామయ్య, 89782 61496

చతుర్దశ విద్యలలో నాలుగు వేదాలూ, ఆరు వేదాంగాలూ తరువాతవి నాలుగు ఉపాంగాలు- మీమాంస, న్యాయం, పురాణము, ధర్మశాస్త్రము.

## మీమాంస

నిరుక్తంలో వేదమంత్రాల అర్థం, మంత్రాల ప్రాముఖ్యత, ఉద్దేశ్యమూ, వాటి విశిష్టత మీమాంస తెలుపుతుంది. వేదాల్లో రెండు ప్రధానభాగాలైన కర్మకాండను పూర్వభాగమని, ఉత్తరకాండను ఉత్తరభాగమని పేర్కొన్నట్లే- మీమాంస కూడా. పూర్వమీమాంస, ఉత్తరమీమాంసగా రెండుగా విభజించి, పూర్వ మీమాంస కర్మకాండలో చెప్పబడిన కర్మల, యజ్ఞాల ప్రామాణ్యాన్ని విశదీకరించగా; ఉత్తర మీమాంస జ్ఞానకాండకు సంబంధించిన ఆత్మసాక్షాత్కార ప్రాముఖ్యాన్ని విశదపరుస్తుంది.

ప్రతి శాస్త్రానికి ఒక సూత్రం, ఒక వార్తికము, ఒక భాష్యం ఉంటాయి. పూర్వమీమాంసకి జైమినిఋషి సూత్రాన్ని, శబరస్వామి భాష్యాన్ని, కుమారిలభట్టు వార్తికాన్ని వ్రాశారు. కొద్ది తేడాతో ప్రభాకరుడు కూడా ఒక భాష్యం వ్రాశాడు.



జైమిని రచించిన పూర్వ మీమాంస బృహద్గ్రంథం. దానిలో పన్నెండు అధ్యాయాలు. ప్రతి అధ్యాయంలో చాలా పాదాలు, ఆ పాదాలకి అధికరణలు ఉన్నాయి. ఒక్కో అధికరణం ఒక్కో విషయాన్ని ప్రస్తావిస్తుంది. ఇవి వెయ్యి అధికరణాలున్నాయి. అందువలన పూర్వ మీమాంసని 'సహస్రాధికరణి' అని కూడా అంటారు.

ఉత్తరమీమాంస అంటే వేదాంతం. జ్ఞానకాండకు సంబంధించిన ఉత్తరమీమాంసపై సురేశ్వరాచార్యుడు వార్తికాన్ని రచించాడు.

## న్యాయము

వేదాలలో చెప్పిన వాటిని ధృవ పరచటానికి వినియోగించే సాధనాలని న్యాయమంటారు. ఈ శాస్త్రకారుడు **గౌతముడు**. గౌతముణ్ణి **'అక్షపాదుడ'**ని కూడా అంటారు. **కణాదుడు** కూడా వైశేషికమనే న్యాయశాస్త్రం రచించాడు.

రెండు పదార్థములు విభిన్నములై అంటే, ఆ రెంటిలో ఏదో ప్రత్యేకతలుండడమే- ఒకదానిలోని లక్షణాలు రెండవ దానిలో లేకపోవటం. ఈ విషయమే పరిశీలనకి మూలమవటం వల్ల ఆ పద్ధతిని వైశేషికమంటారు. న్యాయశాస్త్రం శాస్త్రీయ పద్ధతిలో నడుస్తుంది.

మౌలికసత్యాన్ని నాలుగుసాధనాల ద్వారా న్యాయ శాస్త్రం చర్చిస్తుంది– ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం, మొదటిది ప్రత్యక్ష ప్రమాణమనేది మనకి జ్ఞానేంద్రియాల వల్ల అనుభవ సిద్ధమయ్యేది. రెండవది అనుమానం తెలియని దానిని తెలిసిన దాని సహాయంతో గ్రహించటమే అనుమానం. ఉప మానమంటే లేనిదాన్ని గురించి ఉన్నదాని సహాయంతో తెలుసు కోవడం. శబ్ద ప్రమాణమనగా వేదాలుగాని, మహర్షుల వంటి మహనీయులుగానీ ఏదైనా చెప్తే దానిని ప్రమాణంగా స్వీకరిం చడం. వేదాలు భగవంతుని పలుకులేనని నమ్ముతారు. మనో వాక్కాయకర్మలుగా సత్యవ్రతులైన మహనీయుల పలుకులు కూడా 'శబ్దప్రమాణం'గా పరిగణింపబడతాయి.

## పురాణము

వేదాలలోని సూక్తాలు క్లుప్తంగా ఉంటాయి. వాటిని కథలుగా, ఆఖ్యానాలుగా పెంచి చూపుతాయి పురాణాలు, వ్యాసుడే మనకు పద్దెనిమిది పురాణాలను ప్రసాదించాడని అంటారు.

ఒక్కొక్క పురాణం ఒక్కొక్క దేవతకి ప్రాధాన్యమిస్తుంది. పురాణాలను వైష్ణవధర్మానికి సంబంధించినవి, శైవధర్మానికి సంబంధించినవి, శాక్తేయధర్మానికి సంబంధించినవి అని మూడువిభాగాలుగా విభజించారు. అవి– **బ్రహ్మపురాణం, పద్మపురాణం, విష్ణుపురాణం, శివపురాణం, శ్రీమద్భాగవతం, నారదపురాణం, మార్కండేయపురాణం, అగ్నిపురాణం, భవిష్యపురాణం, బ్రహ్మవైవర్తపురాణం, లింగపురాణం, వరాహపురాణం, స్కాంద మహాపురాణం, వామనపురాణం, కూర్మపురాణం, మత్స్యపురాణం, గరుడపురాణం, బ్రహ్మాండ పురాణం** మొదలైనవి. చరిత్ర, ఉపాఖ్యానం, తత్త్వం వీటిలో ఉన్నాయి.

పురాణానికి అయిదు లక్షణాలు (పంచలక్షణ) ఉండాలి. అవి, మొదటిది సర్గ–సృష్ట్యాది అన్నమాట. రెండోది ప్రతిసర్గ– సృష్టి జరిగిన తరువాత కాలక్రమేణ ప్రపంచంలో వచ్చిన వికాసం. మూడు వంశ– ఆ వంశ చరిత్ర ఒక తరం నుండి వేరొక తరానికి రావడం. నాలుగు మన్వంతరం– మానవాళి అంతటికీ ఆద్యులైన మానవులు, వెయ్యి యుగ క్రమాలు (ఒక్కొక్క యుగక్రమంలో నాలుగు యుగాలుంటాయి). వీటి చరిత్ర. అయిదు వంశాను చరిత్ర– దేశపాలకుల వంశ చరిత్రలు సూర్యవంశం చంద్రవంశం మరియు అంతరిక్షం యొక్క వర్ణనా ఉంటుంది.

వేదాలు ప్రభుసమ్మితాలు. పురాణాలు సుహృత్ సమ్మితాలు. కావ్యాలు కాంతాసమ్మితాలు, 'ఇట్లా చేయి, అట్లా చేయి' అని మాత్రమే వేదాలు అంటాయి. ఎందువల్లనో చెప్పవు. పురాణాలు ఇట్లా చేస్తే ఈ విధంగా మేలు కలుగుతుంది. అట్లా చేస్తే హాని కలుగుతుంది అని చెప్తాయి. ఏ పనినైనా ఒక విధంగా ఎందుకు చెయ్యాలో కథల ద్వారా చెప్తాయి. కథ ద్వారా సందేశాన్ని అందజేయటమే పురాణాల ధ్యేయం.

## ధర్మశాస్త్రం

పదునాలుగు విద్యలలోనూ చివరిది పురాణాల తరువాతది ధర్మశాస్త్రం. ధర్మసూత్రాలు–వ్యక్తిగత సామాజిక విధులను ఆ యా వర్ణాలవారు జీవితంలో వారి వారి దశలను బట్టి అనుసరించవలసిన వాటిని చెప్తాయి. ఇవి ధర్మసూత్రాలు (ఆపస్తంభునివి, గౌతమునివి మొదలగు వారివి) క్లుప్తంగా ఉంటాయి. ధర్మశాస్త్రాలు(స్మృతులు) శ్లోకరూపంలో ఉంటాయి.

*మనువు, పరాశరుడు, యాజ్ఞవల్క్యుడు, గౌతముడు, హారీతుడు, యముడు, విష్ణువు, శంకుడు, లిఖితుడు, బృహస్పతి, దక్షుడు, అంగీరసుడు, ప్రచేతసుడు, సంవర్తుడు, ఆసనసుడు, అత్రి, ఆపస్తంభుడు, శతపుడు ఈ పద్దెనిమిది మంది మహర్షులు* తమ అలౌకిక శక్తితో వేదాలలోని విషయాన్ని గ్రహించి ధర్మ శాస్త్ర రూపంలో వాటి సంకలనాలని వెలువరించారు. వీటినే **మనుస్మృతి, పరాశరస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి** ఇలా ఆయా ఋషుల పేర్ల మీద సూచించారు. పద్దెనిమిది స్మృతులకు తోడు పద్దెనిమిది అనుబంధ ఉపస్మృతులు కూడా ఉన్నాయి.

కల్పసూత్రాలకు చెందిన ధర్మసూత్రాల ఆధారంగా స్మృతి గ్రంథాలు వ్రాయబడినవి. ప్రాచీన భారతీయ సామాజిక, ధార్మిక, రాజకీయ సంబంధమైన జీవిత విధానాలను తెలుసు కోవడానికి తోడ్పడతాయి. ఆచార వ్యవహారాలను, నీతి ధర్మ విషయాలను, రాజనీతిని నిర్ణయించేటటువంటి గ్రంథాలు. మొత్తం మీద స్మృతుల సంఖ్య నూటయాభైరెండు వరకున్నా యని నిర్ణయించారు. శృతి, స్మృతి, పురాణం– అన్నీ ధర్మానికి సంబంధించినవే!

## శ్రీవేంకటేశ్వరలీలలు



# భక్తుల కొంగు బంగారం

-డా॥మన్నవ గంగాధర ప్రసాద్, 93988 73442

అది 2025 సంవత్సరం చివరి మాసం. త్వరలో ఏడాది ముగుస్తుంది. కొత్త సంవత్సరం అడుగుపెడుతుంది. ఈ సమయం తిరుపతి వాసులకు చాలా ప్రియమైనది. మార్గశిర మాసాంతంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం వస్తుంది. దీనిని ముక్కోటి ఏకాదశి అని కూడా పిలుస్తారు. ఆ రోజు తిరుమల ఆలయంలో ఉత్తరద్వార దర్శనమనే వైకుంఠద్వార ప్రవేశానికి అవకాశం ఉంటుంది. గతంలో ఇది ఒక్కరోజే ఉండేది. ఆ రోజు పెద్ద ఇబ్బంది ఏదీ లేకుండా వెళ్లి స్వామివారిని దర్శించుకుని, వైకుంఠద్వారం గుండా ప్రదక్షిణ పూర్తి చేసుకుని, తన్మయత్వంతో తిరుగు ప్రయాణమై వచ్చేవారు స్థానిక భక్తులు. అయితే ఇటీవల కాలంలో శ్రీనివాసుని దర్శనమే మహా భాగ్యంగా మారింది. జనప్రవాహం పెరిగిపోయి మామూలు దినాల్లోనే దర్శనం జరగడం లేదు. అన్నీ ఆన్‌లైన్ అయిపోయి చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఈ ఏడాది వైకుంఠఏకాదశి పర్వదినాలను ఇటీవల నిర్వహిస్తున్నట్టుగా పదిరోజులు నిర్వహించాలని తి.తి.దే. భావించింది. మొదటికొన్ని దినాలకు ఉచిత ప్రవేశంకోసం ఆన్‌లైన్లో పేర్లు నమోదు చేసుకోవాలని ప్రకటించింది. తొలి మూడురోజులకు దాదాపు 1.2 లక్షల టిక్కెట్లు ఇవ్వనున్నారు. అందుకు సుమారు 25లక్షలమంది భక్తులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు.



నేను కూడా మా మిత్రుని సహాయంతో అతనితో పాటు నా పేరు కూడా నమోదు చేసుకున్నాను. వారం తరువాత లక్కీడిప్ తీసి దర్శనం టిక్కెట్ పొందిన వారి పేర్లను తి.తి.దే. ప్రకటించింది. అందులో నా పేరు లేదు. నా మిత్రుని పేరు ఉంది. పైగా అతను తరచూ తిరుమల వెళుతున్నాడు.

నేను గత ఏడాది జనవరిలో ఇదే వైకుంఠ ఏకాదశికి వెళ్లిన వాణ్ణి, మళ్ళీ తిరుమల వెళ్లలేదు. ఇపుడు లక్కీడిప్‌లో నా పేరు లేకపోవడంతో నాకు చాలా బాధ కలిగింది. స్వామివారికి నాపై దయ లేదనుకున్నాను. దర్శనం చేసుకునే వీలు లేనందుకు చాలా చింతించాను. ఇదేంది స్వామీ ఇలా చేశావే అంటూ పాట కూడా రాసి వేదనతో పాడుకున్నాను.



**విద్య వినయాన్నిస్తుంది!**

**అది ఎవ్వరూ దోచుకోలేని అపార ధనాగారం!**

**విద్యవల్ల కీర్తి, సంపద, ఆనందం లభిస్తాయి!**

అసలే ఇటీవల నాకు వ్యాపారం లేదు. పనేమీలేక సంపాదన కూడా లేదు. ఉచిత టిక్కెట్ వచ్చుంటే పవిత్ర వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో స్వామివారిని దర్శించుకునే వాణ్ణి కదా అని బాధపడ్డాను. ఇప్పటికే అరవై ఏళ్లు వయసు వచ్చేసింది. మళ్లీ భవిష్యత్తులో వెళ్లగలనో లేదో, ఆరోగ్యం ఎలా ఉంటుందో అనే దిగులు కలిగింది.

ఇంతలో మా మిత్రుడు ఫోన్ చేసి "జనవరి తొలి వారంలో వైకుంఠ ఏకాదశి ప్రత్యేక దర్శనం కోసం రూ.300/- టిక్కెట్ కోటా విడుదల చేస్తున్నట్టు తి.తి.దే. ప్రకటించిందనీ, నీ కోసం ఈ మారు టిక్కెట్ కొనడానికి ప్రయత్నించమంటావా?" అని అడిగాడు.

నేను టిక్కెట్ డబ్బు పెట్టుకోవాలి కదా! దర్శనం ఉచితం కాదు. అందుకని, నేను సరే ఇది మాత్రం మనకు వస్తుందా? అనుకుని ఎందుకైనా మంచిది ప్రయత్నించమని చెప్పాను. సాధారణంగా స్వామివారి టిక్కెట్ల ఆన్‌లైన్ కోటా కొన్ని నిమిషాల్లోనే అయిపోతూ ఉంటుంది. ఆన్‌లైన్ కదా ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఆతురతతో కంప్యూటర్ లేదా సెల్‌ఫోన్లతో సిద్ధంగా ఉంటారు.

అది జరిగి రెండు రోజులు అయింది. మరుసటిరోజు ఉదయం 11 గంటలకు ఎవరో తెలియని వ్యక్తి నా వద్దకు వచ్చి తన బిడ్డ జాతకం చెప్పమన్నాడు. పరిశీలించి వివరాలు చెప్పాను. ఆయన సంతోషంగా, దక్షిణసార్ అంటూ, నా చేత రూ.500/- పెట్టి వెళ్లారు. ఐదువందలు కళ్ల చూచి చాలా రోజులైంది. ఇటీవల ఒకటి రెండు జాతకాలు చెప్పించుకున్నా, వారంతా రెండు అరటి పళ్ళు, రూ.116/- దక్షిణ పెట్టి పోతున్నారు. నేను ఎవరినీ ఏమీ అడగను. అంతే ప్రాప్తం అనుకుంటాను, ఇతనెవరో ఐదువందలు ఇచ్చాడు. చాలా సంతోషం వేసింది.

సరిగ్గా సాయంత్రం నాలుగు గంటలకు నా మిత్రుడు ఫోన్ చేశాడు. ఆ మధ్యాహ్నం మూడుగంటలకు తి.తి.దే. దర్శనం టిక్కెట్ కోటా విడుదల చేసిందనీ, మూడువందల రూపాయల టిక్కెట్టు నాకు దొరికిందనీ చెప్పాడు. జనవరి 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు దర్శన సమయం అని చెప్పాడు.

నేను ఆశ్చర్యపోయాను. వెంటనే నా మిత్రునికి రూ.300/- ఫోన్ పే చేసాను. నాకు ఆలోచనలో అయోమయంగా ఉంది. మొన్న ఉచిత దర్శనం టిక్కెట్టు రాలేదని దేవదేవునిపై కోప్పడి పాట రాసుకున్నాను కదా! అది గురుతు వచ్చింది. సెల్ ఆన్ చేసి ఆ పాట మరోసారి విన్నాను.

అప్పుడు తోచింది. నాకు ఉచిత టిక్కెట్ రాలేదని, ఆయన ఎవర్నో జాతకం చెప్పించుకునే మిషతో నా వద్దకు పంపి, ఐదువందలు ఇప్పించాడు. మళ్లీ లాటరీలో నాకు మూడువందల దర్శనం టిక్కెట్ వచ్చే లాగా చేశాడు. అంటే దర్శనం టిక్కెట్టుతో పాటు తిరుపతి నుండి తిరుమలకు పోనూ రానూ బస్ టిక్కెట్ కోసం రూ.200 కలిపి మొత్తం ఐదు వందలు ఆయనే ఇచ్చాడన్నమాట. అది స్వామివారికి ఆయన భక్తులపై ఉండే మమకారం, అందుకే ఏడుకొండల శ్రీనివాసుడు 'భక్తుల కొంగు బంగారం".

*ఓం నమో వేంకటేశాయ*

## జనవరి నెల క్విజ్-42 సమాధానాలు

01) భీష్ముడు
02) స్వర్ణసంక్రాంతి
03) వివస్వార్థుడు
04) చణకుడు
05) కౌటిల్యుడు
06) అన్నమయ్య
07) జ్ఞానార్యుడు
08) గోదాదేవి
09) శ్రీఉగ్రనరసింహస్వామి
10) అర్జునుడు
11) ఉత్తమధర్మం
12) త్యాగయ్య
13) మహాయోగం
14) పింగళి సూరన
15) నెయ్యి

**సరైన సమాధానాలు వ్రాసినవారు-**

01) గొలివి కౌండిన్య క్రిష్ణం నాయుడు, పూడివలసగ్రామం, ఎచ్చెర్లమండలం, శ్రీకాకుళం జిల్లా.
02) మాచాబత్తుని వెంకటసాయిప్రణవ్, విజయవాడ.
03) డి.వి.ఎస్.కె.లక్ష్మీసాహితి, తిరుపతి.
04) చోడవరపు విరించి, బాపట్ల.

# ధార్మికతకు యువహారతి

- శ్రీ జె. రవీంద్రనాథ్, 89781 31585

యువహృదయం వర్ణనకు అతీతం. అది సర్వదా కోరుకునేది కొత్తభావనలూ, నిత్యనూతన అనుభవాలనే! ఆ అన్వేషణ ఎప్పుడూ ఆశావహంగా ఉంటుంది. నవోషస్సులా, రససరస్సులా, మంజుల మహస్సులా సాగుతుంటుంది వారి మనసు. బతుకు ఎలమావితోట కావాలని, మదిమకరందపు తేటగా మారాలనీ కోరుతూ యువత చేసేదంతా మానసిక తపస్సు.

ఎన్నో ఆశలు, ఆకాంక్షలు! వాటి మధ్య విరామ చిహ్నమే తప్ప ముగింపు చుక్క అంటూ ఉండదు. ఆధునిక యువజనతరంగిణిని తరచి తరచి చూస్తే వినిపించేదేమిటి? పర్వత అగ్రభాగం నుంచి ధాటిగా దూకే జలప్రవాహధ్వని. జీవితమకరందం ఆనందమే కాబట్టి, బొట్టుబొట్టునూ చేర్చి అప్పటి ఆ ప్రతీక్షణాన్నీ ఆస్వాదించాలన్నదే వారందరి అంత రంగ తరంగం. అదంతా నైతికత, ఆధ్యాత్మికతతో నిండినపుడు చైతన్య భారతమే సాక్షాత్కరిస్తుంది.

మొత్తం ప్రపంచసాహిత్యంలోనే విఖ్యాతి పొందింది రామాయణం. ఆ ఇతిహాసంలో ఎన్నెన్నో జీవనవిలువలు నిక్షిప్తమై ఉన్నాయి. ధర్మం, నీతి, నిబద్ధత, అంకితభావం, సహన శీలతత్త్వం, పరోపకార పరాయణతవంటి అనేకం కావ్యంలో కనిపిస్తాయి, వినిపిస్తాయి. చరిత్ర, సంస్కృతి, విశ్వాసాలు, ఆచార సంప్రదాయాలు లెక్కకు మిక్కిలి తెలియవస్తాయి. వీటన్నింటి గురించీ బాల్యం నుంచి సవివరంగా తెలియచేస్తే యౌవనదశ సమస్తం వర్ణనాతీతంగా రూపుదిద్దుకుంటుంది. ఉన్నత, ఉదాత్త, ఉత్తమ పాత్రల తీరు గుండెగదిలోకి చేరి ఉషస్సు, మహస్సు వెల్లివిరుస్తుంది. అనుభూతితోనే తెలుస్తుంది ఇది.



ఎవరి జీవితంలోనైనా స్థితిగతులంటూ ఉంటుంటాయి. మహాభారతంలోని అనేకానేక పాత్రచిత్రణలు దశలను దిశలను ప్రస్ఫుటం చేస్తుంటాయి. ధర్మశాస్త్రంగా, నీతిప్రబోధకంగా, బహుపురాణకదంబంగా భారతానికి చిరప్రశస్తి. ఇందులోని పర్వాలన్నీ చెరకు గడల వంటివి. ఆస్వాదించిన కొద్దీ రుచి అనుభవానికి వస్తుంది. సమరసత అవసరాన్ని విపులీకరించేలా ఉంటుంది. భారత కావ్యరసాస్వాదన. పాఠశాల స్థాయి నుంచే భారతకథలను నీతిసహితంగా అధ్యయనం చేస్తే చాలు. కళాశాల, విశ్వవిద్యాలయస్థాయికి చేరేసరికి-ఏ సూత్రాన్ని విశ్వసించాలో, ఏ విధంగా ఆచరించాలో పూర్తిగా అవగతమవు తుంది యువతరానికి. ఎప్పుడైనా ఎక్కడైనా నిస్తేజం ఆవరించిన సందర్భంలో మూల ఉత్తేజాన్ని మిలమిలమనిపించే శక్తి సంపన్నత భారత రచనకుంది.

మహదానంద రసమయసాగరం భాగవతం. పరిపూర్ణ ఆరోగ్యప్రాప్తికి మహత్తర ఔషధం. విశ్వవ్యాప్త ప్రయోజనాన్ని అందించే బృహత్తర రచనం.

**లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మం**
**జులతా శోభితమున్, సువర్ణ సుమనస్సుజ్ఞేయమున్, సుందరో**
**జ్జ్వలవృత్తంబు, మహాఫలంబు, విమలవ్యాసాలవాలంబునై**
**వెలయున్ భాగవతాఖ్య కల్పతరువుర్విన్ సద్ద్విజ శ్రేయమై!**

భాగవతమనేది కల్పవృక్షం. దీని బోదె ఎంతో సుకుమారం. స్కంధాలన్నీ లలితలలితంగా ఉంటాయి. చెట్టు మూలమైతే సారవంతసమన్వితంగా, విస్తృతిసాధకంగా అలరారుతుంటుంది. శ్రుతిపక్వనాదాలతో చిలుకలు చేసే సందడి వృక్షమంతటినీ శోభాయమానంగా తీర్చిదిద్దుతుంది. హృదయంగమరీతిన భాసిల్లుతుంది. చెట్టును అల్లుకుని ఉన్న పూలతీగలు సహజసుందరత్వాన్ని వ్యాప్తి చేసినట్లే కదా. రంగురంగుల పుష్పాలతో నేత్రానందం!

ప్రకాశవికాసాల నెలవు భాగవత కథాసుధ. చదివినంత సేపూ, వింటున్నంత సేపూ, ప్రదర్శకరూపంగా చూస్తున్నంత

సేపూ యువమానసాలు అలౌకిక అనుభూతితో నిండుతాయన్నది అక్షరసత్యం. ధార్మికసంస్థలు, నీతినియమాల ప్రబోధక వ్యవస్థలు సాగిస్తూ వస్తున్న ప్రచారప్రక్రియలు యువతరంలోని శక్తి ఆసక్తులను విస్తృతపరుస్తుండటం వందనీయం, అభినందన పాత్రం.

సత్యాన్ని అనుసరిస్తే, ధర్మపథాన్ని కొనసాగిస్తే ఇహమూ పరమూ కూడ ఆనందతన్మయం, చైతన్య చిన్మయమే! సత్యం, శివం, సుందరం. ఈ జగమే దైవమందిరం. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు ఏవి ఏం చెప్పినా, ఎన్ని బోధించినా... సారాంశం ఒక్కటే. సత్యశీలత. దీన్ని సొంతం చేసుకున్న యువతతోనే జాతికి అత్యద్భుత భవిత.

భారతీయ సంస్కృతిని, వారసత్వాన్ని పరిరక్షించడమే యువజనుల ప్రథమకర్తవ్యం. సంస్కృతి అనేది మనందరి జీవన విధానం కనుక ఎన్నెన్నో అంశాలు దీనిలో ఇమిడి ఉంటాయి, ఉంటుంటాయి. నేర్చుకోవడం, పంచుకోవటం, సమగ్రత సాధించడం, మార్పు చేర్పులను ఆరోగ్యకరరీతిన ఆహ్వానించడం ఇందులో భాగాలు. ఇంట్లోని కుటుంబసభ్యులు, ఇంటి బయట మిత్రులద్వారా సాంస్కృతికతను నేర్చుకుంటారు యువతీ యువకులు. మనోభావాలను పంచుకుంటూ పురోగమనాన్ని అందుకుంటారు. మనసు, మాట, చేత ఫలితంగా సమగ్రతా వ్యవస్థకు కారకులవుతారు. కుటుంబజీవనంలో, సమాజ భాగస్వామ్యంలో మంచిమార్పులను అభిలషిస్తారు. ఇవన్నీ కొనసాగాలంటే సాంస్కృతిక వారసత్వ సంరక్షణ తప్పనిసరి. ఇదంతా నిత్యజీవితంలో నిబద్ధత వల్లనే సాధ్యపడుతుంది. ఆద్యులూ, బాధ్యులూ తామేనని వారు గుర్తించాలి.

భావబంధమే జీవగంధం. జీవనరంగంలో మంచిచెడులకు సదా సమరమే జరుగుతుంటుంది. దానవాగ్రణి అయిన తన తండ్రి ఎదుట దైవస్మరణ చేశాడు ప్రహ్లాదుడు! 'కమలాక్షు నర్చించు కరములు కరములు' అన్నాడతడు. 'వైరినామస్మరణ చేస్తావా' అని తండ్రిమండిపడినా, కించిత్తయినా చలించలేదు కుమారుడు. చివరికి గెలిచింది ఆ భక్తితత్పరతే! మనిషి అరవిందమైన క్షణంలో, మమతే మకరందమైన తక్షణ స్థితిలో ఆత్మీయత వికసిస్తుంది.

**శాంత సత్యక్షమా దయాక్రాంత బుద్ధి**
**సంతతానంద మహిమ యశోప్రవృద్ధి**
**భాగ్య సౌభాగ్య శోభ ప్రభా సమృద్ధి**

అవుతుంది జీవితమంతా. సుగుణాలు ఏకోన్ముఖంగా సాగుతున్నంత కాలమూ యువతత్వచింతన విస్తృతి చెందినట్లే!

'ఓం'తో మొదలయ్యే అక్షరాభ్యాసకూసువిద్యగా మారుతుంది. అకార ఉకార మకారాలతో రూపుదిద్దుకున్న బీజాక్షరం కాలచక్రపరిణామక్రమంలో పలురూపాలు సంతరించుకుంటుంది నిశ్చయంగా. అవి: శ్రవణం, మననం, ధ్యానం, జ్ఞానం, క్రియాత్మక శక్తి రూపాలు. బాల్య, కౌమార, యౌవనదశల్లో అలవడిన ఇవి అటు తర్వాత పరిణతిగా స్థిరపడతాయి.

అమ్మా నాన్నా జోడుదీవెనే సంతానానికి శాశ్వతరక్ష. అమ్మ ప్రేమ జోల లాలన అయితే, వెన్నమనసుతో ఆలనా పాలనా జోడిస్తాడు నాన్న. బుడిబుడి అడుగుల బడుగుస్థితి నుంచి వడి వడి అడుగుల దశ దాకా తల్లిదండ్రులే కంటిరెప్పల్లా చూసుకుంటారు. వ్యక్తిత్వానికి అర్థం, వికాసానికి అద్దం నడవడికే అని సుద్దులు చెబుతారు. అనురక్తి, సత్యసూక్తి ఉత్తమ లక్షణాలుగా గమనం సాగించి గమ్యం చేరుకోవాల్సింది యువజనులే! విద్యాబుద్ధుల పరమార్థం అదే.

కాలం ఆగదు. సాగుతుంటుంది. రూపురేఖలు శాశ్వతం కావు. మారడం తప్పనిసరి అని నిరూపణా అవుతుంది. తల్లిదండ్రులే వార్ధక్యదశలో చిరుగాలికి గలగల లాడే ఎండుటాకులవుతారు. జన్మకారకులైన వారిని ఇలవేల్పులుగా భావించి, సంభావించి, ఆదరించాల్సింది యువసంతానమే. పెద్దల మనసు తెలిసి మసలాల్సింది పిల్లలే!

నేల, వాన బంధం; మట్టి, చెట్టు అనుబంధం తెలుసు మనకి. ఆ కోవలోనే స్నేహబాంధవ్యం కూడా. మిత్రత్వం అనేది..

**అమృతధారలొలుకు, అనురాగాలు చిలుకు**
**దిగులుతీర్చు, దివ్యదీప్తి కూర్చు**
**మానవతలు చిందు, మకరందాల విందు.**

ఇదంతా కాలానికీ, ప్రాయానికీ అతీతంగా సాగే స్నేహగాన రవళి. 'నీకు నేను, నాకు నీవు' అన్నట్లు ఉంటుందా స్నేహబంధం! త్రికరణశుద్ధికి పర్యాయపదంలా నిలిచేదే నేస్త అనుబంధం అంటే. నూనె, వత్తి తరహాలో రూపుదిద్దుకునే సమైక్యతే మిత్రానుబంధం. పదిలంగా కాపాడుకోవాల్సిందీ, హితకరంగా నిలవాల్సిందీ మిత్రులే! కంఠంలో రాగం, గమనంలో విద్యుద్వేగం యువత. అది నవభారత హృదయాంబరంలో ప్రసరించాల్సిన మహేంద్ర చాపం. శాంతి కపోతమైనా, క్రాంతి జలపాతమైనా యువతరమే!

మార్చి 03 **హోలీపూర్ణిమ** సందర్భంగా...

# సంతోషాల వసంతకేళి

- శ్రీమతి మేడేపల్లి అన్నపూర్ణ,
99483 45013

**హో**లీ, పున్నమి... ఈ రెండింటికీ అవినాభావ సంబంధం. ఇది ప్రత్యేకించి భారతీయ ఆచార సంప్రదాయాలతో పెనవేసుకున్న అపురూప బాంధవ్యం. వివిధ ప్రాంతాలవారీగానూ ఎంతెంతో ప్రత్యేకత. ఎక్కడ ఏ పేరున పిలిచినా ఎన్ని రీతులను అనుసరిస్తూ వస్తున్నా; **'హోలీ'** అనే అక్షరాలలోనే మహోత్సవం, నవోత్సాహం పెల్లుబుకుతాయి. పున్నమి జత చేరితే, ఆ వెన్నెల వెలుగులే వేరు!

**నవనవానందం నిండగా, దివ్యభవ్యఅందం మెండుగా**
**ఉత్సుకత వెల్లివిరిసేలా, ప్రోత్సాహం విస్తరించేలా**
**పలురంగుల పండుగ ఇది!**

ఏటా వాడుకగా వచ్చే ఈ హోలీపూర్ణిమ పర్వదిన సంరంభం భక్తి, శక్తి ఉమ్మడి వైభవానికి ప్రతీక. ఆధ్యాత్మికతకు శిఖర పతాక.

ఫాల్గుణ మాసం ప్రధానంగా విష్ణుభగవానుడికి ప్రీతికరం. స్వామికి క్షీరాన్న నివేదనంతో ఇష్టసిద్ధి కలుగుతుందన్నది భక్తకోటి నమ్మిక. అనేక క్రతువులతో, దానాది కార్యాలతో గోవిందుడికి సంప్రీతి పెరుగుతుందనీ గాఢమైన విశ్వాసం



వారికి. మహావీరుడు అర్జునుడికి జన్మనక్షత్రరీత్యా ఉన్న పేరు ఫల్గుణుడు. అందుకే ఇది ధీరత్వానికీ సూచిక. చెడుమీద మంచి సాధించిన ఘనవిజయమాలిక.

ఈ మాసాధిపతి గోవిందుడు కాబట్టే, ఆ స్వామివారికి ఆరాధన. భక్తజనావళిని పరిరక్షించడంతో పాటు, ఆత్మతత్త్వాన్ని ప్రసాదించే దేవదేవుడు. ఇదే ఫాల్గుణంలో రావణునితో రణానికి శ్రీరామచంద్రుడు వానరసేన సహితంగా తరలి వెళ్లినట్లు ఇతిహాసం చెప్తోంది. హోలిక అనే దానవరూపి భక్తవరేణ్యుడైన ప్రహ్లాదుడిమీద దాడికి దిగిందని, విష్ణు భగవానుడి అనుగ్రహబలం వల్ల బూడిదగా మారిందని ఒక కథనం. దానవత్వం అంతరించి, దైవతత్త్వం వల్లిన ఘట్టం. దీని పరంగానూ హోలీ పున్నమి ఉత్సవం విలక్షణతకు ఉదాహరణగా నిలుస్తోంది.

**నరాడోలా గతం దృష్ట్వా గోవిందం పురుషోత్తమం!**
**ఫాల్గున్యాం ప్రయతో భూత్వా గోవిందస్య పురం వ్రజేత్!**

పున్నమి, పూర్ణిమ, పౌర్ణమి. వీటి అర్థపరమార్థాలు ఒక్కటే! ఇందుమతి, చంద్రమాత, జ్యోత్స్న- పున్నమకు మారు పేర్లు. పూర్ణమాసి, పౌషి అనేవీ పర్యాయ పదాలు. హోలికా పూర్ణిమ, మదనపూర్ణిమ అనీ వ్యవహరిస్తుంటారు.

వసంత ఋతువు ఆగమనానికి ముందుగా వచ్చే హోలీ నాడు శివకేశవులతో పాటు లక్ష్మీదేవిని పూజించడమూ పద్ధతిగా అమలవుతోంది. భాగ్యప్రదాయని లక్ష్మి. ఆదేవిని అర్చించడం సకలసౌభాగ్యకారకం. హోలీవేళ అనేకచోట్ల లక్ష్మీమాతను ఆరాధించి భక్తి ప్రపత్తులు తెలియజేస్తుంటారు.

శివపార్వతులను కలిపే లక్ష్యంతో పూలబాణాలు సంధించాడు మన్మథుడు. శివకల్యాణమనేది ఆయన సాధించ దలచిన లోకోత్తర కార్యం. ఆ సాధనలో భాగంగా, తపోదీక్షలోని స్వామితపస్సును భంగం చేయడంతో – త్రినేత్రప్రభావం అతనిని భస్మంగా మార్చింది. పతిని కోల్పోయి దుఃఖిత అయిన రతీదేవి ప్రార్థనతో శాంతించాడు పరమశివుడు. ఈ కథన నేపథ్యం లోనిదే హోలికీ వర్తిస్తుంది.

మానవులలోని కామక్రోధాదులను, ఇతరత్రా గల మోహమాత్సర్యాలను దహనం చేయాలి. పరమప్రశాంత జీవితాన్ని సాగించాలి. అందుకు దైవానుగ్రహం కోరుతూ నిర్వర్తించే క్రియాత్మక ఉత్సవమే **'కామదహనం'**. అందునా వసంతశోభను జీవితాన ఆహ్వానించే కీలక సన్నివేశం.

మంటల్లో హోలికను దగ్ధం చేయడం అంటే– చెడును అంతరింపజేయడం. మరునాడు పరస్పరం రంగులు చల్లు కుంటూ, తీపిపదార్థాలు పంచుకుంటూ, మహదానందాన్ని ప్రకటించడమంటే– విజయోత్సవ నిర్వహణం.

**'డోలాపూర్ణిమ'** అని కూడా ఈ పండుగకు పేరు. బాలకృష్ణుడిని ఊయలలో ఉంచి కొలిచే పర్వదినం. ఇదంతా కొన్ని ప్రాంతాల్లో కనువిందుగా సాగుతుంటుంది. మదురైలో అయితే మీనాక్షి, సుందరేశ్వర పరిణయవేళ. ఆ కారణంగా కల్యాణ పూర్ణిమగా వేడుక ప్రతీతి. ఈ సందర్భాలనే ఆయా చోట్ల డోలాయాత్రగానూ, వసంత ఉత్సవంగానూ పిలుస్తుం టారు. బృందావనం, నందగావ్, మరికొన్ని ప్రదేశాల్లో అంబరా న్నంటే సంబరాలు. చూసి తరించాల్సిందే!

రంగుల పొడిని, రంగురంగుల నీటిని చల్లుకోవడం వెనక ఎన్నెన్నో ఆనందోత్సాహాలు. ఇందులో ప్రేమ, అభిమానం, సమాదరణ, మిత్రభావన, సమైక్యతా దృక్పథం కలగలసి ఉన్నాయి. 'ప్రేమాభిమానాల వెల్లడిలో ఉండాల్సింది మానసిక ఉన్నతి, ఆధ్యాత్మిక రీతి' అనేదే అంతర్లీన సందేశం. అలనాటి నాటక రచన 'రత్నావళి' హోలీ మహోత్సవాలను విశదీ కరిస్తోంది. సంగీత, నర్తన కళల సమాహారంగా అవి విలసిల్లిన వైనాన్ని విపులీకరిస్తోంది ఆ కావ్యం. రాధాకృష్ణుల ప్రేమ పవిత్రం, అన్నింటికీ అతీతమైన ఆదర్శ అనుబంధం.

**పూచె వనలక్ష్మీ, పిండార బోసినట్లు**
**పండువెన్నెల జగమెల్ల నిండిపోయె;**
**యమున శీత సురభితో యమున దోగి**
**చల్లగా మెల్లగా వీచె పిల్లగాలి!....**

రాధాదేవి, కృష్ణదేవుని గాఢానురక్తిని; సరస సంగీత చక్రవర్తిత్వాన్ని, సకలభువనైక మోహన చారుమూర్తిమత్వాన్ని, ఆమె మానస విహార రాజహంస మందహాసాన్ని మనోనేత్రంతో దర్శిస్తారు ఆరాధకులందరూ.

అదే పండుగలో ఆ మహనీయమూర్తుల రంగుల క్రీడ ప్రతిఫలిస్తుంది. ఇదే విధంగా సామాజిక జీవనరంగాన ఉండాల్సిన సమైక్యతా ప్రతిబింబిస్తుంది. వారూ వీరూ అనే అంతరం లేకుండా ప్రతీ ఒక్కరినీ క్రీడాపరంగా మమేకం చేస్తుంది. వ్యక్తిగతంగా ఉల్లాసం, ఉమ్మడి రీతిన సత్సంబంధం విస్తరిస్తుందీ ఉత్సవంలో!

ఇదివరలో పూలు, సహజసిద్ధ పసుపు, కుంకుమను చల్లుకునేవారు. ఆ స్థానంలో ఇప్పుడు రంగులు రావడంతో నీటితో కలిపి ఒకరి మీద మరొకరు చల్లుతూ ఉత్సాహాన్ని పంచుకుంటున్నారు. మొక్కలనుంచి రూపొందిన సర్వసహజ రంగులను చల్లుకోవడం ఎంతైనా ఉత్తమం. పలు చెట్లకు చెందిన ఆకులు, పూలు, ఫలాలు, మరికొన్ని ప్రకృతిసిద్ధ ఫలిత పదార్థాలైతే ఆరోగ్యభాగ్యం.

హోలీలో అంతర్భాగంగా **'లక్ష్మీనారాయణ వ్రతం'** ఆచరిస్తారు. అలాగే **'అశోకపూర్ణిమవ్రతాన్నీ'** నిర్వర్తిస్తారు. వసంతకేళి మాదిరిగానే పూజాదికాలనీ భక్తిశ్రద్ధలతో నిర్వహి స్తుంటారు. మరీ ముఖ్యంగా 'అగ్నితో పునీతం' ఈ పర్వదినో త్సాహ అంతరార్థం. అనంతరం ఆ మంటల చుట్టూ ప్రదక్షిణ చేయడంతో, పవిత్రక్రతువు పరిపూర్తి అయినట్లు. అసంఖ్యాక జనావళికి ఇదొక పర్వదినం.

వీధికూడళ్ల మొదలు అతిపెద్ద మైదానాల వరకు సంబరాలూ సంరంభాలూ. హోలీహోలీలో రంగహోలీ, చమ్మ కేళిల హోలీ. రంగులతో, నీటితో ఆటపాటలు. అందాలూ ఆనందాలూ జీవితాల మకరందాలు. కాంతీక్రాంతీ, ప్రకాశం వికాసం అన్నీ ఇందులోనే. మధురమైన సంతోషానిచ్చే వసంత కేళిని శ్రద్ధాసక్తులతో స్వాగతిద్దాం!

మార్చి 28న ధర్మరాజు దశమి సందర్భంగా...


# సమవర్తి! నమో నమః

– శ్రీ జంధ్యాలశరత్‌బాబు, 99483 45013

ప్రాణుల ఫలితాల నిర్ణేత యముడు. ఆయనది నిర్దేశకత్వం. ధర్మాధర్మాల పరిగణన, వాటి ఆధారంగా నిర్ణయ విధింపు. అందుకే యమధర్మరాజుగా పురాణప్రశస్తి. ధర్మవర్తన నిశ్చయాధిపతి అన్నమాట. ఆ దండధరుడిని చైత్రమాసాన అందునా దశమిన పూజించడంలోనే అనంతవిశిష్టత ఉంది. 'యమధర్మ రాజాధిరాజా! నమో నమః'.

చలికాలం ముగిసి వాతావరణమంతా నులివెచ్చగా మారుతుండే సమయం చైత్రం. చెట్లు సరికొత్తగా చిగురించినట్లు, పూతపట్టి నవ్యతను సంతరించుకున్నట్లు కనిపించే సందర్భం. అదేవిధంగా దశమి అనేది ఆధ్యాత్మిక, ధార్మిక కార్యాల నిర్వహణకు అనువైనదీ, సర్వవిధాలా శుభప్రదమైనదీ. వీటన్నింటి నేపథ్యంలో, అందరూ నిర్వర్తించుకునే ధర్మరాజ దశమి పూజోత్సవం మరింత వివరంగా చెప్పాలంటే– ధర్మాచరణ క్రియకు నిర్వహించే పట్టాభిషేకం.

యమధర్మరాజు అనే పేరు వినగానే 'నల్లనివాడు, రక్త *నయనములవాడు భయంకర స్వరూపోల్లసనమ్మువాడు– గదనూని మహామహిషమ్ముపై ప్రవర్తిల్లెడి వాడు'* తలపులోకి వస్తాడు. 'కాలుని దున్నపోతు మెడ గంటల పట్టెడలోని కింకిణీ జాల ఘణం ఘనం ధ్వనులు' చలచల్లగ సాగుతూ వినవస్తాయి.



అంతటి యమదేవుడే అలనాడు సతీసావిత్రిని అభిమతాన్ని నెరవేర్చి ఆశీర్వదించిన విధానాన్ని అవలోకిస్తే.. అంతర్లీనంగా..

యముడితో పోరాడి మరీ భర్తప్రాణాలను తిరిగి సంపాదించిన సాధ్వీలలామసావిత్రి. మద్రదేశరాజు అశ్వపతి తనయ. సత్యవంతుడి సతీమణి. కోరివరించిన ఆమె తదుపరి కాలంలో ఒకనాడు సతీసమేతంగా అటవీప్రాంతానికి వెళ్లడం, అక్కడే కర్తవ్య ఆచరణకు యమధర్మరాజు రావడం విదిత కథనమే! అప్పుడు ఆయనది నలుపు ఆకారం, కోరల రూపం, నేత్రాలు అరుణవర్ణం. బంగారు వస్త్రాలతో, ఒక చేత యమపాశంతో అరుదెంచిన దేవతామూర్తి. ఆయువుతీరినందున సత్యవంతుని తీసుకు వెళ్లేందుకు వచ్చాననడం, అతని దేహం నుంచి జీవుడిని పాశంతో వెలికితీసి దక్షిణదిక్కున పయనమవ్వడం సైతం తెలిసిందే! అనుసరించిన సావిత్రి ఆ సమవర్తిని మాటలతో మెప్పించి, పలువరాల్లో అంతర్భాగంగా భర్తప్రాణాల్ని సంపాదించుకోవడం లోకవిదితం. సంతానప్రాప్తిని దైవం అనుగ్రహించడంతో...

**'వందనమో మహా మహిష వాహన! నీ దయచేత నాన్నకున్...**
**ఆనందము గల్గునా? నుతగుణా! పతిభిక్షననుగ్రహింపుమా!'**

అని సావిత్రి అర్థించడం, యమధర్మరాజు తథాస్తు అనడం, మనుజలోకాన సాధ్వులు భర్తలేక సంతానం ఏ రీతిన పొందగలరని ఆమె ప్రశ్నించడం విదితాంశాలు.

ధర్మరాజు దశమి ఉత్సవం ఆ స్వామికే హృదయాంకితం. జననమరణాలు సహజసిద్ధమే అయినా, వాటి పూర్వాపరాలు అనూహ్యమే! 'ఇక్కడి నుంచి అక్కడికి' వెళ్లడం వెనక అంతరార్థాన్ని తెలుసుకునేందుకు ఆనాడు ప్రయత్నించింది నచికేతుడు ఒక్కడే! ఆ కథ కఠోపనిషత్తులోనిది. ముని కుమారుడైన అతడు ఒకనాడు తన తండ్రి చేస్తున్న దానం తీరును గమనించాడు. పశుదానం ఉత్తమమైనా, సత్తువ తక్కువగా ఉన్నవాటిని ఇతరులకు ఇవ్వడం వల్ల ప్రయోజనమేమిటని ప్రశ్నించాడు. 'వీటిని సరే, మరి నన్ను ఎవరికి *ఇస్తావు'* అనడంతో, సహనం కోల్పోయిన జనకుడు

'ఆ యముడికి' అని బదులిచ్చాడు. ఫలితంగా యమ సందర్శనకు వెళ్ళి ముని తనయుడు మూడు రోజులు వేచి ఉండి మరీ ఫలప్రదుడయ్యాడు.

అతడి పట్టుదల నచ్చి మెచ్చుకున్న యమదేవుడు మూడు వరాలు అనుగ్రహించాడు. తండ్రికి ఉపశాంతి, స్వర్గలోకపు అనుభవప్రాప్తి. ఆత్మజ్ఞాన లభ్యత కోరాడు నచికేతుడు. మూడోవరం గురించే మొదట సంకోచం కలుగుతుంది యముడికి. ఆత్మస్వభావం, శాశ్వతత్త్వం, మరణానంతరం ఏమిటి?, బ్రహ్మ జ్ఞానసంబంధ అంశాల బోధనకు సంబంధించి యోచించాడు. నచికేతుడి జిజ్ఞాసను ఎంతగానో అభినందించి, చివరకు ఉపదేశించాడు.

జ్ఞానం పొందాలంటే ఉత్సుకత కలగాలి. అది భక్తి తత్త్వంతో సమ్మిళితంకావాలి. ప్రథమంగా, ప్రధానంగా ధైర్యం చోటు చేసుకోవాలి. మాట నిలబెట్టుకోకుంటే అసత్యదోషం వస్తుందనేది నచికేతుడి తండ్రి రీతితో విదితమవుతుంది. స్వర్గ అనుభవసిద్ధి అంటే–సంబంధిత యాగక్రతువు గురించిన అవగాహన. అందువల్లనే అది **'నచికేతయజ్ఞం'**గా విఖ్యాతి అందుకుంది.

ధనకనకవస్తువాహనాదులన్నింటినీ కాదని, బ్రహ్మ జ్ఞానాన్నే వరంగా కోరుకున్న నచికేతుడు లోకోత్తరచరితుడయ్యాడు. అంతటి ధన్యత, చరితార్థతను ప్రసాదించింది యమదేవుడు. పేరుకు తగిన ధర్మరాజు.

పరమపవిత్ర దశమినాడు ధర్మరాజ పూజ ఆయురారోగ్య భాగ్యాన్ని కలిగిస్తుందని భక్త జనుల ప్రగాఢ విశ్వాసం. ధర్మబద్ధ జీవితాన్ని ఆచరించడం, అంతేస్థాయిన సుగతిని అందిస్తుందని నిరూపితమవుతూ వస్తోంది. వ్యాధులూ బాధల భయాలకు, ఆందోళనకు తావు లేనిదే ఆరోగ్యకర అనుభవ సంపన్నత. మరణభయం లేకపోవడాన్ని మించిన, అంతవరకు దైవారాధనలోనే గడపాలన్న చింతనను మించిన జీవన సిద్ధాంతం ఇంకెక్కడ ఉంటుంది?

యమధర్మరాజుకి పూజావిధానం ఎంతైనా సహజ సిద్ధం. దీపాన్ని వెలిగించి ఉంచుతారు. అక్షతలతో సమర్పణ చేస్తారు. చందనాన్ని వినియోగిస్తారు. నీటితో భక్తితత్త్వాన్ని ప్రకటితం చేస్తూ, ఆచరణలో భాగంగా షోడశ ఉపచారాలను నిర్వర్తిస్తారు. వీటిల్లో దీప, ధూప, హారతి, నైవేద్యాదులు ఉంటాయి. పూజామందిరం శోభాయమానంగా అలంకృతమవుతుంది. పీఠం మీద స్వామి రూపును ఉంచి దీపారాధన చేయడంలో ఎంతో అర్థముంది. ఆశావాదానికి, ప్రకాశ వికాసాలకి చిహ్నం అది. ధూపం తదుపరి పసుపు, కుంకుమ, గంధం, పువ్వుల సమర్పణ. పాలు, పెరుగుతో అభిషేకాలు. స్తోత్ర, మంత్రపఠనాలు. అనంతరం అన్న, వస్త్ర, పుస్తక దానాలు. పూజల్లో భాగంగానే– ఆవాహనం, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, మరెన్నో. పండ్ల నైవేద్యముంటుంది.

## స్తోత్రపారాయణం ప్రకారం

**యమాయ ధర్మరాజాయ మృత్యవేచాన్తకాయ చ**
**వైవస్వతాయ కాలాయ సర్వభూత క్షయాయ చ।**
**ఔదుంబరాయ దధ్నాయ నీలాయ పరమేష్ఠినే**
**వృకోదరాయ చిత్రాయ చిత్రగుప్తాయ వై నమః॥**


దండన విధింపుపరంగా భగవద్గీతలోనివి విశదీకరిస్తాయి. యమధర్మరాజు రూపం పుణ్యాత్ములకు సౌమ్యంగానే సాక్షాత్కరిస్తుందని కాశీఖండం అభివర్ణిస్తుంది. ఆత్మతత్త్వజ్ఞాన ఉపదేశకునిగా ఆయనను కీర్తిస్తుంది స్కందపురాణం. అరుణాత్మజుడని, కాలకంఠుడని, అంతిమ నిర్ణాయకుడని వివరిస్తున్నాయి ఇతిహాస కథనాలు. యమునకు సోదరుడని, 'విశ్వ'కు పతిదేవుడని చాటి చెప్తున్నాయి కావ్యాలు.

యమధర్మరాజు కృతంగా శివకేశవ నామావళులున్నాయి. దక్షిణ దిక్పాలకుడని రచనలనేకం కొనియాడుతున్నాయి. యమధర్మస్తోత్రమైతే...

**తపసా ధర్మమారాధ్య పుష్కరే భాస్కరః పురా**
**ధర్మం సూర్యసుతం ప్రాప ధర్మరాజం నమామ్యహమ్।**

అంటోంది. **"సమతా సర్వభూతేషు యస్య సర్వస్య సాక్షిణః, అతో యన్నామ శయనమితి తం ప్రణమామ్యహమ్"** అనీ చెప్తోంది. **"తపస్వీ బ్రహ్మనిష్ఠో యః సంయమీ సంజితేంద్రియః జీవానాం కర్మఫలదస్తం యమం"** అంటూ నమస్సులర్పిస్తోంది భక్తజనవాహిని. యమధర్మరాజ దశమి రోజున పట్టాభిషేకం అంటే– ఆత్మజ్ఞాన తత్త్వ ప్రాభవాన్ని ప్రకటితం చేసుకోవడం! పూజలూ వ్రతాలతో లోపలి శక్తిని విస్తృతపరచడం! కలిమి, బలిమిల మిశ్రిత వాహిని ధర్మరాజు దశమి.

విశ్వదాభిరామం    వేమన పద్యసూక్తి



## దానం - కర్తవ్యం

దాన మడుగువాడు ధరలోన నధముండు;
దాన మడుగ డేని దైవసముడు;
దాన మీనివాడు ధన్యుండు కాడయా!
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** ధరలోన= భూమిలో; అధముడు= నీచుడు; దైవసముడు= దేవుడితో సమానమైనవాడు; ధన్యుండు= ధన్యత పొందినవాడు..

**భావం:** లోకంలో యాచిస్తూ జీవించేవాడు నీచుడు. యాచన చేయనివాడు దేవుడితో సమానం. దానం చేయనివాడు ధన్యుడు కాడు.

**వివరణ:** యాచన నీచగుణం. దానంకోసం యాచించేవాడు గడ్డిపోచ కంటె తేలిక అయిపోతాడు. అందుచేత యాచన చేయగూడదు. ఈరోజుల్లో దృఢంగా ఉన్నవాళ్లు అడుక్కుని జీవిస్తున్నారు. మరి కొందరు గుడ్డి, కుంటివాళ్లు కూడ ఏదో చేతనయిన పని చేసుకుంటూ బతకటం గమనిస్తాం. ఎంతటి క్లిష్టపరిస్థితిలోనూ ఇతరులను యాచించకుండా జీవించేవాడు నిజంగా దేవుడే. కాని, అదే స్థితిలో నిజంగా ఆపదలో ఉండి తప్పనిసరి పరిస్థితిలో యాచించినవాడికి ఇవ్వకపోవడం కూడా నీచమే. అంటే దానం చేయడానికి తగినంతశక్తి ఉండి కూడా దానం చేయనివాడిజన్మ వ్యర్థం. ఆపదలో ఉండి, అడిగినవాడికి తప్పకుండా దానం చేయాలి అని తాత్పర్యం.

*- కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు*

భాస్కరశతకం

## బలసంపన్నులైన కుమారులుంటే కోర్కెలు నెరవేరుతాయి

భుజబలశౌర్యవంతులగు పుత్రులఁ గాంచిన వారి కెయ్యెడన్
నిజహృదయేప్సితార్థములు నిక్కము చేకుఱుఁ గుంతి దేవికిన్
విజయబలాఢ్యుఁ డర్జునుఁడు వీరపరాక్రమ మొప్ప దేవతా
గజమును దెచ్చి తల్లి వ్రతకార్యము దీర్చఁడె తొల్లి భాస్కరా!



**తాత్పర్యం**

భాస్కరా! బహుబలసంపన్నులైన కుమారులను కన్నవాళ్లకు కోర్కెలు నెరవేరుతాయి. ఇది నిజం. పూర్వకాలంలో విజయుడని పేరు గాంచిన పరాక్రమశాలి అయిన అర్జునుడు తన శౌర్యాన్ని వెలయించి, స్వర్గంలోని ఐరావతాన్ని తీసికొని వచ్చి తల్లి నోమును ఫలింపజేయలేదా!


*- సంకలనకర్త: డా॥తిరుమల శ్రీనివాసాచార్య*


చిత్ర కథ

# శ్రీరామ- సుగ్రీవమైత్రి

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్

రావణాసురుడు సీతాదేవిని అపహరించి తీసుకు వెళ్లాడు. ఆమెను వెదుకుతూ రామలక్ష్మణులు ఋశ్యమూక పర్వతం దగ్గరికి చేరుకున్నారు. కొండపై నుంచి సుగ్రీవుడు వాళ్లని చూశాడు. హనుమంతునితో సుగ్రీవుడు...




శ్రీరామలక్ష్మణులు మారుతిని మీరెవరని అడిగారు.
పూజ్యులారా! నా పేరు ఆంజనేయుడు. నేను సుగ్రీవునికి మంత్రిని. సుగ్రీవుడు వానరరాజు. వాలి అధర్మంగా సుగ్రీవుని రాజ్యభ్రష్టుని చేశాడు. సుగ్రీవుడు నీ సహాయంకోరుతున్నాడు.
తర్వాత రామలక్ష్మణుల్ని హనుమంతుడు సుగ్రీవుడి దగ్గరికి తీసుకు వెళ్లాడు. సుగ్రీవుడు సాదరంగా స్వాగతం పలికాడు.
శ్రీరామా! వాలి నా భార్యని రాజ్యాన్ని తన అధీనంలో ఉంచుకున్నాడు. నువ్వే ఈ అధర్మాన్ని సరిదిద్దాలి! నేను సీతాదేవి జాడని కనుక్కుంటాను!
సుగ్రీవుని మాటలు విని శ్రీరాముడు సంతోషించాడు
సుగ్రీవా! వాలిని వధిస్తాను. ధర్మరక్షణ చేస్తాను.
హనుమంతుడు రెండు జమ్మికర్రలు తెచ్చి వాటిని మథించి అగ్ని పుట్టించాడు. రామ-సుగ్రీవులు...
ఈ అగ్నిసాక్షిగా మన మైత్రి వర్ధిల్లుతుంది.
ఇద్దరూ పరస్పరం వాగ్దానాలు చేసుకున్నారు. హనుమంతుడు సాక్షిగా నిలిచాడు.
శ్రీరామ-సుగ్రీవుల మైత్రి లోకానికి ఆదర్శంగా నిలుస్తుంది.

బాలనీతి

# దానమహిమ


- శ్రీమతి ఎం.సత్యవతి

గంగిగోవుపాలు గరిటెడైనను చాలు, కడవడైన నేమి ఖరముపాలు, భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు– అన్నాడు. యోగి వేమన. చాలామంది పుణ్యం సంపాదించాలనో, ఆడంబరం కోసమో, విరివిగా దానాలు చేస్తారు. అంతకు అంతే ఫలం లభిస్తుందన్నది సందేహం.

ఒక ఊళ్ళో ఒక ధనవంతుడు ఉండేవాడు. అతను ప్రతిరోజూ ఒక మణుగు ధాన్యం దానంగా ఇచ్చేవాడు. పని వారు రోజూ మణుగు ధాన్యం కొలిచి, బీదసాదలకి దానంగా ఇచ్చేవారు. ఎప్పుడైనా ధనవంతుడు వచ్చి చూసేవాడు.

ఆ ధనవంతునికి ఒక కోడలు ఉండేది. ఆమె ప్రతిరోజూ తాను స్వయంగా వంట చేసి, ఇద్దరికి అన్నదానం చేసేది. వారిని కూర్చోపెట్టి, వారు తృప్తిగా తినేదాకా దగ్గరుండి వడ్డించేది.

ధనవంతుడు, మరుజన్మలో ఒక రాజుగారికి పట్టపు ఏనుగుగా జన్మించాడు. రాజ లాంఛనాలతో, అంబారీ అమర్చి, అలంకరణలతో వైభవంగా ఉండేవాడు. అతనికి రోజూ, ఒక మణుగుధాన్యం ఆహారంగా లభించేది. కోడలు కూడా అదే రాజు గారికి కుమార్తెగా జన్మించింది. రాజభోగాలతో విలాసాలతో తేలియాడేది.



ఒక రోజు ఆమె ఎక్కడికో వెళ్లవలసి వచ్చింది. పట్టపు ఏనుగుపై వెళ్లాలని ముచ్చటపడింది. ఏనుగును చక్కగా అలంకరించారు. రాజకుమార్తె కూడా చక్కగా అలంకరించుకుని వచ్చింది.

ఆమెని చూడగానే ఏనుగుకి గత జన్మ అంతా జ్ఞాపకం వచ్చింది. రోజూ మణుగు ధాన్యం దానం చేసిన తనకి ఈ జంతుజన్మా! తమ వద్ద అణిగి మణిగీ పడి ఉండి, తమ అదుపాజ్ఞలలో ఉండే ఈ కోడలికి ఇంతవైభోగమా? తాను ఆమెను శిరసావహించాలా?

ఏనుగుకి అంతులేని దుఃఖం వచ్చింది. కళ్ళ వెంట నీళ్లు కారుస్తూ క్రింద కూలబడిపోయింది. మావటివాళ్లు అదలించినా కదలలేదు. కాపలా భటులు బెదిరించినా లక్ష్య పెట్టలేదు. తల అడ్డంగా ఊపుతూ నిరాకరణని తెలియచేస్తూ తొండాన్ని వేగంగా ఆడిస్తూ నిరసన తెలియచేసింది.

అందరూ ఏనుగు వింత ప్రవర్తనకి కారణం తెలియక ఆశ్చర్యపోయారు. చూసిన వాళ్లు అందరూ విస్తుపోయారు. రాజ కుమార్తె ఏనుగుని సమీపించింది. వెంటనే ఆమెకి కూడా తన పూర్వజన్మ జ్ఞాపకం వచ్చింది.

వెంటనే ఏనుగుని సమీపించి “మామగారూ! మీ మనోగతం నాకు అవగతమయింది. మణుగుధాన్యం దానం చేసిన తమకు జంతుజన్మ లభించగా, మీ పంచన పడి ఉన్న నాకు ఇంత వైభోగమా? అని కదా మీ బాధ. మామగారూ! మీరు మణుగు ధాన్యం దానం చేసిన మాట నిజమే. కాని ఏ ఒక్కరోజైనా మీరు స్వయంగా శ్రద్ధగా దానం చేసారా? పని వాళ్ళకి అప్పగించి మీరు పర్యవేక్షణ చేసేవారు. అయినా, మీకు అందుకే ఈ జన్మలో ప్రతిరోజూ ఒక మణుగు ధాన్యం ఆహారంగా లభిస్తుంది. నేను అలా కాదు. ఇద్దరికే భోజనం పెట్టినా, వారికి స్వయంగా వండి దగ్గరుండి వడ్డించి వారు తృప్తిగా భుజించేటట్లు చేసేదాన్ని. భగవంతుని నిర్ణయానికి అతనిచ్చిన దానికి మనమేమి చేయగలం?” అని అన్నది.

అప్పుడు ఏనుగుకి జ్ఞానోదయం అయింది. నిజమే తాను మణుగు ధాన్యం దానమిచ్చినా సక్రమంగా ఇవ్వలేదు. పనివారిని ఇవ్వమని, ఎప్పుడైనా తీరిక ఉంటే అటువైపుగా వెళ్లి మదించిన మత్తగజంలాగా చూసి వెళ్లేవాడు. తన కోడలు అలా కాకుండా ఎంతో భక్తితో దానం చేసింది. అందుకనే, ఆమెను భగవంతుడు విశేషంగా అనుగ్రహించాడు. భగవంతుని నిర్ణయానికి తిరుగులేదు.

ఏనుగు మనస్సు కుదుటపడింది. దుఃఖం శాంతించింది. సంతోషంగా లేచి, నిలబడి “అమ్మాయీ! నీవు నాకు శిరోధార్యవు. నీవు ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి నా శిరస్సున ధరించి తీసుకువెళ్తానమ్మా” అని అన్నది.

**నీతి:** దానం శ్రద్ధగా చేయాలి.

# క్విజ్ 44

01) అతిథిని ఏమిగా భావించాలి? జ)..........

02) సీతారాముల కల్యాణ తిథి ఏంది? జ)..........

03) కాలంతో పాటు దేనిని నిర్వర్తించాలి? జ)..........

04) క్యాలెండర్ జీవిత ప్రయాణానికి ఎలాంటిది? జ)..........

05) మనం ఇతరుల కోసం జీవించడాన్ని ఏమంటారు? జ)..........

06) శ్రీనివాసుడు వినోదార్థం ఎక్కడకు వెళ్ళాలని సంకల్పించాడు? జ)..........

07) పరమాత్ముని సృష్టిలో ప్రధానమైంది? జ)..........

08) కృషి ఉంటే మనుషులు ఏమవుతారు? జ)..........

09) ఆళ్వార్ తిరునగరిలో వెలసిన చింతచెట్టు ఎవరి అంశ? జ)..........

10) సీతమ్మ శ్రీరాముల ఎడమవైపు ఉంటే ఏమి సిద్ధిస్తుంది? జ)..........

11) ఈ ప్రపంచమంతా ఎందులో ఉంది? జ)..........

12) పూర్వమీమాంసను రచించినది ఎవరు? జ)..........

13) పురాణానికి ఎన్ని లక్షణాలుండాలి? జ)..........

14) ఆరోగ్యప్రాప్తికి మహత్తర ఔషధం ఏమిటి? జ)..........

15) ప్రాణుల ఫలితాల నిర్ణేత ఎవరు? జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-03-2026**.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........

పాఠశాల: .......... తరగతి: ..........

పేరు: ..........

చిరునామా: ..........

..........

..........

.......... పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ..........

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

## బాలవినోదం

### పిల్లలూ మన సంప్రదాయంలో వచ్చే తిథులు- అధిదేవతలను తెలుసుకుందాం..!

కాలచక్రాన్ని లెక్కగట్టే సాధనాల్లో తిథులకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఒక్కో తిథికి ఒక్కో దేవత అధిపతిగా ఉంటుంది. ఆ వివరాలు..

| తిథి | అధిదేవత |
|---|---|
| పాడ్యమి | అగ్ని |
| విదియ | అశ్వినీ దేవతలు |
| తదియ | గౌరీదేవి |
| చవితి | వినాయకుడు |
| పంచమి | నాగదేవత |
| షష్ఠి | సుబ్రహ్మణ్యేశ్వరుడు |
| సప్తమి | ఆదిత్యుడు |
| అష్టమి | అష్టమాతృకలు |
| నవమి | దుర్గాదేవి |
| దశమి | ఇంద్రాది దశదిక్పాలకులు |
| ఏకాదశి | కుబేరుడు |
| ద్వాదశి | మహావిష్ణువు |
| త్రయోదశి | ధర్ముడు |
| చతుర్దశి | రుద్రుడు |
| పౌర్ణమి | చంద్రుడు |
| అమావాస్య | పితృదేవతలు |

### క్రింది వాక్యాలను సరైన జంతువులు/మూగజీవులతో నింపండి!

1) పెంపుడు ❑❑విశ్వాసానికి మారు పేరు.

2) అతని పరిస్థితి ఒడ్డున పడ్డ ❑❑లా ఉంది.

3) ❑❑❑చెవులు చేటలవలె ఉంటాయి.

4) మొదటి నుంచీ ❑❑❑కన్నీళ్లు కార్చడం ఆమె కలవాటు.

5) తాను పట్టిన ❑❑❑కు మూడే కాళ్లు అనే రకం అతను.

జవాబులు: 1)కుక్క 2)చేప 3)ఏనుగు 4)మొసలి 5)కుందేలు

### క్రింద పదాలలో గీత గీసిన అక్షరాలను సరి చేయండి!

1) జమకాయ -

2) టపకాయ -

3) తతతల -

4) వనకలం -

5) ఎండకలం -

జవాబులు: 1)జామకాయ 2)టపాకాయ 3)తాతతల 4)వానాకాలం 5)ఎండాకాలం

### సరైన పదాలతో వృత్తాన్ని పూరించండి!

ఆధారాలు

1) ఈ యుగం పేరు

2) కట్నం

3) జంతువును ఇలా ఇస్తారు


4) మొదటిది

5) వీచేది

6) కరుణతో చూడటం

7) శిల్పాన్ని దీనితో చెక్కుతారు

8) చెక్కపొట్టు




జవాబులు: 1)కలి 2)ఓలి 3)బలి 4)తొలి 5)గాలి 6)జాలి 7)ఉలి 8)నలి

### క్రింద ఇచ్చిన ఆధారాలను బట్టి ఆంగ్లఉచ్చారణతో మొదలయ్యే తెలుగు పదాలు రాయండి!

1) విష్ణుస్థానం - Y❑❑

2) నవరత్నాల్లో ఒకటి - Y❑❑

3) ఓ తెలుగు నెల - Y❑❑

4) పొడవు×వెడల్పు - Y❑❑

5) విధం - Y❑❑

6) సీత - Y❑❑

7) ఓటమి - Y❑❑

8) ఘనం - Y❑❑

9) శత్రుత్వం - Y❑❑

10) చికిత్స చేసేవాడు - Y❑❑

జవాబులు: 1)కుంఠం 2)డూర్యం 3)శాఖం 4)శాల్యం 5)ఖరి 6)దేహి 7)ఫల్యం 8)పులం 9)రము 10)ద్యుడు

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** సమస్త ఐశ్వర్యాలు కలుగుతాయి. జీవన విధానం సజావుగా ఉంటుంది. ధార్మిక కార్య క్రమాలకు మీ వంతు సహాయం చేస్తారు. భూగృహస్థిరాస్తుల విషయంలో లాభపడతారు. సోదరుల అండ దండలు ఉంటాయి.



**వృషభం–** అధికార విస్తరణ అవుతుంది, ఉద్యోగంలో ప్రమోషన్ లేదా ఇంక్రిమెంట్ వృత్తి పరంగా ముందంజ వేస్తారు. వ్యాపారస్తులకు, కళాకారులకు అధికాదాయం, మాతృ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం.



**మిథునం–** ముఖవర్ఛస్సు శరీరసౌష్ఠవం తెలివి తేటలు ఇతరులను ప్రభావితం చేసే నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. ధనం నిల్వచేస్తారు. ఇతరులకు ప్రయోజనకారిగా ఉంటారు.



**కర్కాటకం–**పరస్పర భావోద్వేగములకు ప్రతి స్పందన వస్తుంది. ఒకే మనస్తత్వము గల మనుషుల సమాగమము వలన సమాజంలో ప్రయోజనం కల్గుతుంది. నిత్యనూతనంగా యవ్వనంగా ఇతరులకు కనిపిస్తారు.



**సింహం–**మానసికక్షోభ, శారీరకరుగ్మత, అస్వస్థత కల్గుతుంది. పనిచేసే చోట ఒత్తిడిని కలిగియుం టారు. మీ పై అధికారి లేదా సహోద్యోగులతో దురుసుగా వ్యవహరించడం తగదు. దీని వల్ల చిక్కులు కల్గుతాయి.



**కన్య–** అందమైన అలంకరణ వసతులు గల గృహాన్ని కొనుగోలు చేస్తారు. స్వచ్ఛమైన భాషతో నిష్కల్మషమైన మనస్సుతో అందర్నీ ఆకట్టు కుంటారు. శ్రమకు తగిన ఫలితమొస్తుంది.



**తుల–** అన్ని గ్రహాలు అనుకూలంగా ఉన్నాయి. పుష్కలమైన ఆరోగ్యంతో నిత్యనూతనంగా కనిపి స్తారు. సామాజిక కార్యక్రమాల్లో నాయకత్వం వహించి అందరి మన్ననలను పొందుతారు.



**వృశ్చికం–**ఆరోగ్యవిషయంలో మరింత శ్రద్ధ అవసరం. ఎక్కువగా రక్తం, పొట్టకు సంబం ధించిన వ్యాధులు వచ్చే అవకాశం కూడా ఉంది. మీరు ఆందోళన చెందే అవకాశం ఉంది.



**ధనుస్సు–** తలపెట్టిన పనులు సకాలంలో పూర్తి అగుట, ధైర్యంతో వ్యవహార జయము, ఉద్యోగ విషయాలలో ముందంజ, అన్ని వృత్తులవారికి జీవనవృద్ధి వ్యక్తిగత లాభం, స్థాయి పెరగడం పుష్కలమైన ఆరోగ్యం.



**మకరం–** నెలాఖరుకు వ్యవహారజయము, జీవన పురోగమనము, ఇతరులకు శాయశక్తులా సహాయం చేయడం అపరిష్కృత సమస్యలను స్వశక్తితో కృషిచేసి అందరి మన్ననలు పొందడం యత్నకార్యసిద్ధి కలుగును.



**కుంభం–** స్థానికులు కుటుంబ సభ్యులు మరియు జీవిత భాగస్వామితో శాంతియుత సంబంధాలు కలుగుతాయి. కాలం సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. సమాజం గౌరవం ఇస్తుంది. వృత్తిలో కొత్త స్థానాన్ని పొందుతారు.



**మీనం–** నిర్లిప్తత మరియు నిస్తేజం ఆవహిస్తుంది. తలనొప్పి లేక గొంతునొప్పి ప్రయాణానికి దూరంగా ఉండాలి. ప్రయాణాలు వాయిదా వేయాలి. ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

1. పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

2. కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

3. సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

4. విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

5. చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

6. చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

............................................................ తేది :..................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.


3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

122

# శ్రీపదకేళి




**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)చైత్రవైశాఖ మాసాలు ఈ ఋతువు(6); 4)కాకి(3); 5)ప్రతాపరుద్రుని మంత్రి(5); 9)విష్ణువు వరాహ అవతారము ఎత్తిన కాలము(6); 12)కర్ణుని పెంచిన తల్లి(4); 13)ప్రేమ(3); 16)సుగ్రీవుని భార్య(2); 17)ఒక అప్సరస(3)

**నిలువు** 1)పురూరవునకు, ఊర్వశికిని పుట్టిన కుమారుడు(4); 2)చెత్త(3); 3)వసంతఋతువు రాగానే ఈ పక్షి కూస్తుంది(3); 6)పాండవాగ్రేసరుడు(4); 7)దమయంతి సోదరుడు(3); 8)ఫాల్గుణ బహుళ ఏకాదశి(6); 10)కశ్యపుని భార్య(3); 11)చైత్రశుద్ధపాడ్యమి నుండి ప్రారంభమయ్యే సంవత్సరాది పేరు(4); 14)పుప్పొడి(3); 15)పుష్పము(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC



## తిరుపతి


# శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం


2026, మార్చి 16 నుండి మార్చి 25 వరకు

| తేదీలు | వారము | పగలు ఉత్సవములు | రాత్రి ఉత్సవములు |
|---|---|---|---|
| 16-03-2026 | సోమవారం | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 17-03-2026 | మంగళవారం | ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 18-03-2026 | బుధవారం | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 19-03-2026 | గురువారం | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 20-03-2026 | శుక్రవారం | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 21-03-2026 | శనివారం | పల్లకీలో మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 22-03-2026 | ఆదివారం | హనుమద్వాహనం, సా॥ వసంతోత్సవం | గజవాహనం |
| 23-03-2026 | సోమవారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 24-03-2026 | మంగళవారం | రథోత్సవం | అశ్వవాహనం |
| 25-03-2026 | బుధవారం | పల్లకీ ఉత్సవం తీర్థవారి అవభృథోత్సవం, చక్రస్నానం | ధ్వజావరోహణోత్సవం |



**SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY**
**Published by Tirumala Tirupati Devasthanams Printing on 25-02-2026 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 “LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026” Posting on 1st of Every Month.**






దినము ద్వాదశి నేఁడు తీర్థదివసము నీకు
జనకుఁడ అన్నమాచార్యుఁడ విచ్చేయవే

అనంతగరుడ ముఖ్యులైన సూరిజనులతో
ఘన నారదాది భాగవతులతో
దనుజమర్దనుఁడైన దైవశిఖామణితోడ
వెనుకొని యారగించ విచ్చేయవే

వైకుంఠాన నుండి యాళువారలలోపల నుండి
లోకపు నిత్యముక్తులలోన నుండి
శ్రీకాంతతోడనున్న శ్రీవేంకటేశుఁ గూడి
యీకడ నారగించ నింటికి విచ్చేయవే

సంకీర్తనముతోడ సనకాదులెల్లఁ బాడ
పొంకపు శ్రీవేంకటాద్రి భూమినుండి
లంకె శ్రీవేంకటగిరి లక్ష్మీవిభుఁడు నీవు-
నంకెల మాయింటి విందు లారగించవే

(అధ్యాత్మ సంకీర్తన సంపుటము 2-151)

## శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల వర్థంతి
(15-03-2026)

పెద తిరుమలయ్య తన తండ్రి యెడల అపారమైన భక్తిప్రపత్తులను కనబరిచి నాడు అన్నమాచార్యుల పుణ్య తిథి, ఫాల్గుణ బహుళద్వాదశినాడు ఆచార్యునికి భక్ష్య భోజ్యాదులనర్పించి శ్రీలక్ష్మీసమేతుడైన శ్రీవేంకటేశ్వరునుతో, వైష్ణవ భక్తాగ్రేసరులతో విందులారగించగా విచ్చేయమని తిరుమలయ్య ఆర్ద్రతతో పాడుకున్న పాటే అతని పితృభక్తికి అక్షర తార్కాణం.